ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం


Sahitya Prasthanam

సంపుటి - 3 సంచిక - 2 నవంబరు - 2021 ప్లవ పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి






## మాలపల్లి శతవార్షికోత్సవం, నూతన సంవత్సరం

# 2022 జనవరి

# సాహిత్య ప్రస్థానం ప్రత్యేక సంచిక

కరోనా తాకిడి నుంచి ఇప్పుడే బయటపడి ఊపిరి పీల్చుకున్నామనుకుంటుంటే మూడవ ముప్పు గురించిన హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఇంతటి కరోనాలో అనేక సవాళ్ల సమస్యల మధ్య సాహిత్య ప్రస్థానం నిర్విఘ్నంగా కొనసాగించామంటే శ్రేయోభిలాషుల వదాన్యత, కార్యకర్తల పట్టుదలే కారణం. అయితే జీవన పోరాటం, వివిధ రంగాల కార్యకలాపాలు నిరవధికంగా వాయిదా వేసుకోవడం, నిలిపేయడం జరిగే పని కాదు. ప్రతిఏటా ఒక ప్రత్యేక సంచిక తీసుకొచ్చే ప్రస్థానం వరవడి ఈ రెండేళ్లూ సాధ్యం కాలేదు. ఆ లోటు కూడా తీరే విధంగానూ, సందర్భోచితంగానూ ఈ డిసెంబర్, 2022 జనవరి కలిపి ప్రత్యేక సంచిక వెలువరిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం.

తెలుగువారి చరిత్రలో సాటిలేని స్థానమాక్రమించిన **ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవల శతవార్షికోత్సవం** ఇప్పుడు జరుగుతున్నది. స్వాతంత్ర పోరాటం, సంఘసంస్కరణోద్యమం, సామ్యవాద భావజాలం బీజాలు, సామాజిక న్యాయకోణం మేళవించిన ఒక సంపూర్ణ రచన వందేళ్ల కిందటే వెలువడటం తెలుగువారి చైతన్యానికి నిదర్శనం. స్వతంత్ర యోధుడైన ఉన్నవ రాయవేలూరు జైలులో ఉండగానే ఈ నవల రాశారు. 1922 ఏప్రిల్‌కు పూర్తయిన నవలను జైలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ప్రభుత్వ వ్యతిరేక అంశాల కోసం వెతుకులాట ప్రారంభించారు. కాని ఆ నవల జైలుగోడలు దాటి 1922 డిసెంబర్ నాటికి పుస్తకరూపంలో వచ్చింది. 1923, ఆ తర్వాత మరో రెండు భాగాలు వెలువడ్డాయి. 1935లో కాశీనాథుని నాగేశ్వరరావు నాలుగు భాగాలు కలిపి పూర్తి నవలగా ప్రచురించారు. బోల్షివిక్ విప్లవం గురించి తొలుతగా ప్రస్తావించిన ఈ నవల ఎప్పటికప్పుడు అనేక నిషేధాలూ నిర్బంధాలూ ఎదుర్కొన్నది. కానీ, ఉన్నవ తన భావాల విషయంలో రాజీ పడలేదు. మాలపల్లిపై చాలా చర్చలు జరిగాయి, ఇంకా జరుగుతాయి కూడా. మదింపులూ, పునర్మూల్యాంకనాలు ఎలా వున్నా తెలుగువారు సగర్వంగా చెప్పుకోదగిన, స్మరించుకోవలసిన నవల మాలపల్లి. ప్రస్థానం ప్రత్యేక సంచికలో మాలపల్లి నవలలోని వివిధ కోణాలపై సాహిత్య ప్రముఖులూ, సామాజికవేత్తల రచనలను మీకందించబోతున్నాం.

**2022లో ఇదే తొలి సంచిక గనక నూతన సంవత్సర ప్రత్యేక వ్యాసాలు కూడా ఉంటాయి.** ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక ఒడుదుడుకుల మధ్య ఈ విధమైన ప్రయత్నం ఎంత కష్టమో మీకు తెలియంది కాదు. ఈ సంచికకు మీ నుంచి ఇతోధికంగా సహాయ సహకారాలు, విరాళాలు, ప్రకటనలు కోరుతున్నాం. వ్యక్తులుగా సంస్థలుగా మీ చేయూతను ఆశిస్తున్నాం. కవులూ రచయితలూ సాహిత్యాభిమానులు కూడా తమ శక్తి మేరకు ఆదుకోవాలని కోరుతున్నాం. కార్యకర్తలు మీ దగ్గరకు వచ్చినప్పుడు మీ సహాయం అందించవొచ్చు. నేరుగానూ పంపొచ్చు.

ప్రస్థానం నిర్వహణకూ, సాహితీ స్రవంతి కార్యకలాపాలకు మీ అండదండలే ఆలంబన.

**- తెలకపల్లి రవి,**

ప్రధాన సంపాదకుడు

# సాహిత్య ప్రస్థానం


## ప్రశాంతత, ప్రజాస్వామ్యం

**ఆం**ధ్రప్రదేశ్ రాజకీయాలు అంతకంతకూ అధ్వానంగా మారుతున్నాయి. అధికార పోటీలో అసహనాలు పరాకాష్టకు చేరి అసలు సమస్యలు తెరమరుగై అవాంఛనీయ ద్వేషావేశాలు పెట్రేగుతున్నాయి. అనవసర వివాదాలు, అసభ్య భాషా ప్రయోగాలు భరించలేని స్థాయిని అందుకోవడమే గాక రాజకీయ రాజ్యాంగ సవాళ్లుగా పరిణమిస్తున్నాయి. ఇటీవల ఒక పార్టీ అధికార ప్రతినిధి ఉపయోగించిన ఒక అనుచితమైన మాటతో రగిలిన మంటలు రాష్ట్రపతి భవన్ వరకూ వెళ్లడం చరిత్రలో ఎరగని విపరీతం. విభజిత రాష్ట్రానికి రావలసిన నిధులు, ప్రత్యేక హోదా, అపరిష్కృత విభజన సమస్యలు, పోలవరం పూర్తి, వెనకబడిన ప్రాంతాల నిధులు, అమరావతి ప్రతిష్టంభన, విశాఖ ఉక్కు అమ్మకం నిలిపివేత వంటి అత్యవసర అంశాలు కనుమరుగై... పరస్పర దూషణలు రాష్ట్రాన్ని ఆవరించాయి. శ్మశానాల వంటి నిఘంటువులు దాటి అని శ్రీశ్రీ అన్నట్టు నాగరిక వ్యవహారంలో మామూలుగా ఉపయోగించని బూతులు, తిట్లు యథేచ్ఛగా వాడేస్తున్నారు. సీనియర్ నాయకులూ ప్రజా ప్రతినిధులూ మంత్రులూ కూడా రెచ్చిపోయి తిట్టుకుంటుంటే– ప్రాయోజిత సోషల్ మీడియా సైట్లు వాటికి మరింత మసాలా జోడించి మలినం వెదజల్లుతున్నాయి. తెలుగు రాష్ట్రాభివృద్ధి పక్కకుపోయి.. అసభ్య భాషా ప్రయోగాలు వికృతమై నిత్యకృత్యమై వెగటు పుట్టిస్తున్నాయి.

చైతన్యవంతమైన రాజకీయాలకు పేరెన్నిక గన్న తెలుగు ప్రజలు ఈ బూతు పురాణాలు, ఉద్రిక్తతలు సహించలేకపోతున్నారు. ఎక్కడ ఎవరిని కలిసినా ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఎపిలో కుల ఘర్షణలు సృష్టించిన విధ్వంసం వారింకా మర్చిపోలేదు. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం మరోసారి కుల మత చిచ్చును ఎగదోసే ప్రయత్నాలు వారికి ఆందోళన కలిగిస్తున్నాయి. కేంద్రం వివక్ష కారణంగా దారుణంగా దగాపడిన ఈ రాష్ట్రం ఏకంగా రాష్ట్రపతి పాలనలోకి పోవాలని కోరడం ఒక యాంటీ క్లైమాక్స్. అసభ్య ప్రయోగాలను ఖండించవచ్చు గాని ప్రభుత్వాలు విమర్శలు స్వీకరించలేకపోవడం, ప్రజా ఉద్యమాలను ప్రతికూల దృష్టితో చూడటం, ప్రతిదానికి పోలీసులను ప్రయోగించడం, కేసులు బనాయించడం అనుచితం. ఈ పోటాపోటీలో రాష్ట్ర రాజకీయ ఎజెండా దారితప్పడం అనుమతించరానిది. అనేక సంక్షోభాలతో అప్పుల భారంతో కేంద్రం వివక్షతో అల్లాడుతున్న ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవడం, ప్రజల కోసం పోరాడటం ముఖ్యం తప్ప తమ రాజకీయ ప్రయోజనాలు అధికార కాంక్షలే పరమావధిగా వ్యవహరించేవారు తగు మూల్యం చెల్లించవలసి ఉంటుంది. ఒక సాహిత్య పత్రికగా మేము ప్రత్యేకించి భాషను అసభ్యమార్గం పట్టించడాన్ని ఖండిస్తున్నాం. ఎపికి కావలసింది ప్రశాంతత, ప్రజాస్వామ్యబద్ధమైన ప్రగతి. అందుకోసం అందరం కలసి అడుగేయడమే మార్గం. ■


ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
సత్యాజీ

సంపాదకవర్గం
కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్
◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి
మేనేజర్ : కె.లక్ష్మయ్య

బొమ్మలు
తుంబలి శివాజి
చిదంబరం



Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు

పరిణతి – కేశవ్ ..................... 5
కాంతిరేఖ – సిహెచ్‌సిఎస్ శర్మ...... 29
తిరపతి నాయుడు – కృపాకర్ పోతుల ....... 38
భద్రత – నల్లపాటి సురేంద్ర ...... 51

## కవితలు

వ్యూహాత్మక వాక్యాలు – కంచరాన భుజంగరావు 11
ఓ కవీ, కర్తవ్యం నిర్వర్తించు – విశ్వశాంతి ............ 14
నాటకం – కుంచెశ్రీ .................. 19
మనిషిని ఈడ్చుకుపోతూనే ఉంది– నారాయణ రావు... 19
మట్టి పరిమళం – కొలచిన రామ జగన్నాథ్ 22
మా ఊరు – పావురాళ్లు – మహమూద్ ............... 23
చిన్ని ఆశ – తాండ్ర రమణ, దిష్టిబొమ్మలు – శ్రీనివాసరెడ్డి ... 26
మట్టిదాహం – బండ్ల మాధవరావు ... 28
గాయం– యామినీదేవి కోడె, పెనుగులాట – నాగేంద్రరావు ....32
ఏముంటుంది?– పద్మావతి, వెలేశావు ఎందుకు?–పుష్యమీసాగర్ 33
ప్రాంగణం – గిరిప్రసాద్ చెలమల్లు ..... 37
ద నైట్‌వాచ్‌మేన్ – డా.కటుకోర్ఝ్వల రమేష్ 42
దూరం – డా.ఎన్ గోపి ......... 45
సౌందర్య దర్శనం – డా.డివిజి శంకరరావు 45
నేను గృహిణిని – రజిత కొండసాని ..... 46
ఆ ఉదయం రావాలి – బిబిటి సుందరతేజ ...... 50
అతడు మనిషి – డా. ఉదారి నారాయణ 50
మాక్కొంచెం స్వేచ్ఛ కావాలి – పుట్టి గిరిధర్ ........ 53
జాడలు – దారల విజయకుమారి... 58
మార్పు కోసం ... – డా.కాళ్ళకూరి శైలజ ... 59
కాలుతున్న సిగరెట్ సాక్షి – పల్లిపట్టు ............. 63

## వ్యాసాలు

సాహిత్య ప్రస్థానం అక్టోబరు 2021 పురస్కారాలు ..... 26
శరణార్థుల బతుకు వెతలే అతడి కథా ఇతివృత్తాలు
– వంశీకృష్ణ ............................... 9
మాణిక్యవీణ .. విశ్వం దార్శనికత
– డాక్టర్ సుంకర గోపాలయ్య ......... 12
రాయలసీమ కరువును చిత్రించిన కె.సభా నవల 'మొగిలి'
– పొదిలి నాగరాజు ........................15
మనసు లోతులను తడిమే 'స్పర్శవేది'– బాహరా ........ 20
మానవ విలువలూ – సామాజిక సంబంధాలూ
– రాజాబాబు కంచర్ల .................. 24
ఆకాశ విహారం అనుభూతినిచ్చే కవిత్వం
– శాంతికృష్ణ ........................... 27
మధ్య తరగతి ప్రతిబింబాలే 'అద్దంలో బొమ్మలు'
– చందలూరి నారాయణ రావు .................. 34
అవకాశవాదులకు ప్రతిరూపం 'గిరీశం'
– భమిడిపాటి గౌరీశంకర్ ................ 43
కొయ్యగుర్రం : ప్రకృతి – ప్రభుత్వం – ప్రజలు
– దుప్పల రవికుమార్ ...................... 47
రైతన్నకు బాసటగా కవిత్వ'సమర భేరి' – ఎస్ భరత్ 54
వర్తమానం : ఆకలి కడుపులు – ఆహార నిల్వలు
– ప్రభాత్ పట్నాయక్ .......................56
కవిత దారి పట్టిన నాగేంద్ర
– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ........... 60
డైరీ ........................................................ 64

ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# పరిణతి

– కేశవ్, కొల్కత్తా

98313 14213

"హాయ్ మేఘనా! ఏమిటే, కార్తీక్ ఫొటో నాకు పంపించవా! నువ్వే చూసుకుంటావా?" నవ్వుతూ ఫోన్లో అడిగింది సంచారి. సంచారి న్యూటౌన్‌లో ఉంటోంది. ఐటి సెక్టార్‌లో పనిచేస్తోంది.

నేను ముకుందోపూర్ దగ్గర ఆర్మీ హాస్పిటల్‌లో పనిచేస్తున్నాను. హెచ్ఆర్‌డిలో స్టాఫ్ మేనేజ్‌మెంటు వర్కు. పేషెంట్లతో పనిలేదు. భీష్మారావును విడిచిపెట్టిన తర్వాత నా లోకం అంతా ఈ ముకుందోపూరే. సంచారి కూడా భర్తతో వివాదం తర్వాత కొత్తగా ఆవిర్భవిస్తోన్న న్యూటౌన్ మహానగరాన్ని తనకంటే ముందే హృదయానికి హత్తుకుంది.

"ఎన్నాళ్ళిలా ఉంటావే మేఘనా... మళ్ళీ పెళ్ళి చేసుకోవే! ముసలైపోయావా ఏమిటి? మరో రాకుమారుడు నీకోసం గూగుల్‌లో ఎదురు చూస్తున్నాడు" అంటోంది పదే పదే సంచారి.

"అమ్మో! మళ్ళీ పెళ్ళా! పెళ్ళంటేనే శరీరంపై తేళ్ళూ, జెర్రెలూ పాకుతున్నాయి" అన్నాను ఎన్నోసార్లు.

కానీ తను వింటేనే కదా! నా ఫొటోనీ, వివరాలనీ భారత్ మేట్రిమనీలో అప్‌లోడ్ చేసేసింది. వచ్చిన ప్రపోజల్స్ నుంచి కార్తీక్ ప్రొఫైల్ బాగుందని తానే ఎంపిక చేసింది.

సంచారి టేకిట్ ఈజీ మనిషి. దేన్నీ సీరియస్‌గా తీసుకోదు. జీవితానికి పెద్ద ప్రిన్సిపల్స్ ఏముంటాయి అంటుంది. ప్రిన్సిపల్స్ జీవితంలో ఉండడం అవసరం అని నేనంటాను. క్రమశిక్షణ, స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, నమ్మకం, గౌరవం అవసరం అని నా ఆలోచన. అందుకే .. నెలరోజుల వివాహబంధం తర్వాత ఇలా బయటికొచ్చేశాను. అది బంధం కంటే జైలు అనడం సరిగా ఉంటుందేమో!

♦ ♦ ♦

అజయ్ నగర్ రోడ్ల మీద నడుస్తోంటే కొత్తగా మెరిసిపోతున్న కోల్‌కతా మహానగరం కనిపిస్తోంది. విశాలమైన రోడ్డు, పెద్ద పెద్ద హాస్పిటల్స్, మెట్రో నిర్మాణం కోసం తవ్వకాలు, కొత్త జీవితాలకు, కొత్త ఆశలకు స్వాగతం పలుకుతున్నాయా అనిపిస్తోంది.

నాకు అప్పుడప్పుడు ఒంటరిగా రోడ్ల మీద నడవడం గొప్ప ఇష్టం. రోడ్డు పక్కన అంతం లేని వాహనాలను చూస్తూ – అలా ఊహల్లోనూ, గత స్మృతుల్లోనూ, మౌనంలోనూ – గడిపెయ్యడం అనిర్వచనీయమైన అనుభూతి. వద్దనుకున్నా చిన్నపిల్లలా గతంలోకి పరుగెత్తడం, మళ్లీ బలవంతంగా ఆ మనసుని వర్తమానంలోకి ఈడ్చుకు రావడం–

భీష్మారావును తలచుకుంటేనే.. గుండెల్లో గుబులు, వెన్నులో వణుకు. ఇంటర్నెట్‌లో బ్లూ ఫిల్మ్‌లకు అలవాటుపడ్డ అతడు అత్యంత జుగుప్సాకరమైన వీడియోలను నా దగ్గరకు తెచ్చేవాడు. తను చూసినవి నా మీద ప్రయోగం చెయ్యడం, సహకరించమని బలవంతపెట్టడం – కాదంటే, మొదట ప్రేమగా బతిమాలడం, ఇంకా కాదంటే క్రూర మృగంలా మారిపోవడం –

ఎవరికీ చెప్పుకోలేని బాధ.

అందరితో ఎంతో గౌరవంగా, మృదువుగా మాట్లాడే ఈ మనిషిలో అంతర్గతంగా ఇంత పెద్ద మృగం దాగొని ఉందని చెబితే ఎవరు నమ్ముతారు!

అమ్మ, నాన్న, అన్నయ్య – ఎవరూ నమ్మరు. నమ్మరు సరికదా నన్నే మందలిస్తారు. డిజిటల్ పోర్న్ ప్రపంచం

అత్యాచారాలు ఎవరికి అర్థమవుతాయని!

మూడు లక్షల కట్నం.. ఆరు లక్షల పెళ్ళి ఖర్చు.

ప్రయాణాలకో లక్ష ... సూరత్‌లో హాయిగా జీవించ బోతున్నానని ఊపిరి పీల్చుకుంటోన్న అమ్మానాన్నలు .. ఈ సంక్షోభాన్ని తట్టుకోగలరా?

జీవితంలో ఏ ఆనందాలూ లేక, పనీ, ఓవర్‌టైంతో ఉ పాధిలోనే మునిగిపోయిన నాన్న తట్టుకోగలడా!

"ఈ వీడియోలు నా దగ్గరకు తేవొద్దండీ.. నాకు నచ్చవు." అనేశాను ఒకరోజు.

"ఏమన్నావ్! నా టేస్టులు నచ్చవా? నచ్చకుండా పెళ్ళెందుకు చేసుకున్నావే!"

జుత్తు పట్టుకున్నాడు. మెడ దగ్గర చేత్తో గట్టిగా అదిమాడు.

ఊపిరి ఆగినంత పనయింది. గట్టిగా విదిలించుకున్నాను.

"చంపేస్తాను .. ఇంకోసారి ఎదిరించావంటే!" అన్నాడు కర్కశంగా.

మొబైల్ తీశాడు. వీడియో ఆన్ చేశాడు. అతడిలో మృగం బయటికొచ్చింది.

ఇక అతడితో కలిసి జీవించటం సాధ్యం కాదని నిర్ణయానికి వచ్చాను. డివోర్సు తీసుకున్నాను.

♦ ♦ ♦

అతడితో కలిసి జీవించిన రోజులు తలచుకుంటేనే – నిస్సత్తువ ఆవరించేస్తుంది. భీకర తుపానులో ఒంటరిగా చిక్కుకుపోయినట్టు నిస్సహాయత ఆవహిస్తుంది.

బ్యాగులోంచి బాటిల్ తీసి నీళ్ళు తాగి, రోడ్డు పక్కకొచ్చి కూర్చొని బాటిల్‌లోంచి కొంచెం నీళ్ళు చేతిలోకి తీసుకొని ముఖం మీద చల్లాను. కాస్త రిలాక్స్‌గా అనిపించింది. కొద్దిదూరంలో స్వీట్ దుకాణం కనిపించింది. అక్కడకెళ్లి కూర్చున్నాను.

గుండె కొట్టుకుంటోంది. ముఖం మీద చెమటలు ఆగడం లేదు. విడాకులైన రెండేళ్ల కూడా తర్వాత కూడా అదే షాక్. అవే భయంకరమైన నీడలు. కాలికింద భూమి కదిలిపోతున్న భావన. ఎంత వదిలించుకున్నా వదలని నీడలు.

ఫోన్ మోగుతోంది. బ్యాగ్‌లోంచి తీశాను.

"హాయ్ మేఘనా! ఎక్కడున్నావ్? ఫోన్ లిఫ్ట్ చెయ్యడం లేదు? రేపు కలుద్దాం! రేపు ఆదివారం అన్నట్టు ఇంట్లోనే ఉ న్నావా?" అడుగుతోంది సంచారి.

"కొంచెం రోడ్డు మీదకొచ్చాను, సంచూ" అన్నాను కంఠం సర్దుకొంటూ.

"ఏమిటే! ఏమైంది! వాయిస్ బలహీనంగా వినిపిస్తోంది. ఎనీ ప్రాబ్లెమ్" అంది సంచారి.

"లేదు" అన్నాను మరింత సర్దుకుంటూ.

"సరే! రేపు కలుస్తాం, కదా! మాట్లాడుకుందాం. అన్నట్టు లంచ్ కోసం తెగ కష్టాలు పడిపోకు. బయట చేద్దాం లే" అంది.

"ఈ కరోనా కాలంలోనా?" అన్నాను స్వీట్ దుకాణం నుంచి బయటికొస్తూ.

"పర్వాలేదులే.. నార్మల్‌గానే ఉంది. ఏమీ కాదులే."

"నువ్వలానే అంటావు. రేపు ఏ కరోనాయో వస్తే మనకోసం మన వారంతా కష్టాలు పడతారు" అన్నాను నడుస్తూ.

"పడితే పడతారు. అంత ఆలోచిస్తే బతగ్గలమా మేఘనా" అంది సంచారి యూజ్‌వల్‌గా.

"సరే!" అన్నాను.

అజయ్ నగర్‌లో బస్సెక్కాను. ఇంటికి చేరాను.

♦ ♦ ♦

అనుకున్నట్టుగానే సంచారి ఉదయం పది గంటలకే వాలిపోయింది. రావడమే తడవు నా గుండె దడ పెంచేసింది.

"మేఘూ, ఈ మధ్యనే రమ్మని కార్తీక్ గారిని రమ్మని పిలిచాను." అంది నా చేతులు పట్టుకొని ఊపేస్తూ.

కిచన్‌లో టీ తీసుకుంది.

"ఇంకొంచెం షుగర్ కావాలి. నాకు షుగర్ లేదులే" అంది.

"టీలో అంత షుగర్ అవసరమా?" అనాలనుకున్నాను కానీ ఈ స్పీడ్‌బ్రేకర్ వింటేనా! అంతకంటే తను పేల్చిన బాంబుతో నా టెన్షన్ పెరిగిపోయింది.

కిచెన్‌లోకి వెళ్ళి టీలో షుగర్ కలుపుతూ అంది : "కార్తీక్ వస్తానన్నారు."

"సంచారీ! నువ్వు చెప్పేది నాకు ఒక్క ముక్క కూడా అర్థం కావడం లేదు. కార్తీక్‌ని నువ్వు రమ్మనడం ఏమిటి?" టీ సిప్ చేస్తూ అడిగాను.

"మొద్దు బుర్రా! మహానగరంలో నివసిస్తే సరిపోతుందా? మహానగరంతో పాటు నీ బుర్ర కూడా ఫాస్ట్‌గా పనిచెయ్యాలి కదా!" అంది టీ కప్పు పక్కన పెడ్తూ.

"సరే! లెక్చర్లు ఆపి అసలు విషయం చెప్పు మహాతల్లీ! టెన్షన్‌తో చస్తున్నాను" అన్నాను.

"ఇక ఈ టెన్షన్లు పోయి, అన్నీ మంచి రోజులే. రాకుమారుడు వస్తాడు. ఈ రాకుమార్తెను ఎత్తుకుపోతాడు" అంది నన్ను పట్టుకుని కుదిపేస్తూ.

"ఎందుకు రమ్మన్నావు అలా.. ఇంకా ఫైనల్‌గా అనుకోలేదు కదా?"

"నా స్నేహితురాలి రాకుమారుడ్ని ఆహ్వానించడానికి నాకు అనుమతి కావాలా? మీ ఇద్దరూ మాట్లాడుకుంటే అన్నీ ఫైనల్

అవుతాయి"

"అమ్మో! సంచూ! మరీ ఇంత ఫాస్ట్ అనుకోలేదు. సరే కాని ఎప్పుడొస్తారు?" అడిగాను స్నానానికి బయల్దేరుతూ.

"చూశావా నీకు కూడా ఎంత ఆతృతగా ఉందో!" అంది, కొంటెగా నవ్వుతూ.

"అరె! జోకులు ఆపి అసలు విషయం చెప్పు." అన్నాను.

"తనే నీకు చెబుతాడు వచ్చే ముందు" అంది పరుపు మీద వాలుతూ.

"రక్షించావులే" అన్నాను బాత్రూంలోకి ప్రవేశిస్తూ.

♦ ♦ ♦

సంచారి అన్నట్టుగానే కార్తిక్ ఒకరోజు ఫ్లైట్లో రావడం, అమ్మా, నాన్న, అన్నయ్యలతో మాట్లాడడం, అదే రోజు ఫ్లైట్లో తిరిగి వెళ్ళడం ... మెరుపులా జరిగిపోయింది.

కార్తీక్ అందగాడే! టక్ చేసుకొని బద్రోమానుష్‌లా (మంచి కుర్రాడులా) ఉన్నాడు. ఓ అరగంట మాట్లాడగలిగాను. ఏదో మల్టీ నేషనల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు.. నెలకు లక్షన్న రకు పైగా జీతం. హైదరాబాదు మెహదీపట్నంలో ఇల్లు. చెల్లెలు ఎంటెక్ చేస్తోంది. అక్క పెళ్ళై అత్తారింటిలో ఉంది.

అనుకున్న ప్రకారం జరిగితే మంచిదే. సంచారి మంచిపనే చేసిందనిపించింది.

పెళ్ళి, విడాకుల షాక్‌తో, ఉద్యోగ జీవితంతో అలసి పోయాను. అమ్మ దగ్గర ఉంటే, తన ఫ్రస్టేషన్ అంతా నా మీదనే చూపిస్తుంది. కార్తీక్‌తో పెళ్ళయితే కాస్త రిలాక్స్ అవుతాను. ఇంటి బాధ్యతలు చూసుకుంటూ... కొన్నాళ్లు ఉద్యోగ బాదరబందీ నుంచి విముక్తం కావాలి.

వెళ్ళిన రెండు వారాలకే కార్తీక్ ఫోను. కోవిడ్ లాక్‌డౌన్ల కారణంగా ప్రాజెక్టులు దొరకడం లేదట. సగం జీతమే ఇస్తున్నార్ట. పెళ్ళి ఓ సంవత్సరం వాయిదా వేద్దాం అనీ.

కలలు మసకబారాయి.

ఆకాశంలో నల్లని మేఘాలు కమ్మాయి.

ఉద్యోగ జీవితంలో అలసిపోయిన నిస్సత్తు భావన.

వర్షాకాలంలో మోకాలి నీటిలో ఆఫీసుకు వెళ్ళడం, ఆఫీసులో తడిసిన బట్టల్ని పాలిథిన్‌లో వేసి బ్యాగులో ఫ్రెష్ బట్టలు వేసుకోవడం, మరలా ఆ బట్టలు రిటర్నింగ్‌లో తడవడం. జలుబులూ – తుమ్ములూ – జ్వరాలూ–

బాగా అలసిపోయాను. అదే మాట ఒకరోజు కార్తీక్‌తో అన్నాను.

"కార్తీక్! పెళ్ళయిన తర్వాత నేను రెస్ట్ తీసుకుంటాను. ఉద్యోగం మాత్రం చెయ్యమనకండి. ముందే చెప్పడం మంచి దని చెబుతున్నాను"

"సరే ! మేఘా! నీ ఇష్టం. ఎలా అనుకుంటే అలానే చెయ్యి" అన్నాడు. తరువాత 'కానీ' అన్నాడు. ఏంటని అడిగాను.

"ఏం లేదు. హైదరాబాదులాంటి మహానగరంలో ఒక జీతంతో ఎలా బతుకుతాం? నా ప్రాజెక్టులు ఎప్పుడు ఎలా ఉంటాయో ఏమో! నీ ఉద్యోగం ఉంటే సేఫ్ కదా!"

నా గొంతు పెగల్లేదు.

"అరె! మేఘా! నువ్వు ఉద్యోగం చెయ్యడమేమిటి! నేను పనిచేసి నీ బాగోగులు చూసుకుంటాను. నా జీతం తక్కువ కాదు కదా!" అని తను అని ఉంటే నాకు గొప్ప హాయిగా ఉండేది. హాయిగా ఊపిరి పీల్చుకునేదాన్ని.

ఒకరోజు ఆఫీసులో ఉండగా, కార్తీక్ ఫోన్.

"ఏం చేస్తున్నావు మేఘా!"

"మేం చాలా ఎంజాయ్ చేస్తున్నాం తెలుసా" అన్నాడు గొప్ప ఎగ్జయిట్‌మెంట్‌తో.

"ఏమిటో ఆ ఎంజాయ్‌మెంట్?" అన్నాను.

"రాదనుకున్న జీతం అకౌంట్లో పడింది. అందుకే సరదాగా మేమంతా కలిసి డ్రింక్ చేస్తున్నాం" అన్నాడు.

"ఫ్రెండ్స్‌తోనా?"

"కాదు కాదు. నాన్న, అమ్మ, నేను..."

"ఫ్యామిలీ అంతానా?" అడిగాను, మనసులో ఆశ్చర్యాన్ని అణచుకుంటూ.

"అవును.." అన్నాడు చాలా క్యాజువల్‌గా.

"ఓకే ఎంజాయ్ టుగెదర్" అంటూ ఫోను పెట్టేశాను.

మున్ముందు నన్ను కూడా తాగమంటారేమో? కలల రెక్కలు ఒక్కొక్కటే తెగి పడుతున్నాయా అనిపించింది.

కార్తీక్‌తో నేను ఎడ్జస్టు కాగలనా? అతడి ఛాయిస్ కరెక్టేనా? మొదట్లా మళ్ళీ ఇరుక్కోనా?

అదే మాట అన్నాను సంచారితో ఒకరోజు..

"మేఘా! బహుశా అలా కలిసి డ్రింక్ చెయ్యడం అక్కడ కల్చరేమో! ఎక్కువ ఆలోచించకు." అంది సర్దిచెబుతూ.

"ఇదేం సంస్కృతి? డ్రింకు చేసే వ్యక్తి తర్వాత స్టెప్‌లో భీష్మారావులా మారడనడానికి గ్యారంటీ ఏమిటి?" అన్నాను.

"అందరూ అలాగే ఉంటారా? బీ పాజిటివ్" అంది.

"ఏమో! నాకు నమ్మకం కుదరడం లేదు సంచూ"

"పెళ్ళి కాకుండానే నువ్వంత టెన్షన్ అయిపోతున్నావేం? ఏం కాదు. అంతా నార్మల్‌గా ఉంటుంది" అంది తను.

"నీ జీవితం నార్మల్ అయిపోయిందా, నువ్వెందుకు నార్మల్ కాలేకపోతున్నావు?"

సంచారి ముఖంలో మార్పు చూసి పొరపాటు చేశానని పించింది.

"మేఘా! నా విషయం వేరు" అంది.

ఆమె కళ్ళల్లో నీలిమేఘాలు వర్షించడానికి సిద్ధమయ్యాయి.

"సారీ సంచు! ఏదో చికాకులో అనేశాను. వెరీ వెరీ సారీ" అన్నాను ఆమె చేయి పట్టుకుని.

"ఇట్స్ ఓకే! ఆ మూర్ఖుడి గురించి గుర్తు చెయ్యకు. రెండు మూడు రోజులు నేను నార్మల్ కాలేను" అంది.

♦ ♦ ♦

కరోనా నార్మల్ అయింది. థర్డ్ వేవ్ అని భయపెట్టారు. వచ్చిందో రాలేదో తెలియదు. కానీ ప్రాజెక్టు ఆరంభమయిందని కార్తీక్ ఒకరోజు ఫోన్ చేసి చెప్పాడు.

ఉద్యోగం నార్మల్ అయిందని ఇక పెళ్ళికి మరి ఆలస్యం ఉండదని చెప్పాడు.

వచ్చే నెలలోనే ముహూర్తాలు పెట్టేస్తారట.

"మేఘనా! ఏం అనుకోకు! మా అమ్మ, అక్కయ్య ప్రపోజల్ ఒకటి నీకు చెప్పాలనుకున్నాను" అన్నాడు ఒకరోజు ఫోన్‌లో.

"చెప్పండి. ఆలస్యమెందుకు?" అన్నాను.

"మరేం లేదు. మీ అమ్మా నాన్నలకు వైజాగ్‌లో ఒక ఫ్లాటు, కోల్‌కతాలో ఒక ఫ్లాటు ఉన్నట్టు మీ అన్నయ్య చెప్పారు. మీరు కోల్కతాలోనే స్థిరపడ్డారు కదా! మరి వైజాగ్ ఫ్లాటు పెళ్ళికి ముందు మన పేరు మీద రాసేస్తే బాగుంటుంది. అక్కయ్యా చాలా అద్దె ఇచ్చి వైజాగ్‌లో ఉంటోంది. ఇప్పుడు వాళ్ళ అబ్బాయికి చదువుకి చాలా ఖర్చవుతుంది. అది కొంచెం తక్కువకు అక్కకు అద్దెకిస్తే మనకు అద్దె వస్తుంది. వారికి సహాయం చేసినట్టూ ఉంటుంది." అన్నాడు.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. "సరే చెబుతాను" అని ఫోన్ పెట్టేశాను.

గుండెలోంచి కన్నీటి నదులు... అయినా నోరు ఎండి పోతుంది. బాటిల్ తీశాను. నీళ్ళు తాగాను. ఆఫీసు వాష్‌బేసిన్ దగ్గరకు వచ్చాను. ముఖం మీద నీళ్ళు చల్లుకున్నాను.

సూపర్‌వైజర్ సాత్విక్ అడుగుతున్నాడు : "మేఘా! ఎనీ ప్రాబ్లం! సబ్ టీక్ ఆచే తో!" అని.

"అవును సర్" అని తలూపాను.

సంచారికి ఫోన్ చేశాను. సాయంకాలం ఆఫీసు తర్వాత కలుస్తున్నానని!

♦ ♦ ♦

న్యూటౌన్ నజ్రూల్ మంచ్ దగ్గర కూర్చున్నాం ఇద్దరం.

"మేఘనా! బీ ప్రాక్టికల్! కార్తీక్ మరీ చెడ్డవాడేం కాదు.. ఈ రోజుల్లో డబ్బు అవసరం అందరికీ ఉంది. ఇల్లు రాస్తే వాళ్ల అక్క కుటుంబానికి సాయం చేయొచ్చని అనుకుంటున్నాడు.." అంది బ్యాగులోంచి వాటర్ బాటిల్ తీస్తూ.

"అయినా, అన్నయ్య కొనుక్కున్న ఇల్లు తను అడగడమేమిటి, సంచూ? వాళ్ళక్కయ్యకు సమస్య వస్తే దాని పరిష్కారం నా నుంచి ఆశించడం ఏమిటి? అందరూ తాగుతూ అది సరదాగా చెప్పడమేమిటి? కార్తీక్ అవకాశవాదిలా కనిపిస్తున్నాడు. ముందే మేలుకోవడం మంచిది అనిపిస్తోంది.." అన్నాను తనిచ్చిన బాటిల్ లోంచి నీళ్ళు తాగుతూ.

"అమ్మకు చెబితే ఇల్లు ఎడ్జస్టు చేస్తుంది. దీనికోసం సంబంధం కేన్సిల్ చేసుకొంటావా?" అంది సంచారి బాధతో.

"నేను ఎవరినీ రిక్వెస్టు చెయ్యను. అసలు వివాహ సంబంధాల్లో ఈ బేరాలేమిటి విచిత్రంగా!" అన్నాను.

"నీలా ఆలోచించే మనుషులు దొరుకుతారా ఈ కాలంలో" అంది సంచారి.

"దొరక్కపోతే పోనీ.. ఇన్నాళ్ళూ ఒంటరిగా ఉన్నాను కదా! ఇంక ఇలాగే ఉండనీయ్. ఆ అడవిలోకి వొద్దు సంచూ." అన్నాను స్థిరంగా.

"జీవితమంతా ఒంటరిగా ఉండిపోతావా?" అంది సంచారి ఆప్యాయంగా.

"నువ్వు ఉంటున్నావుగా!"

తను ఇంకే మాట్లాడలేదు.

ఇద్దరి కళ్ళల్లో కన్నీటి తుపాను మోహరించింది.

హఠాత్తుగా నల్లని మేఘాలు న్యూటౌన్ మహానగరం మీద కమ్ముకున్నాయి. ఇద్దరం మాస్కులు సర్దుకున్నాం.. బస్సుకోసం వేచిచూస్తూ.

■

**సాహిత్యప్రస్థానం**

ప్రతి నెలా క్రమం తప్పకుండా
వెలువడుతోంది..
చందాదారులుగా చేరండి ..
చేర్పించండి.
ఆర్థికంగా, హార్దికంగా
సహాయకారాలు అందించండి.

సందర్భం



# శరణార్థుల బతుకు వెతలే ఆయన నవలా ఇతివృత్తాలు

- వంశీకృష్ణ

**బ**యటి ప్రపంచానికి అంతగా తెలియని డెబ్బై మూడేళ్ళ ఆఫ్రికన్ రచయత అబ్దుల్ రజాక్ గర్నాని నోబెల్ సాహిత్య బహుమతికి ఎంపిక చేయడం ద్వారా అకాడమీ తన ప్రత్యేకతను మళ్ళీ ఒకసారి నిలబెట్టుకుంది. ఆ అత్యున్నత బహుమతిని అందుకున్న ఆరవ ఆఫ్రికన్ రచయిత, మొట్ట మొదటి టాంజానియాన్ గుర్నా. నలభై ఏండ్లకు పైబడిన తన సాహిత్య జీవితంలో గుర్నా మొత్తం పన్నెండు నవలలు రాశారు. తన మొదటి నవల మెమొరీ ఆఫ్ డిపార్చర్ 1987లో వస్తే తాజా నవల ఆఫ్టర్ లైవ్స్ 2020లో వచ్చింది. తన ఈ సుదీర్ఘ సాహిత్య ప్రయాణంలో గుర్నా శరణార్థి సంవేదనను, బహుళ సంస్కృతుల, బహుళ జాతుల మధ్య ఘర్షణను అత్యత సూక్ష్మ స్థాయిలో చిత్రించాడు .

1948లో టాంజానియాలోని జాంజిబార్ జన్మించిన గుర్నా తన పద్దెనిమిదేండ్ల వయసులో ఇంగ్లాండ్‌కి వలసవెళ్లాడు. అక్కడే క్రిస్ట్ కాలేజీలో చదువుకుని, పిహెచ్‌డి చేసి కెంట్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశాడు. ఇంగ్లాండ్ చేరుకున్న 21 సంవత్సరాల తరువాత తన నలభై ఏళ్ల వయసులో మొదటి నవల మెమొరీ ఆఫ్ డిపార్చర్ రాశారు. ఆ నవలకి అంతగా గుర్తింపు కానీ, రచయతగా తనకు పేరు కానీ పెద్దగా రాలేదు. తన నాలుగో నవల ప్యారడైజ్ బుకర్ ప్రైజ్‌కి షార్ట్ లిస్ట్ కావడంతో గుర్నా పేరు సాహిత్య ప్రపంచంలో మారుమోగింది. అప్పటినుంచీ గుర్నా సాహిత్యాన్ని ఆఫ్రికన్ ప్రపంచం సీరియస్‌గా పట్టించుకోవడం మొదలు పెట్టింది. ఇప్పటికీ ఇంగ్లాండ్ బయట గుర్నా గురించి పెద్దగా తెలియదు. తన డెబ్భై మూడేళ్ల వయసులో నోబెల్ సాహిత్య బహుమతి సాధించడం ద్వారా గుర్నా సాహిత్య ప్రపంచ ఎల్లలు చెరిపివేసి తన సాహిత్యాన్ని విశ్వ వ్యాప్త చదువరులకు సన్నిహితం చేశాడు.

గుర్నా రచనల్లో కనిపించే వైవిధ్యతకు ప్రధానమైన కారణం అతడు పుట్టి పదిహేడేళ్ల పాటు పెరిగిన జాంజిబార్. హిందూ మహాసముద్రంలో తూర్పు ఆఫ్రికా తీరాన్ని అనుకుని వుండే జాంజిబార్ ఒకప్పుడు అరేబియా (ఇప్పుడు కువైట్, ఓమన్, ఖతార్ సౌదీగా పిలిచే ప్రాంతాలు) దక్షిణ ఆసియాలను అమితంగా ఆకర్షించిన ప్రదేశం. వ్యాపార లావాదేవీల నిమిత్తం ఇక్కడ వచ్చి, వెళుతూ, స్థిర నివాసం ఏర్పరచుకున్న వివిధ జాతుల, సంస్కృతుల జీవన విధానాలతో బహుళతను లోలోపల నింపుకున్న ప్రదేశం జాంజిబార్. ఈ జాంజిబార్ గుర్నా నవలలు అన్నింటిలో నిండి ఉండి వైవిధ్యతను, ఘర్షణను, ఏకకాలంలో పాఠకుడికి హృదయంలోకి ఒంపుతాయి.

The loneliness, the estrange ment became fertile ground for reflection and led me to writing fiction. అని ఏకాంతం, విస్థాపన, స్థానభ్రంశం తన నవలా రచనకి ఎలా కారణాలు అయ్యాయో చెప్పుకున్న గుర్నా తన మొదటి నవల మెమొరీ ఆఫ్ డిపార్చర్‌లో తన అనుభవాల సారాంశాన్ని నిక్షిప్తం చేశాడు. అమితమైన కారుణ్య దృష్టితో, రాజీలేని విధంగా వలస వేదనని అక్షరబద్ధం చేసిన గుర్నా సాహిత్యాన్ని Uncmpramising and comppassionate అని నోబెల్ కమిటీ వర్ణించింది. నోబెల్ కమిటీ ఫలానా పుస్తకానికి అని చెప్పకపోయినా ప్యారడైజ్‌ను ప్రత్యేకంగా పేర్కొన్నది.

1994లో బుకర్ ప్రైజ్‌కి షార్ట్ లిస్ట్ అయిన ప్యారడైజ్ బహుళ జాతుల, బహుళ సంస్కృతుల మధ్య ఎదురయ్యే ఘర్షణలను బలంగా చిత్రిస్తుంది. గుర్నా 1990లో చేసిన ఒక ప్రయాణాన్ని ఆధారంగా చేసుకుని ప్యారడైజ్ నవల రాశారు. ఆ నవల జోసెఫ్ కాన్రాడ్ నవల హార్ట్ ఆఫ్ డార్క్‌నెస్‌ని గుర్తుచేస్తుంది. యూసఫ్ అనే పిల్లాడి జీవితం ప్రధాన ఇతివృత్తంగా బహుళ సంస్కృతుల మధ్య ఘర్షణ ఎంత అమానవీయంగా ఉంటుందో ఈ నవల ఒక విషాద స్వరంతో చెపుతుంది. మన ఆర్కే నారాయణ్ మాల్గుడి అనే ఒక టౌన్ సృష్టించినట్టుగానే గుర్నా కూడా కావా అనే ఒక పట్టణాన్ని సృష్టిస్తాడు. అరబ్ వ్యాపారి అజీజ్‌కి అప్పు పడటంతో ఆ అప్పును తీర్చడానికి యూసఫ్ తండ్రి యూసఫ్‌ని అజీజ్‌కి ఇచ్చేస్తాడు. యూసఫ్ జీతం, బత్తెం లేకుండా అజీజ్ దగ్గర సేవకుడిగా కుదురుకుంటాడు. ఆ బాలుడికి యజమాని దగ్గర ఎలాంటి హక్కులూ ఉండవు. మధ్య ఆఫ్రికాకి అజీజ్ పటాలం వెళుతున్నప్పుడు అందులో యూసఫ్ కూడా వెళ్తాడు. అజీజ్ వ్యాపార బృందం మధ్య ఆఫ్రికా, కాంగో ప్రాంతాల జాతులతో ఘర్షణ పడతారు. ఈ ఘర్షణను అక్షరబద్ధం చేసేటప్పుడు గుర్నా గొప్ప రచనా చాతుర్యం ప్రదర్శిస్తాడు. వాళ్ళు తిరిగి స్వదేశానికి వచ్చేసరికి మొదటి ప్రపంచ యుద్ధం మొదలవుతుంది. జర్మన్ ఆఫ్రికన్ పౌరులని సైనికులు బలవంతంగా తీసుకుంటారు.

The sense of belonging to that Indian Ocean world, at least the part of it that I knew, which is largely an Islamic one which had been sort of incorporated into Islamicepistemology, even if you're talking about India or Hindu cultures. So thats one way of understanding అని తన రచనా మూలాలని చెప్పుకున్న గుర్నా తన నవలలో జ్ఞాపకం, చరిత్ర, పరాయీకరణను ముప్పేటలుగా అల్లి ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించాడు. తన నవలలు అంత తొందరగా కొరుకుడు పడవు. అవి ఏకకాలంలో చరిత్రను చెపుతాయి. జ్ఞాపకాన్ని విస్తరిస్తాయి. రెండింటినీ కలగలిపి, విడదీస్తూ, విడదీసి కలుపుతూ, ఒక ప్రవాహ సదృశ వేగంతో పాఠకుడిని సమ్మోహితం చేస్తాయి. వర్జీనియా వూల్ఫ్ చెప్పినట్టుగా Memory is the seamstress, and a capricious one at that. Memory runs her needle in and out, up and down, hither and thither.

జ్ఞాపకం గుర్నా రచనలు అన్నిటా దోబూచులాడుతూ ఒక సంక్లిష్ట భావ ఆవరణంలోకి నెట్టివేస్తుంది. నిజానికి ఈ సంక్లిష్టత పాత్రలు స్వభావాల వల్ల కాక అవి జీవించే బహుళ సాంస్కృతిక, జాతుల, చరిత్రల ఘర్షణల కారణంగా ఏర్పడుతుంది. మెమొరీ ఆఫ్ డిపార్చర్‌లో హాసన్ ఒమర్, ఫిల్‌గ్రిమ్స్ వేలో దావూద్, మబై ది సిలో ఒమర్ మహమ్మద్ లతీఫ్, రషీద్‌ల జీవితాలు సరళంగా ప్రారంభమై సంక్లిష్టంగా మారతాయి. ఒక ఘర్షణను జీవితాంతం అనుభవిస్తూనే ఉంటాయి.

గుర్నా నవలలు అన్నిటా జ్ఞాపకం ఒక ప్రధాన పాత్ర పోషించినప్పటికీ ఆ జ్ఞాపకం కేవలం మదిలో తలపోతల జలపాతం కాదు. గతంలో ఉన్న తన బంధాలను, అనుబంధా లను గుర్తుచేసుకోవడం కాదు. తన రచనలో జ్ఞాపకం పోషించే పాత్ర గురించి గుర్నా ఒక మంచిమాట చెప్పాడు. I do not think i have actually written any kind of story depicting truth according to aparticular memory, but little fragments might refer to something that actually happened to a relative or some one I know. Finally the story does not depcit the truth, but a small detail might be something I actually experienced or have heard of, one might see parallels, connections, although that might depend on the kind of story one writes.

మన తెలుగు కవి అజంతా జీవితాంతం ఒకే కవిత రాశాడు. దాని పేరు మృత్యువు అంటారు సమకాలీన కవులు కొంతమంది. ఇదే మాటను గుంటూరు శేషేంద్ర శర్మ మరొకరకంగా చెప్పాడు. కవి తన జీవితంలో ఒక్కటే కవిత రాస్తాడు. ఆ కవితకు ముందూ, వెనుకా కవి చేసే సృష్టి అంతా దాని ప్రతిధ్వనులే అని. ప్రముఖ బ్రిటీష్ రచయిత జోసెఫ్ కాన్రాడ్ కూడా తన జీవితం మొత్తం ఒకే విషయం మీద సాహిత్య సృజన చేశాడు. The tale of haunted man trying to esape his past, but in vain. గుర్నాకి కూడా వీళ్లతో దగ్గరి సంబంధమే ఉన్నది. తాను కూడా ఒక Spectral Taleను చెప్పడానికి ప్రయత్నం చేశాడు. ఆ కథను పదే పదే చెప్పడం ద్వారా రిఫైన్ చేయడానికి ప్రయత్నం చేశాడు. తన కథావరణం అంతా హిందూ మహా సముద్ర తీరప్రాంతమే కనుక తన నవలలని ప్రపంచ సాహిత్యంలో భాగంగా కాక Ocean Novel'గా ప్రపంచం గుర్తించింది. అయితే ఇలా తనను వర్గీకరించడం కానీ, ఒకే స్పెక్ట్రమ్‌కి కట్టివేయడం కానీ తగదు అంటాడు గుర్నా.

ప్రపంచవ్యాప్తంగా కరోనా నేపథ్యంలో వలసలు పెరిగిపోతూ శరణార్థులు కాన్సన్‌ట్రేషన్ క్యాంపుల్లో మగ్గుతున్న ప్రస్తుత సందర్భంలో, రకరకాల జాతీయవాద భావనలు మొగ్గతొడిగి ఒక ప్రత్యేకమైన కులాల, జాతుల సముదాయాలను లక్ష్యంగా చేసుకునే రాజకీయాలు విస్తరిస్తున్న సమయంలో గుర్నాకి వచ్చిన నోబెల్ బహుమతి ... ఆయా వర్గాల సమస్యలపై దృష్టి సారించేందుకు ఒక దిక్సూచి అవుతుందని ఆశపడవచ్చు. ■

## కవిత



# వ్యూహాత్మక వాక్యాలు

- కంచరాన భుజంగరావు

99892 65444

**కా**యితానికీ, కలానికీ
యింకు దారంతో ముడివేస్తారు
బహురూపుల బతుకు వైశాల్యాన్నీ
బహుళ పార్శ్వాల విషాద మోహనాలనూ
పొందికైన మాటల్లో చిత్రిస్తారు
పొద్దు పొంగినపుడూ
పొద్దు గూకినపుడూ దృశ్యమానమయ్యే
వెలుగు నీడల మర్మాన్ని నగ్న వ్యాకరణంలో తెరంగిస్తారు
పొగిలే కన్నీళ్ళ హోరునూ
పోటెత్తే చెమట కెరటాల బీభత్స పర్యవసానాలనూ
తడిసిన కళ్ళలాంటి మాటల్లో చూయిస్తారు

మార్కెట్ సమాజానికి ఏదో ఓ మారుపేరుతో
మార్కెట్ మాంత్రికులే పాలకులౌతారనీ,
సంపద భోక్తలకి నగదీకరణలో మహారత్నాలు
శ్రామిక శక్తులకి ఓట్ల గాలాల్లో పప్పు బెల్లాలు
పంపకమౌతాయని సూటి వాక్యమంత స్పష్టంగా రాస్తారు
తైతక్కల తిమ్మిరి గుణంతో స్పృహ తప్పిన తరానికి
నెత్తిన నీళ్ళు కుమ్మరించినట్టు
చింతల దీవుల్లాంటి మందబుద్ధుల పైకి
చెమ్మగిల్లిన మంటల్ని చిమ్ముతారు!

పర్వత సానువుల్లోని ఏ ఏకాంత తీరంలోనో
గంగమ్మ జడ ముడివీడినట్లు
వారి పిడికెడంత గుండె స్రవించినపుడల్లా
భారమైన ఒక్కో బతుకు నది
నిండు సారంతో ప్రవహించుకొస్తుంది

ఓ మెరుపు కల కొంగు పట్టుకుని
గుక్క తిప్పుకోకుండా పదాలు పెదాలు కదిపి
తలపుల తీరంలో పదం పదంగా పాదాలు కలిపి
పదునైన అలలు సూత్రబద్ధంగా పరుగెడతాయి
ఆలోచనల అరణ్యం నుంచి
ఉమ్మలు ఉమ్మలుగా పైకితేలే మబ్బులు
అక్షరాల చినుకుల్ని కురిసిపోయాక తేలికపడతాయి

పదాలనుండే పదాలు -
పుంతలు పుంతలుగా పుట్టుకొస్తాయి
వాక్యాల నుండే వాక్యాలు -
తుపాను తాకిడిలా విరుచుకొస్తాయి
భావాల్నుండే భావాలు -
కొత్త కొత్తగా చిగురిస్తాయి
కల్పనలు కమనీయ కల్పనల్ని
నిజాలు నిగ్గుదేలిన నిజాల్ని
ఊహలు ఎత్తైన ఊహల్ని
ఆలోచనలు లోతైన ఆలోచనల్ని పలవరిస్తాయి
నిశ్శబ్దం ముక్కున వేలేసుకుని
శిలలా నిలబడుతుంది
ఎద పేలెట్‌లో ముంచిన కోడీకతో
కాయితం అద్దం మీద చిత్రించిన అనుభూతి చిత్రాలు
అవధానంలో కొలువుదీరిన పంచెకట్టు పండితుల్లా
పంక్తుల్లో అమరిపోతాయి!

పండులా మాగి పద్యమై రాలిపడడం
గేయమై గాయాలను నయం చేయడం
గుండె డప్పు మోగించి శబ్దాలను తట్టిలేపడం
వారికి పరమానందం! వారి జీవితాదర్శం!!
కోట్ల పుటల పుస్తకంలో వ్యూహాత్మక వాక్యాలు వీరు!
దేశ సార్వభౌమత్వ ప్రతీకలు వీరు!
సరిహద్దులు కాచే సాయుధులు వీరు!
వీరిని మనం కవులూ రచయితలని పిలుస్తుంటాం!
వీరి వెన్నెముకలు ఎంత నిటారుగా ఉంటే
మనకంత స్వేచ్ఛ ఉన్నట్టు! ■

**విశ్లేషణ**




మాణిక్యవీణ

# మాణిక్య వీణ విశ్వం దార్శనికత


**- డా. సుంకర గోపాలయ్య**

94926 38547


**మీ**సరగండ విశ్వరూపాచారి పుట్టుపూర్వోత్తరాలు గురించి ఇక్కడ ప్రస్తావించడం లేదు. పుట్టిన క్షణాలు గొప్పవని, లేదా అల్పమైనవని నేను భావించడం లేదు. 24 గంటలూ మనకు మంచివిగా ఉంటాయి. ఎప్పటి వరకు అంటే మనకంతా అనుకూలంగా జరుగుతున్నంత వరకు. ఏదైనా తేడా వస్తే ఇంగ్లీషులో గుడ్ క్షణాలు అనుకున్నవి గడ్డు క్షణాలు అయిపోతాయి. 'దుర్ముహూర్తం' అని క్యాలెండర్ తిప్పుతాం. రాహుకాలాలు, యమగండాలు వెతుకుతాం. నక్షత్రాలను, రాశులను లెక్కిస్తాం. కాలం మీద నెపాన్ని నెట్టేస్తాం. తరాలుగా ఇది మనకు బాగా అలవాటైన పని. సులభం కూడాను. కాలానికి నోరు లేదు కదా...

మన తెలుగునాట ఈ నెపాన్ని నెట్టడం వెన్నతో కాదు, బూస్ట్, హార్లిక్స్, సెరిలాక్స్‌తో పెట్టిన విద్య. కనుక 'విశ్వం' గారి జన్మదిన, స్థల కాలాదులను ఇప్పటికి చాలామంది మన ముందుంచారు. కనుక నేను మానుకున్నాను. ఈ 'కాలం' గురించి ఎందుకిలా అంటున్నానో చివరిలో మళ్ళీ చెప్తాను.

మనకు ఇంకో వ్యాధి కూడా ఉంది. కరోనా కాదు, ఒక రచయితను ఒక ప్రసిద్ధి చెందిన రచనకు కట్టేసి ఊరుకోవడం. దాని చుట్టూనే తిరగడం. దాన్ని మాత్రమే మోయడం. అక్కడికి పరిమితం చేసేసి పెన్ను దులుపుకోవడం. అందుకే విశ్వరూపాచారిని పెన్నేటి పాటతో ఆపేసాం. పెన్నెట్లో వదిలేశాం. నిజానికి ఆయన సాహిత్యంలో విశ్వరూప ప్రదర్శన చేశారు. అది మాయ కాదు. కంటికి కనిపించే విశ్వరూప దర్శనం. 'ఆంధ్రప్రభ' పత్రికలో 20 ఏళ్లపాటు 'మాణిక్యవీణ' శీర్షికతో.. వ్యాసాలు, కవితలు రాశారు. 'మాణిక్యవీణ'ను ఆయన అన్ని విధాలా మీటారు.

అందులో ఆయన పంచిన భావాలు, అభిప్రాయాలు ఇప్పటికీ 'సమకాలీనత'ను కోల్పోలేదు. కరెంట్ ఎఫైర్స్‌లానే ఉన్నాయి. గొప్ప రచనకు సార్వకాలీనత కూడా ఒక లక్షణం. మాణిక్యవీణలోని అంశాలు వేడిగా ఉన్నాయి. తాజాగా ఉన్నాయి. మెదడును చురుకు చేసేవిగా ఉన్నాయి. హృదయాన్ని సున్నితం చేస్తాయి. మాణిక్యవీణ అనడంలో ఆయన ఉద్దేశం ఏంటోగానీ... అది అగ్నివీణ... జ్వాలాతోరణం. నిక్కచ్చి భావాల హృదయతంత్రి.

మాణిక్యానికి 'కెంపు' అనే అర్థం ఉంది. రక్తవర్ణంలో ఉంటుంది. విప్లవం రంగు. వ్యవస్థలో ఒక సమూల ప్రక్షాళన.. ఒక కొత్త సమాజాన్ని ఆకాంక్షించే క్రమంలో బహుశా ఈ శీర్షికకు... ఈ పేరు ఎంచుకున్నారేమో! ఈ ధారావాహిక వెనుక ఉన్న తాత్విక దృక్పథాన్ని విశ్వంగారు ఇలా అన్నారు : 'చుట్టూ ఉన్నవారిలో మంచితనం పెంపొందాలి. అందరూ సుఖంగా ఉండాలి. ఉత్తమ మానవ వ్యవస్థ ఏర్పడాలి.'

'మాణిక్యవీణ'కు సిలబస్ ఏంటి అని పరిశీలిస్తే ...

1. నైతిక ప్రవర్తన 2. ధన కాంక్ష 3. అధికార వ్యామోహం 4. రాజకీయ స్థితిగతులు 5. స్మృతులు 6. తాత్త్వికత 7. కాల స్పృహ 8. ఆరోగ్యం / వినోదం / విషాదం / ఉత్సాహం / దిశా నిర్దేశం ...

ఇలా అనేక అంశాలను నిత్యనూతనంగా పాఠకులకు అందించారు విశ్వం.

విశ్వం కలం 'అశ్వం' దౌడుతో శైలి విన్యాసం చూపింది. అయితే మాణిక్యవీణ శీర్షికతో రాసిన అన్ని వ్యాసాలను కలిపి... ఒక పుస్తకంగా తీసుకురాలేకపోవడం దురదృష్టం కాదు గానీ లెక్కలేనితనం. గుట్టలు గుట్టలు పోసిన మన నిర్లక్ష్యానికి గొప్ప ఉదాహరణ.. ఆ తరంలో ఎవరూ ఆ పని చేయకపోవడం గొప్ప దారుణం. వెతుకుతూ ఉంటే అక్కడక్కడా కొన్ని దొరుకుతూ ఉన్నాయి. నాకు దొరికిన కొన్ని వ్యాసాల ఆధారంగా అందులోని తాత్త్వికతను, దార్శనికతను చూపే ప్రయత్నం చేస్తాను.

మానవ పరిణామంలోని సౌందర్యాన్ని, కృషిని, సాధన సంపత్తిని, తాత్త్వికతను 'విశ్వం' ఎంత హృద్యంగా చెప్పారో... ఈ కింది వచన కవితను పరిశీలిస్తే తెలుస్తుంది.

**"మంత్రాలతో చింతకాయలు/ రాలనప్పుడు**
**పద్య సంత్రాసంలో చింతలు/ పారిపోతాయా?**
**మంత్రాలతో జబ్బులు/ నయం కానప్పుడు**
**తంత్రాలతో సమాజ రుగ్మతలు/ దారికి వస్తాయా?**
**అంటే అనవచ్చు/ ఔనని కొందరితో/ అనిపించనూ వచ్చు..."**

ఇలా మొదలైన కవిత – ఒక ప్రవాహంలో సాగి మానవ జీవన పరిణామ వికాసాన్ని, ప్రకృతి, కళలు, విజ్ఞాన కాంతులు కలసి మన జీవన ప్రస్థానాన్ని జ్ఞప్తికి తెస్తుంది. మనిషి కాలగర్భంలో కలిసినా, అతని మేధలోంచి ఆవిష్కృతమైన కళ, కవిత్వం, విజ్ఞానం సకల మానవాళికీ దిశానిర్దేశం చేస్తాయి. మానవుణ్ణి శాశ్వతుణ్ణి చేస్తున్నాయి.

**"చిన్నవాడు మానవుడు/ చిరంజీవి మానవుడు**
**చిరంతనుడు మానవుడు**
**అనాదిగా నడుస్తున్న ఈ/ మహాప్రస్థానంలో**
**అతగానిని వదలని/ జతలు కళా కవితా**
**జ్ఞానం విజ్ఞానం"** అని నిర్ధారణ చేస్తారు.

మనిషి గుహల్లో నివసించేనాడే గోడలపై గుర్రాలూ, జింకల బొమ్మలు గీసుకున్నాడు. పాడటం నేర్చుకున్నాడు. కాలికి గజ్జె కట్టాడు. చక్రం కనుక్కున్నాడు. నిప్పును కనుక్కున్నాడు. ఇవన్నీ పరిణామక్రమంలో శుభదినాలుగా ఇందులో విశ్వం పేర్కొంటూ...

**"కిలకిలలు మాని కలభాషలు నేర్చుకున్నరోజు**
**అలతి మాటలతో పదాలల్లుకున్న రోజు**
**కలమ ధాన్యం పండించుకున్న రోజు**
**కళలు పండించుకున్న రోజు**
**అన్నీ గొప్ప రోజులే/ మానవ చరిత్రలో**
**అన్నీ అసాధారణ పర్వదినాలే..."** అని చెప్పి ఆదిమదశ నుంచి ఆధునిక దశ వరకు స్మరించుకున్నారు.

30–2–83న రాసిన వ్యాసంలో త్యాగధనులు గురించి ఆయన ప్రస్తావన చేశారు. ఆయన ఏ అంశం ముట్టుకున్నా దాన్ని సరాసరి గుండెల్లోకి ప్రవహింపజేస్తారు. పరోపకారం గురించి ఆయన చెబుతూ – 'ఏదో ఒక లక్ష్యం కోసం తమ సర్వస్వం ధారపోసి అదే తమ జన్మ సార్థకతకు దారి తీస్తుందని మహాత్ములు భావిస్తారు. వారి మంచి పనుల వల్ల చరిత్రలో నిలిచిపోతారేగానీ, అందుకని వారా పనులు చెయ్యరు. ఇలాంటి సందర్భాల్లో మనం 'కారణ జన్ములు' అని సరిపెట్టుకుంటాం. గానీ విశ్వంగారి ఆలోచన కొత్తగా ఉన్నట్లు గమనించవచ్చు. ఈ చిన్న వ్యాసంలోనే ఆయన ఒక సుభాషిత పద్యాన్ని, జీమూతవాహనుడి కథని తార్కాణంగా చూపారు. ఇలాంటి శీర్షికలు నిర్వహించాలంటే కత్తి మీద సాము. కానీ విశ్వంగారు తనకున్న అధ్యయనం, ఆత్మవిశ్వాసంతో అక్షరాలను శాశ్వతం చేశారు. ఇంకో వ్యాసంలో 'లక్ష్యసిద్ధి' కోసం యువతకు చక్కని ప్రబోధం చేస్తూ, లక్ష్యసాధనలో అదృష్టం మీద ఆధారపడకూడదు, లక్ష్యం మీద మొదటి నుంచి గురి ఉండాలి. లక్ష్యం ఆకాశానికి నిచ్చెన వేసేది కాకుండా – గొప్ప విశ్వాసంతో ముందుకెళితే చక్కటి దారి దొరుకుతుంద'ని అంటారు.

14.02.1968న ఆయన రాసిన వ్యాసంలో శారీరక రోగాల గురించి గాక సాంఘిక రోగం గురించి సూటిగా ప్రశ్నించారు. సమాజ స్థితి 'అనారోగ్య గ్రస్తం'గా ఉండటం గురించి కలత చెందారు. సాంఘిక రోగాలకు మూలకారణం కనుగొని, నాయకులు ప్రజల సమస్యలను శాశ్వతంగా దూరం చేయడం గురించి ఆలోచన చేయాలని సూచించారు. సామాన్యుల జీవితం మెరుగుపడకపోవడం గురించి ప్రశ్నిస్తూ... "అవును – కొత్తగా స్వతంత్రమైన దేశం సవాలక్ష సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. వందలాంది ఏండ్ల పరిపాలన వలన కలిగిన పరిణామాలను నిమిషాల్లో తొలగించాలంటే సాధ్యం కాదు. కానీ 20 ఏళ్ళు అయినా ఇలానే ఉంటే వినేవారికైనా, చెప్పేవారికైనా విసుగు కనిపించదా! సామాన్య జీవన స్థితిగతులను అలానే ఉంచేసి.. 'రేపు నీది రేపు నీది/ రెక్కలు ముడవకు నేస్తం' అంటే ఎలా?" అని నిక్కచ్చిగా అడిగారు. నాయకులకు ఉండాల్సిన 'దూరదృష్టి' గురించి చురకలు అంటించారు.

ప్రారంభంలోనే అనుకున్నట్టుగా మళ్ళీ మనం కాలం దగ్గరకి వద్దాం. **"అయ్యవారు లేకపోతే అమావాస్య**


**ఆగుతుందా! కోడి కూయకపోతే తెల్లవారకపోతుందా? తినడానికి ఏమీ లేదని ఆకలి వేయకపోతుందా? నీకోసం పొద్దు నిలిచిపోతుందా! కాలానిది చక్రగతో, వక్రగతో గానీ అది మాత్రం ఎక్కడా, ఎప్పుడూ ఆగదు."** ఈ ప్రారంభం 1-8-84న ప్రచురితమైన వ్యాసంలోనిది. ఈ వ్యాసంలో మనిషి తనవల్ల జరిగిన మంచినో, చెడునో కాలం మీద తోసేయడం గురించి వ్యంగ్యంగా రాశారు.

మనం టైం బాగాలేదు, మా వాడికి గ్రహబలం తగ్గింది, గురుగ్రహం ఆగ్రహంగా ఉన్నాడంట, ఏలిన నాటి శని నడుస్తుందంట.. ఇలాంటి మాటలు వింటూ ఉంటాం. సైన్స్ ఇంత అభివృద్ధి చెందినా, మన జీవితాలు గ్రహాలు చుట్టూ తిప్పేసుకుని, ఏవేవో ఉపచారాలు, పూజలు చేసేస్తుంటాం. వీటిని విస్పష్టంగా ఖండించారు విద్వాన్ విశ్వం.

**"ఇంతకూ ఏదీ తన వల్ల చెడింది అనుకోవడం మనిషికి ఇష్టం ఉండదు. ఆ బాధ్యతను కాలం మీదనో, విధి మీదనో, అదృష్టం మీదనో తోసివేస్తే ఏ గొడవ వుండదని అతని భావన"** అని విశ్వం చెప్తారు ఆ వ్యాసం ముగింపులో.

"ఏమైనా ఈ కాలం సర్వ నిరపేక్షంగా మంచీ కాదు, చెడూ కాదు. సుదీర్ఘమూ కాదు, మహాభారమూ కాదు, తేలికా కాదు. అసలు నడవనిదీ కాదు. ఒకే కాలం ఆయా పరిస్థితులను బట్టి అన్ని విధాలుగా కానవస్తుంది. ఆ కాలం వీటినన్నిటిని పట్టించుకుంటూ కూచోదు. దాని దారి దానిది." 18-8-71న రోదసీయాత్రల నేపథ్యంలో రాసిన వ్యాసంలోని మాటలివి. ఈ భావాలు ఇప్పటికీ వర్తిస్తాయి. ఆధునిక మూఢత్వం వర్ధిల్లేలా పాలకులే పనిగట్టుకొని పనిచేస్తున్న ఈకాలంలో మరింత ఎక్కువగా మనల్ని జాగురుక పరుస్తాయి.

విశ్వంగారి శైలి రసఝరీ ప్రవాహంలా సాగి, చివరిలో ఒక్క 'ఫ్లాష్' లాంటి వాక్యం వెలుగులోకి తీసుకుపోతుంది. దారిని స్పష్టంగా చూపుతుంది. ఆయన యుద్ధం గురించి రాశారు. రైతుల పక్షాన మాట్లాడారు. సామాన్యుల గొంతుగా ఉన్నారు. వైజ్ఞానిక మార్గాన్ని చూపారు. తార్కిక ఆలోచన కలిగించారు. దేశభక్తిని బోధించారు. ఏం రాసినా నిజాయితీగా రాశారు. ఈ కాలంలో కూడా అవి వాటి సార్థకతను కోల్పోలేదు. ఇప్పుడు చదివినా అవి తాజాగానే ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే– ఇప్పుడు మరింత పఠనీయ ఆవశ్యంగా ఉన్నాయి. 1915 అక్టోబరు 21న జన్మించిన విద్వాన్ విశ్వం ... 1987 అక్టోబరు 19న కన్నుమూశారు. ■



## ఓ కవీ, కర్తవ్యం నిర్వర్తించు!

**ఓ** కవీ, నీ కలం కదిలించు
నీ విశ్లేషణా దూరదృష్టితో
సత్యాన్ని శోధించు
నీ కవితా పదజాలంతో
కర్తవ్యాన్ని బోధించు
నీ కలాయుధ కదనంతో
బడుగు వర్గాలకు బాసటగా నిలబడు

నీ వివేచనా వికాసంతో
వృద్ధులైన యువతను నడిపించు
నీ శాస్త్రీయ దృక్పథ దృక్కులతో
కర్మసిద్ధాంతాన్ని ఖండించు
నీ ఆధునిక కవితా సృష్టితో
మనువాదాన్ని మట్టి కరిపించు

నీ కవితా శక్తి పరంపరతో
పోరాడుతున్న రైతుల రుధిరం మరింత మరగించు
నీ కవితా సమర భేరితో
కార్పొరేట్ వృక్షాలను కూకటివేళ్ళతో పెకలించు
నీ చైతన్యపు వాక్కులతో
ప్రజా శ్రేణులను కదిలించు.. కదం తొక్కించు

నీ కలం బలం ప్రయోగించి
అలనాటి స్వాతంత్ర స్ఫూర్తి రగిలించు
మన నేల, సంపదా పరాయీకరణ చెందకుండా
మరో స్వతంత్ర పోరాటం నడిపించు!

ఓ కవీ, కలం కదిలించు
కాలానుగుణంగా నీ కర్తవ్యం నిర్వర్తించు!

**- విశ్వశాంతి**
**89194 15804**



# కరువును చిత్రించిన కె.సభా నవల 'మొగిలి'

- డాక్టర్ పొదిలి నాగరాజు
90520 38569

"**1925** ప్రాంతంలో కలవటాల జయరామారావుతో ఆగిపోయిన సామాజిక చింతన 1950 దశకం వరకూ మేల్కొన లేదు. పద్యం నుంచి వచనం వైపునకు, గ్రాంథికం నుంచి వ్యవహారిక భాష వైపునకూ, గతం నుంచి వర్తమానం వైపునకు రాయలసీమ సాహిత్యాన్ని మళ్లించిన గౌరవం కె.సభాకూ, నాద ముని రాజుకూ దక్కుతుంది. ఆ దశకంలో సభా రాసిన *భిక్షుకి*, నాదముని రాజు రచించిన *నదీనదాలు, జలతారు తెరలు* నవలలు ఇప్పుడు ఎంత ప్రయత్నించినా లభించటం లేదు. అందుచేత వీరిద్దరిలో ఎవరు తొలో, ఎవరు మలో చెప్పటం సాధ్యం కావటం లేదు" అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య 2006లో వెలువరించిన "రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ (పు. 92)"లో పేర్కొన్నారు. అయితే, ఇది నిన్నటి మాట.

కడప సి.పి.బ్రౌను గ్రంథాలయంలో నాదముని రాజు రచించిన *నదీనదాలు, జలతారు తెరలు* నవలలు ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వై.ఎన్.కళాశాల గ్రంథాలయంలో కె.సభా 1960లో రచించిన మొగిలి నవల ఉంది. నేడు వల్లంపాటి వారి అభిప్రాయాన్ని కొంత సవరించా ల్సిన అవసరం ఉంది. వరుస కరువులతో అల్లాడిపోతున్న సమకాలీన రాయలసీమ వాస్తవిక జీవన విధానాన్ని అద్భుతంగా చిత్రించింది *మొగిలి* నవల. 1950-60 మధ్య రాయలసీమలో వచ్చిన రెండు కరువులను ఆధారంగా చేసుకొని కె.సభా ఈ నవల రాశారు. ఈ దశాబ్ద కాలంలో రాయలసీమ నుంచి వచ్చిన ఏ సాహిత్యమైనా కరువును స్పృశించకుండా తమ పుటలను పూర్తి చేసిందంటే నమ్మలేము. ఆ కరువులో అప్పటి సీమ సామాజిక ఆవేదన, దుస్థితిని చూసి సీమకవి గుండె చలించిపోయి సాంప్రదాయ స్థితినుంచి ఆధునిక స్థితివైపు అడుగులు వేయాల్సి వచ్చిందని రచయిత చెబుతాడు. "క్షామ దేవతను నల్లని దుస్తులతో అలంకరించింది నిశ. కవిత్వ తత్త్వవేత్తయై శివభారతాన్ని పాడి, శివతాండవమాడి రామాయణాన్ని గానం చేస్తుండిన రాయలసీమ కవి గొంతు పెన్నేటి పాటయై ఘోషించినది. రమణుని మౌనమై మూగ వోయినది. భయావహమైన నిశ్శబ్దం పాలన చేస్తున్నది". కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వతత్త్వ విచారం', గడియారం వేంకట శేషశాస్త్రి 'శివభారతము', పుట్టపర్తి నారాయణాచార్యుల 'శివతాండవం', వావిలికొలను సుబ్బారావు 'ఆంధ్ర వాల్మీకి రామాయణము' వంటి అత్యుత్తమ ప్రాచీన సాహిత్యాన్ని అప్పటివరకు పండించిన రాయలసీమ కవిత్వం కరువులో నలిగిపోతూ గుండెలు బాదుకుంటున్న ప్రజలను చూసి ఆవేదన చెంది ఆర్ద్రతతో సీమ సంవేదనా జీవన విధానాన్ని అందరికీ తెలిసేలా సీమకవి కలం కొత్తదారులను తొక్కవలసి వచ్చింది. ఈ కొత్త దారుల్లో నుంచి పుట్టుకొచ్చిన కరువు జ్ఞాపికా వాస్తవ చిత్రణమే పెన్నేటి పాట. గంజికేంద్రాలకు గుర్తుగా చొచ్చుకొచ్చిన కావ్యమే 'తపోవనము'. సీమసాహిత్య చరిత్రలో ఈ రెండు కావ్యాలు మరిచిపోలేనివి. ఇదే కాలానికి చెందిన చిత్రణతో కరువు నవలలూ సీమ నుంచి ఎన్నో వచ్చాయి. అందులో ఒకటి కె.సభా మొగిలి నవల ఒకటి. కరువులో చితికిపోయిన ఎన్నో కుటుంబాల బతుకు ఆవేదనలన్నింటినీ కలిపి ఒకే కుటుంబంలో చిత్రించిన నవల ఇది. మొగలి తండ్రిని కోల్పోయి కుటుంబాన్ని పోషించటానికి కరువుసీమను వదిలిపెట్టి బతుకుతెరువుకోసం తెనాలికి వెళ్లి మంచితనంతో లలితను పెళ్ళి చేసుకుంటాడు. నిజాయితీతో మద్రాసు ప్రాంతానికి చెందిన సులోచనను పెళ్ళి చేసుకుంటాడు. ఈ రెండు ప్రాంతాలవారిని మొగిలి గ్రామానికి చేర్చి అందరి

సహకారంతో ఆ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే ఈ నవలా ఇతివృత్తం.

కె.సభా చిత్తూరు జిల్లా కొట్రకోన గ్రామంలో జులై 1, 1923న జన్మించారు. తండ్రి ఉపాధ్యాయుడు. చిన్నప్పటి నుంచి తండ్రి ద్వారా ఎన్నో పురాణ గాథలను వినటం వల్ల తెలుగు సాహిత్యంపట్ల అభిరుచి ఏర్పడింది. 8వ తరగతి తరువాత ఉపాధ్యాయ శిక్షణను తీసుకొని ఇంటర్మీడియట్‌ను పూర్తి చేశాడు. 16 ఏళ్ళ వయసులోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. ఆచార్య రంగా, నార్ల వెంకటేశ్వరరావుల పరిచయాల వల్ల హరిజనోద్ధరణలోనూ, స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నాడు. ప్రజారాజ్యం, ఆంధ్రప్రభ వంటి పత్రికలకు ఉప సంపాదకుడిగా, వాహిని పత్రికకు ప్రధాన సంపాదకుడిగా పనిచేశాడు. 1950లో దేవదత్తం అనే పత్రికను స్వయంగా నడిపాడు. రమణ అనే ప్రెస్ ద్వారా వివిధ రచనలను ప్రచురింపజేశాడు. 1979లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సభ్యునిగా వ్యవహరించాడు. 1942లో రచనా వ్యాసంగాన్ని మొదలుపెట్టి కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు మొదలైనవి ఎన్నో రచించాడు. సభా 'మొగిలి' నవలే కాకుండా భిక్షుకి, బడిపంతులు, దేవాంతకుడు అనే ఇతర నవలలతో పాటు సూర్యం, చంద్రం అనే పిల్లల నవలలనూ రచించాడు. 30 ఏళ్ల పాటు అనేక కోణాల నుంచి తెలుగు సాహిత్యాన్ని స్పృశించి అలుపెరగని కర్షకునిలా సాహిత్యసేద్యం చేసిన సభా నవంబరు 4, 1980న చిత్తూరులో గుండెపోటుతో మరణించాడు.

'మొగిలి' నవల కరువు చిత్రణతో మొదలవుతుంది. మొగిలి గ్రామంలో శాంతమ్మ, సుబ్బయ్యలకు పుట్టినవాడు మొగిలి. కరువులో ఆ కుటుంబం పేదరికాన్ని అనుభవిస్తూ ఉంటుంది. ఊరి వారు ఒకరొకరు వలస వెళ్ళిపోతుంటే సుబ్బయ్య కూడా వెళ్ళిపోవాలనుకుంటాడు. "ఆపాటికి వానే కురవదంటావా? ఈ కరువు యిట్లానే ఉంటుందనా?" అని కాంతమ్మ ధైర్యం చెప్పడంతో తన ప్రయత్నాన్ని మానుకుంటాడు. కడుపు నింపుకోవడానికి సుబ్బయ్య ఈతగడ్డకోసం వెళ్ళి పాముకాటుకు గురై చనిపోతాడు. కుటుంబ భారమంతా మొగిలి మీద పడుతుంది. తల్లిని ఇంటివద్ద, చెల్లిని మేనమామ ఊళ్ళో వదిలిపెట్టి పనికోసం మొగిలి కోస్తా ప్రాంతానికి ప్రయాణమౌతాడు. తెనాలి ప్రాంతానికి చెందిన అమ్మయ్య చౌదరి రైల్లో మొగిలికి పరిచయమౌతాడు. మొగిలి నిజాయితీని గుర్తించి తన బట్టలకొట్టులో నెలకు రూ.30ల జీతంతో గుమస్తాగా పెట్టుకుంటాడు. అతడి కుమార్తె లలిత మొగిలిని ప్రేమిస్తుంది. లలిత బలవంతంతో మొగిలి కూడా ఆమెను ప్రేమిస్తాడు. మొగిలి చెల్లెలికి పెళ్ళి కుదురుతుంది. పెళ్ళికి అవసరమైన డబ్బును చౌదరి అందిస్తాడు. డబ్బు తీసుకుని మొగిలి బయల్దేరతాడు. ప్రయాణంలో మొగిలికి సులోచన పరిచయమౌతుంది. చెల్లెలు పెళ్ళి పూర్తవుతుంది. లలిత, మొగిలి ప్రేమ సంగతి తెలిసి చౌదరి బాధపడతాడు. తిరిగొచ్చిన మొగిలిని ఎంతో చాకచక్యంగా ఉద్యోగం నుంచి తీసేసి మొగిలి గ్రామానికి పంపించేస్తాడు. మొగిలి పల్లెలో నాలుగు ఆవులను కొనుక్కుని జీవిస్తూ ఉంటాడు. ఎలాగైనా మొగిలినే పెళ్ళి చేసుకోవాలను కొన్న లలిత బావతో తనకు జరగాల్సిన పెళ్ళిని నిరాకరిస్తుంది. తనను గూడూరులో కలుసుకోవాలని మొగిలికి ఉత్తరం రాస్తుంది. పారిపోయి పెళ్ళి చేసుకోవాలన్న లలిత మనసును మార్చి ఆమెను తెనాలిలో తన ఇంటివద్ద వదిలేసి తిరిగి అదే రాత్రి మొగిలి తన గ్రామానికి బయల్దేరతాడు. తెల్లవారేసరికి రైలు తిరుపతికి చేరుకుంటుంది. తిరుమలకు వెళ్లగా, అక్కడ సులోచన తన తండ్రి రామిరెడ్డిని పరిచయం చేస్తుంది. తరువాత ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోతున్న హడావిడిలో సూట్‌కేసులు తారుమారవుతాయి. బట్టలకోసం సూట్‌కేసు తెరిచిన మొగిలి అందులో రూ.50 వేలు చూసి ఆశ్చర్యపోతాడు. అది రామిరెడ్డిదని తెలుసుకొని వారికి డబ్బు అందివ్వటానికి మద్రాసుకు వెళ్తాడు. మొగిలి అక్కడికి వెళ్ళే సమయానికి కట్నం డబ్బులు లేవని తెలిసిన పెళ్ళికొడుకు పెళ్ళి చేసుకోనని గొడవపడుతూ ఉంటాడు. మొగిలి తెచ్చిన డబ్బును చూసి పెళ్ళికొడుకు పెళ్ళికి సిద్ధపడగా సులోచన కట్నంకోసం ఆశపడిన వాడిని కాదని నిజాయితీపరుడైన మొగిలిని పెళ్ళి చేసుకుంటాననంటుంది. రామిరెడ్డి మొగిలి, సులోచనలకు పెళ్ళి చేస్తాడు. అందరూ కలిసి మొగిలి గ్రామానికి వస్తారు.

తెనాలిలో లలిత మనోవ్యాధితో మంచం పడుతుంది. తన కూతురిని బతికించమని చౌదరి మొగిలిని పట్టుబడతాడు. వైద్యవృత్తి చేస్తున్న సులోచన లలిత పరిస్థితిని తెలుసుకొని కొన్ని రోజులు లలితకు ప్రేమికుడిగా నటించమని మొగిలిని ఒప్పిస్తుంది. లలితకు మనోవ్యాధి నయమవుతుంది. తర్వాత మొగిలి, సులోచన భార్యాభర్తలని లలితకు తెలిసిపోతుంది. ఆత్మహత్యయత్నం చేసుకోగా, సులోచన ప్రోద్బలంతో మొగిలి లలితను కూడా పెళ్ళి చేసుకుంటాడు. దీంతో లలిత కుటుంబం, సులోచన కుటుంబం మొగిలి కుటుంబంలో కలిసిపోతారు. చౌదరి వ్యాపారవేత్తగా, సులోచన వైద్యురాలిగా, లలిత ఉపాధ్యాయురాలిగా, రామిరెడ్డి రైతుగా మారిపోతాడు. మొగిలితోపాటు అంతా కలిసి గ్రామానికి ఎవరికి తగిన విధంగా వారు సేవచేస్తూ ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతారు.

"భారతదేశపు కరువు చరిత్రలో దక్కన్ రాయలసీమ చరిత్ర

చాలా నికృష్టమైనది. తరచుగా సంభవించే కరువులకు ఇక్కడి రైతాంగం సర్వనాశనమైపోయింది. పేదరికపు పెను ఊబిలో చిక్కుబడ్డ దురదృష్టవంతుడైన రైతు ఒక కరువు బాధనుంచి కోలుకోకపూర్వమే మరో కరువుకు గురైపోతున్నాడు. శాశ్వత ఫలితాలనిచ్చే పనులను చేపట్టనందున కరువు నివారణకు పెట్టే ఖర్చంతా వృథాగా పనికిరాకుండా పోతున్నది" అంటూ ప్రఖ్యాత ఆర్థికవేత్త బి.ఎన్. గంగూలీ (తరతరాల రాయలసీమ) తెలియజేస్తారు. ఈ మాటలకు నవలా రూపమే కె.సభా మొగిలి. 1950–60 మధ్య రాయలసీమలో రెండు కరువులు వచ్చినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తుంది. 'నా రాయలసీమ రాష్ట్రం' అనే గ్రంథం 1950–53 మధ్య వచ్చిన కరువు గురించి "1952–53 మధ్య రాయలసీమలో సంభవించిన కరువులో వేలాదిమంది మరణించారు. వేలాదిమంది రైతుకూలీలు, మధ్యతరగతి జనం జీవచ్ఛవాలుగా గుక్కెడు గంజికోసం గంజి కేంద్రాల వద్ద పడిగాపులు కాయటం నాటి భారత ప్రధాని నెహ్రూ కళ్లారా చూశారు. కరువు దృశ్యాలను, మృతదేహాలను చూసి కంటతడి పెట్టారు" అని పేర్కొంది. ఇటువంటి దుర్భర పరిస్థితులను చూసి జీర్ణించుకోలేని ఘాళీ కృష్ణమూర్తి గంజి కేంద్రాలను వస్తువులుగా వేసుకొని 1954లో 'తపోవనం' కావ్యాన్ని రచించాడు. ఇది ఒక దశాబ్దకాలపు మొదటి కరువు నేపథ్యంగా వచ్చిన రచన. 1956లో రెండవసారి అదే కరువు నేపథ్యం నుంచి వచ్చిన రచన 'పెన్నేటిపాట'. దీనికి పీఠిక రాసిన ప్రముఖ విమర్శకులు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ "రాయలసీమ నేడు అఖిలాంధ్ర దేశములో ఒక విశిష్ట ఖండముగా ఏర్పడియుండుటకు దాని ఇప్పటి దారిద్రావస్థే ముఖ్య కారణము" అని ఎంతో ఆవేదనతో చెబుతారు. 1950–60 మధ్య కరువు నేపథ్యంతో ఎన్నో నవలలు సీమనుంచి వచ్చాయని తెలుస్తుంది. రెండు కరువులు సీమను ఎలా భ్రష్టు పట్టించాయో మొగిలి నవల చిత్రించింది. ఈ రెండు కరువులకంటే ముందు వచ్చిపోయిన ధాతు కరువు గురించి రచయిత నవల ముందు పేజీల్లో మనకు గుర్తు చేస్తాడు. "ముందు ధాతు కరువులోనూ అంతేననేవాడు మా తాత! ఇప్పుడెంతో మేలుకానీ అప్పుడు మట్టినే తిన్నాడు మనిషి". మనిషి చేత మట్టిని తినిపించిన కరువు మాసిపోకుండానే మరో రెండు కరువులు సీమను చుట్టుముట్టడం రచయితను ఎంతో బాధిస్తుంది. "కరువు! కరువు! రాయలేలిన రతనాల సీమలో కరువు! నవరత్నాలను రాసులుగా పోసి విక్రయించిన పట్టణాల్లో మంచినీళ్ళు లేవు" అంటూ కరువు పర్యవసానాలను రచయిత వివరిస్తారు. రాయలతోపాటే రాజసాన్ని పోగొట్టు కొన్న రాయలసీమలో కన్నీళ్ళు తప్ప నీళ్ళు లేవని ఎంతో ఆవేదన చెందుతాడు.

"ఆ కరువే అలాంటిది. అది లక్షలాది పశువుల్ని పొట్టన బెట్టుకున్నది. వేలాది ఎడ్లను మ్రింగివేసింది. వందలాది మంద గొర్రెల్ని చప్పరించి వేసింది. మనుష్యులు పరుగెత్తిపోయారు". ఇలా సీమప్రజల దీనావస్థను తెలియజేస్తాడు రచయిత. పల్లెల్లోని ప్రజలంతా పొట్ట పోసుకోవటానికి వెళ్ళిపోతుంటే పల్లెలన్నీ ఎలా బోసిపోయి వుండేవో కూడా వివరించాడు. "ఆ రెండు వీధుల్లోనూ ఎనిమిదే ఇండ్లున్నవి. అందులో ఏడూ ఒకే వీధిలో వున్నవి. రెండవవీధిలో ఉన్నది తమ యిల్లు మాత్రమే. ఆ ఒక్క దీపమూ ఆరిపోతే ఆ వీధి మొత్తమూ శూన్యమే అవుతుంది". ఇది 1960 నాటికి సీమ పల్లెల స్థితి. ఈ విధంగా వలసలో వెళ్ళినవారు ఎవరెవరు ఎక్కడెక్కడ ఎలా బతుకుతుంటుంటారో ఎవరికీ తెలిసేది కాదు. కన్నతల్లిలా పెంచిన పల్లెను వదిలి వెళ్ళిపోవటానికి కారణమైన కరువు పరిస్థితులు ఎలా వుండేవో తెలియజెప్పటానికి రచయిత మొగిలి గ్రామాన్ని ఆధారంగా చేసుకొని ఇలా వర్ణిస్తాడు : "మొగిలికొండ ఎండకు కణకణలాడుతున్నది. పచ్చని కొండవాలు బూడిద వర్ణంగా కన్పిస్తున్నది. కనుమ కింది మామిడితోట గలగల మంటూ ఆకులను రాల్చివేస్తున్నది. గోవురాతి పక్కనున్న నేరేడు చెట్టులోని చిలుకలు పత్తాలేవు. ఆ పక్కనే పండుముత్తయిదువ వలె నిండుగా కన్పిస్తుండిన అత్తిచెట్టు వాడి వత్తలైపోయింది". పచ్చదనమంతా వాడిపోయి కొండలన్నీ ఎండిన రంగులోకి మారటం కరువు బలిసివుందనటానికి ప్రతీక. ప్రకృతి పచ్చదనమంతా పాడైపోయి మోడుగా మారిన సీమ కరువు దృశ్యాన్ని సభా అద్భుతంగా వర్ణిస్తాడు. "సంజ వెలుగులో ప్రకృతి గింజకుంటూ ఉన్నది. శోభాయమానమై కళకళలాడే ఆ పల్లెటూరు కరువు రక్కసి వక్రంలో నలిగిపోతున్నది. పల్లెకు తూర్పుదిక్కున పచ్చని తమలపాకులతో విచ్చుకొని అతిథులను గౌరవించే ఆకుతోటల్లో పక్షుల కలకలరావములేవీ విన్పించటం లేదు. ఆకసాన్ని అందుకునే అవిశలు ఏనాడో అదృశ్యమై పోయినవి. వాటిపైకెక్కే ఆధారమే లేక దిగజారి నేలను ముద్దిడుకొని మళ్ళీ పైకెగ్రాకే తమలపాకుల తీగలు నూలుపోగులై నుసినుసిగా రాలిపోయినవి. ... అరటిచెట్లు పోలికలైననూ లేవు. ఎడారిలో మొలిచే చెట్లైనా లేవక్కడ! నల్లతుమ్మలు కూడా కొల్లబోయినవి". సీమచుట్టూ విచ్చలవిడిగా కన్పించే తుమ్మచెట్లు కూడా ఎండిపోయి వుండటంలాంటి దృశ్యాలు కరువుస్థాయిని తెలియజేస్తాయి. రచయిత మొగిలి మేనమామ ఊరైన జెట్టిపల్లెను ఇలా చిత్రిస్తాడు : "పల్లె చెరువు

కింది పొలాలన్నీ బీడుపడి పగుళ్ళు వారినవి. తడకర ఏటిగట్టు టెంకాయ చెట్లన్నీ తలలు వాల్చేశాయి. పెద్ద చెరువుకింద బావులూ, బారులూ ఏకంగా కనిపించే రోజులు పోయి బారులే బావులైపోయినవి. ఒడ్డులో జంబుపోచైనా లేదు. ఎద్దులచెరువు రూపాన్నే మార్చుకొన్నది. మంచినీళ్ళకుంట పేరు మాత్రమే మిగిలింది. బిల్రాజుకుంటలో తుమ్మపోచైనా లేదు. నాగులమ్మ మడుగులో నల్లేర్లయినా మొలవడం లేదు. రస్తాకిరుగడలా మేరుపర్వతాల్లా కన్పించే మద్దిచెట్లు మచ్చుకైనా కన్పించటం లేదు".

కరువు వచ్చిన ప్రతిసారీ సీమప్రజలు ఆహారం కోసం నానా అగచాట్లు పడేవారు. వర్షం లేక పంటలు పండవు. దీంతో ఆకులు అలములు, గడ్డలు, గింజలు, ప్రకృతి నుంచి వచ్చే వివిధ రకాల తిండిని ఎంతో కష్టపడి దూరప్రాంతాల నుంచి తెచ్చుకొని తినేవారు. "అక్కడికి మూడు మైళ్ళలో ఉన్నది ఈతాకుల కోన. ఆ కోనలో దాదాపు అన్నిచెట్లూ కొట్టివేశారు. అదృష్టవశాత్తు ఎక్కడో ఒక పిలక ఉండక పోతుందా అని సుబ్బయ్య ఆశ. దొరికితే ఈతపిలకను కొట్టి ఆ గడ్డను తీసుకురావటం, లేనిచో కత్తాయి గడ్డకోసం గాలించటం, రెండూ దొరక్కపోతే నిమ్మటాయి గడ్డలుంటాయి. అవి చిలగడదుంపల్లా వుంటాయి. ఏ బండ అంచుల్లోనో, గుండ్లనెరికల్లోనో దొరుకుతుంటాయి. ఏవీ దొరక్కపోతే ఎలికంజేవులైనా దొరికితీరుతాయి. ఉప్పు కారం వేసి తినవచ్చు". ఇక్కడ రచయిత ఎలుక చెవులు అనే అరుదైన శాకాహారం పరిచయం చేస్తాడు. ఇవి చాలా రుచిగా ఉంటాయి. ఇలాంటి వాటన్నిటికోసం సుబ్బయ్య అడవికి వెళ్తే సుబ్బయ్య భార్య "కాంతమ్మ కూలి చేస్తుంది. కానీ నాలుగు మాసాలనుంచి అలాంటి అవకాశాలే లేవా ఊళ్ళో. ఏటిగట్టున తుంగగడ్డల కోసం వెళుతుంది. మైలూ మైలున్నర తిరిగితే గానీ బుట్టడైనా దొరకవు" ఇది కరువుకాలంలో స్త్రీల పరిస్థితి! పిల్లలు సైతం తిండి కోసం పరుగులు తీయాల్సి వచ్చేది. మొగిలి చెల్లెలు నాగమ్మ "ఆనాడు వెళ్ళింది తమ్మకుప్పం అడవికి. అసలు దేవదారుచెట్లు కనిపిస్తే చాలు ఆ చుట్టూ యింకే ఆకులు రాలిపడి వున్నా ఏరివేస్తున్నారు జనాలు". ఆకులు తినైనా ప్రాణం నిలుపుకుందామన్నా ఆకులు కూడా దొరకని పరిస్థితి. అయినా దొరికినా ఏ ఆకునైనా సరే ఉడికించుకొని తినాల్సిందే. మొగిలి ఊళ్ళోకెళ్ళి చింతగింజలను ఏరుకొని వస్తాడు. ఇవి ఉడకేసుకొని తింటారు. ఇప్పటికీ సీమ కరువులో జీవించిన కొంతమంది పెద్దలను కదిలిస్తే చాలు, ఎన్నో రకాలుగా అడవితల్లి అందించిన ఆహారాన్ని మనతో చెబుతూ కరువుకాలాన్ని తలచుకొని కంటతడి పెడుతుంటారు. ఇలా ఇంటిల్లిపాదీ ఎంతో కష్టపడి సేకరించుకొని వస్తే ఆ రాత్రికి ఆ ఇంట్లోవాళ్ళకి ఆకలి సగం మాత్రమే తీరుతుంది. తెనాలి ప్రాంతంలో గుమస్తా పని చేస్తున్న మొగిలి తాను ప్రేమించిన లలితకు సీమ కరువు గురించి తెలియజేస్తాడు. "మొగిలి మెల్లగా గంగ కథనంతోపాటు కరువు విలయాన్ని కూడా చెబుతూ వస్తుంటే లలిత కన్నీటితో ముద్దకట్టిపోయింది. ఈ భరత ఖండంలో రాయలసీమ వంటి భూభాగం కూడా ఒకటున్నదా? మనుషులు ఆకులూ, దుంపలూ తింటూ బతుకుతున్నారా? అని ఆశ్చర్యపోతుంది". ఇటువంటి అభిప్రాయాలు నవలా కాలానికి ఎంతోమంది సీమేతరులకు ఉండేవని రచయిత అభిప్రాయం.

ఈ నవలను చదివిన కొడవటిగంటి కుటుంబరావు ఫిబ్రవరి 4, 1970లో ఆంధ్రప్రభ వారపత్రికలో ... "ఈ నవలలో నాకు అత్యుత్తమంగా కనిపించినది స్థలాభిమానం. మొదటి యాభై పేజీల్లోనూ మనకు రాయలసీమ గడ్డ, జీవితమూ ఎంతో ప్రేమతో చిత్రించటం కనపడుతుంది. ఇది నవలల్లో చాలా అరుదు. క్షామ పరిస్థితి వర్ణన ప్రశంసనీయంగా వుంది. ఆవునూ, దూడనూ ఇతర పాత్రలతో సమాన స్థాయిలో ఉంచటం కూడా నాకు ముచ్చటగా తోచింది. ఇవి మినహాయిస్తే ఇది చాలా పేలవమైన రచన". రాయలసీమను అభివృద్ధి పథంలోకి నడిపించటానికి రచయిత కె.సభా పడిన వేదనకు ప్రతిరూపం ఈ నవల. అందుకే రచయిత అవకాశమున్న ప్రతి చోటా సీమ అభివృద్ధి ఎలా జరగాలో చర్చిస్తూ రచన సాగిస్తుంటాడు. ఈ తపన పరిస్థితుల నుంచి పుట్టిందే తప్ప కాలయాపనకోసం పుట్టలేదని చెప్పవచ్చు. "హృదయ ప్రాధాన్యం, మానవత్వం, మహోన్నత్వం, నిత్య జీవిత సాన్నిహిత్యం, సరళత్వం, సుబోధకత్వం ఆధునిక సాహిత్యం యొక్క ప్రధాన లక్షణాలు" అంటాడు ప్రముఖ విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డి. నిత్య జీవితంతో కలిసి నడచిన సాహిత్యం ఏదైనా ఆధునికమేనని చెప్పిన ఆయన మాటలు ఈ నవలకు సాక్షీభూతాలు. ఆనాటి సీమ పరిస్థితులను ఎంతో అద్భుతంగా చిత్రించిన మొగిలి నవల రాయలసీమ నవలా సాహిత్య చరిత్రలో ఒక కలికితురాయిగా చెప్పొచ్చు.

■

## కవితలు

### నాటకం

రెక్కలు విదుల్చుకుని కదులుతున్న రోజులు
ఫ్యూపాలా తన గతాన్ని మార్చుకుని
భవిష్యత్తును కలగంటున్నాయి!
మేఘాల్ని కప్పుకున్న ద్రోహి
ఉత్తల బిత్తలవుతాడని గ్రహించలేదేమో?

దోసిళ్లలో కలలను నింపుకొని
వేళ్ళ సందుల్లోంచి
ఎన్ని కళలు జారవిడుకున్నాడో?
బొట్లు బొట్లుగా జారిపోతుంటే...
వచ్చే చేతులు చేయూత కోసం కాదు
విషాన్ని పూసుకున్న కత్తులని తెలియక
తన కౌగిలిస్తున్నాడు!

అస్తమిస్తాడన్న చేదు నిజం ఎరుగక
కొండలను పోగు చేసుకుంటున్నాడు
తేనెటీగ పోగు చేసిన తియ్యటి అమృతం
ఎవ్వరి పాలవుతుందో తెలియనిదా?
చుక్క చుక్క దానయ్య పాలే!

చెమట సుక్కను నమ్ముకోక
చెత్రీకింద నాటకం ఓ వలయం
ఏదీ నీది కాదనే నిజం ఒక్కటే నిజం
ఏడు రంగుల ఇంద్రధనస్సు ఆశ
కావాలనుకోవడం అత్యాశే...

నాటకం నాటకం నాటకం
జరిగింది, జరిగేది, జరగబోయేది నాటకమే...
కళ్ళకు గంతలకు కట్టి మసి పూస్తారు
ఆదమరిచామో... ఆనవాలసులుండవు
జాగ్రత్త జాగ్రత్త మేకవన్నె పులులున్నాయి
దూరంగా పో... నువ్వో రంగం ఏర్పరుచుకో...
ఈ నాటక రంగంలో ఇమడలేవు!!

**- కుంచెశ్రీ**
**99088 30477**

### మనిషిని ఈడ్చుకుపోతూనే ఉంది..!


ఒకే 'తానుగుడ్డ'ను కొనగలిగిన
స్తోమత, సమానత్వంతో
వీధి చివరలోని ఓ కల ...
ఒళ్ళంతా కప్పుకున్న అందంతో
ఊరిలోకి వచ్చి
ఓ కళ తెచ్చింది!

కానీ,
అంతటా
కురిసిన
ఆనందం
అన్ని వీధులను
తడపలేదు
అక్కడక్కడ
ఎడారి పోకడ
ముళ్ళు పూలు,
రంగు రేకులు
కమురు కాడలు, చేదు వాసనలు
గుబురు పొదలు, పచ్చి రుచులతో...



ఇప్పటికీ,
నల్లని అందాలతో
పసరు నవ్వులతో
మట్టికి గాలికి నీటికి
మరీ మనసులకి
ఇరుకు మురికిని పూసి
భూమికి బుద్ధిని దూరాన్ని కట్టి
సాక్ష్యాత్తు చదువు సమక్షంలో
స్వార్థం సాక్షిగా......
మనిషిని ఈడ్చుకుపోతూనే ఉంది..!

**- చందలూరి నారాయణ రావు**
**97044 37247**




# మనసు లోతులను తడిమే 'స్పర్శవేది'



- **బాహరా** (బాడిశ హన్మంతరావు)
86868 64896

**క**థలంటే జీవిత దృశ్యాలు. జీవితంలోని అన్ని పార్శ్వాలూ ఒకే ఒక జీవితంలో మనకి లభించడం సాధ్యం కాదు. మనకున్న ఒక్క జీవితంలోనే మరెన్నో జీవితాలలోని సంఘటనలను చూడగలిగే అవకాశం కథలు మనకు కల్పిస్తాయి. కొన్నిసార్లు అవి మనల్ని ఆహ్లాదపరుస్తాయి. కొన్నిసార్లు ఆలోచింపజేస్తాయి. మరికొన్ని సార్లు మనలోని లోపాలను ఎత్తి చూపి మనలో మార్పుకు కారణభూత మవుతాయి. ఎమ్వీ రామిరెడ్డి వెలువరించిన ఈ సంపుటిలోని కథలన్నీ ఈ మాటలను సార్థకం చేస్తాయి.

కథకుడిగా, కవిగా సామాజిక ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ రచనలు సాగించే వీరు పాఠక లోకానికి సుపరిచితులు. వీరి సాహితీ పయనం తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని పొందింది. అద్భుతమైన సరళ శైలితో విభిన్న సామాజిక పార్శ్వాలను స్పృశిస్తూ హఅదయాలను కదిలించే వీరి కథలు పాఠకులకు తమ సమాజంపై ఎంతో భరోసాను ఇస్తాయి.

ఉద్యోగ రీత్యా, ప్రవఅత్తి రీత్యా సాయం అందించడంలో మజాను అనుభవిస్తున్నానని చెప్పే వీరు ఇప్పటివరకూ మూడు కవితా సంపుటిలు, రెండు కథా సంపుటాలు అందించారు. అరడజను పైగా పురస్కారాలు పొందిన 'వెంట వచ్చునది' సంపుటి తరువాత, 'స్పర్శవేది' పేరుతో వెలువరిస్తున్న ఈ కథా సంపుటి ఆ క్రమంలో మూడోది. పదిహేనేళ్ళుగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించిన సందర్భాల్లో, తను దర్శించిన ఎందరో సేవామూర్తులు, ఎదురైన అద్భుత 'సాయం' సమయాలను, నిజ అనుభవాలను కథారూపంలో గుది గుచ్చి 'స్పర్శవేది' అనే కథా సంపుటిని మనకు అందిస్తున్నారు ఎమ్వీ రామిరెడ్డి. 'ఏ లోహాన్నైనా స్వర్ణంగా మార్చే ప్రక్రియ పరుసవేది అయితే... దాన్ని మించి మనుషులను మార్చే సాధనం సేవా దీప్తి' అని ముందు మాటలో పేర్కొన్నట్లు, ఈ పుస్తకంలో ఉన్న పదహారు కథలూ, మనుషులకు ఉండే – తోటి వారికి సేవ, మానవత్వం అనే గుణాలను ప్రతిబింబించడం గమనార్హం.

పరులకు సేవ చేయడాన్ని నర్మగర్భంగా చూపే, హాయి గొలిపే అర్థవంతమైన ముఖచిత్రంతో విడుదలైన ఈ పుస్తకం... తీర్చిదిద్దిన శిల్పాలు కలిగిన ఆలయ దర్శనం మాదిరిగా, చదవడం పూర్తిచేశాక సరికొత్త అనుభవాన్ని అందిస్తుందనడంలో సందేహం లేదు. మొదటి రెండు మూడు పేజీలు చదవడం మాత్రమే పాఠకుల చేతుల్లో ఉంది. తరువాయి వదిలిపెట్టకుండా చదివించే బాధ్యతను పుస్తకమే తీసుకుంటుంది.

ఒకవైపు కూతురి నిశ్చితార్థం, మరో వైపు అదే అపార్టుమెంటులో నివసించే మాధవయ్యకు గుండె ఆపరేషన్. ఎక్కడ తను ఉండాలో అర్థం కాక సందిగ్ధంలో ఉన్నాడు జెకేయార్. ఆ స్థితిలో మాధవయ్యను వదిలి వెళ్లడానికి మనసొప్పడంలేదు అతనికి. ఇంటి వద్ద నుంచి ఒకటే ఫోన్లు, వెంటనే రమ్మని. మాధవయ్య కొడుకు రావడానికి చాలా సమయం పట్టేట్టుంది. చివరకు జెకేఆర్ ఏం చేస్తాడు? కళ్లను పరుగులు తీయించే కథనంతో సాగిన 'మాధవసేవ' ఈ

'స్పర్శవేది'లో మొదటి మెట్టు.

తన బాల్యాన్ని నరకప్రాయంగా మార్చిన సవతి తల్లికి ఊహించని శిక్షను వేసిన ప్రత్యూష గురించీ, అందుకు సహకరించిన ప్రమోద్ గురించీ తెలుసుకోవాలంటే 'సేవే మార్గం' కథలోనూ, అలాగే తనను ఇబ్బందులకు గురి చేసి తన చిన్న బుద్ధిని బయట పెట్టుకున్న భ్రమరాంబకు, అరుణ కొత్త అనుభవాన్ని అందించిన తీరును 'అరుణారుణం'లో చూడవచ్చు. ఈ కథల్లో మనం ఎంత ఇన్వాల్వ్ అవుతామంటే మన చుట్టే జరుగుతుందన్న అనుభూతికి లోనయ్యేంతగా!

ప్రేమలో మోసపోయి, వేశ్యావృత్తిలో కూరుకుపోయిన వనజకు ఆ వృత్తి ఒక కూతురిని కూడా ఇస్తుంది. తనకు మెరుగైన జీవితం ఇవ్వాలనే ఆశయంతో దూరంగా హాస్టల్లో పెట్టి చదివిస్తూంటుంది. ఆ చదువు ఓ గట్టుకు చేరితే వేశ్యా వృత్తిని వదిలేద్దామనే ఆలోచనలో ఉన్న ఆమెకు పరిస్థితులు వీరబాబు అనే మదపటేనుగు పాలబడేలా చేశాయి. తన స్నేహితురాలు సరోజ, ఎన్జీవో ఉద్యోగి బాలాజీ సహకారంతో ఎలా బయట పడిందో రామిరెడ్డి తనదైన శైలితో రాసిన 'కుచ్ తో హై' తెలుపుతుంది.

ప్రేమ పేరుతో యాసిడ్‌తో మొహం కాల్చిన పశువొకడు, అంత: సౌందర్యం నాకు నచ్చిందని బింకి జీవితంలోకి ప్రవేశించిన పశువొకడు. చివరకు వాడు కప్పుకున్న మేకతోలుని చీల్చి, తన భావి జీవితాన్ని రేష్మ ఎలా మలుచుకుందో దాని ద్వారా ఏమాశించనుందో మీకు 'యాసిడ్ టెస్ట్' చెబుతుంది. స్త్రీల స్థితిని స్వార్థపరులు ఎలా అనుకూలంగా మార్చుకుంటారో ఈ కథలో తేట తెల్లం చేస్తారు రచయిత.

ఎవరూ కలలోనైనా ఊహించని ఉపద్రవాన్ని తెచ్చిన కోవిడ్ ఎందరి జీవితాలను అల్లకల్లోలం చేసిందో, ఎందరి జీవితాలను ఊహించని దారులకు మళ్లించిందో లెక్క లేదు. కానీ ఇంత భయంకరమైన స్థితిలోనూ ఎందరి గుండెల్లో ఆరిపోయిన తడిని వెలికి తీసి పక్కవారి గురించి ఆలోచించేలా చేసింది. అలాంటి సేవా సందర్భాలను తను చూసిన జీవితాల నుంచి ఒడిసిపట్టుకొని 'స్పర్శవేది'గా మన ముందుంచారు రచయిత. ఈ కథను ఆవిష్కరించిన తీరు ఎందరో పాఠకుల మెప్పు పొందింది. అందుకే ఇదే పేరు కథాసంపుటి కవర్ పేజీపై పుటం వేసుక్కూచ్చుంది.

'ఆ మధ్యాహ్నం మరగ్గాగిన పొంత కాగులా ఉంది. ఆవిర్లు పోతున్న అట్లపెనంలా ఉంది' గమ్మత్తైన ఉపమానంతో మొదలైన కథలో, రియల్ ఎస్టేట్ భూతం తనను ఎలా చీల్చి చెండాడిందో నేలతల్లి హృదయ విదారకంగా చెబుతుంది 'గుండె చెరువై...'లో. మన కళ్ళముందే జరుగుతున్న మారణ హోమాన్ని, నిర్లజ్జగా చూస్తూ నిలబడుతున్న మనలను చెరోపక్కన నిలబెట్టి నిలదీస్తున్నట్టుగా... మన తలలను కాళ్ళకు ముడి పెట్టే ప్రయత్నంలో కథ సఫలమవుతుంది.

మానవాళికి ఎప్పుడు విపత్తులు సంభవించినా ఆ సందర్భాలు ఎవరో ఒకరి చేత ఏదో ఒక రూపంలో నమోదు చేయబడతాయి. అవి చిత్రలేఖనం గావచ్చు, సంగీతం గావచ్చు, నాటకాలు, నవలలు, కథలు ఇలా... ఇట్టి సందర్భాలు ప్రతిభావవంతులైన రచయితల ద్వారా భావితరాలకు అందచేయబడతాయి. అవి పాఠాలే అవుతాయో, పరిష్కారాల ఆవిష్కరణకు దారే తీస్తుందో కాలమే చెబుతుంది. ప్రస్తుతం మనం ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న ఇప్పటిస్థితి కూడా అందులో ఒకటి. ఇలాంటి సమయావస్థ చిత్రించబడిన కథే 'మరణానికి ఇవతలి గట్టు'. కథలో అంతర్భాగంగా అలముకున్న మానవ బంధాల పరిమళం మంచి కథను చదివామన్న తృప్తిని ఇస్తుంది.

రైతులను సెన్సిటైజ్ చేయడానికి వచ్చిన ఉదయ్ చావు బతుకుల కత్తి మీదకు చేరాడు. చివరకు ఉదయ్ ఏమవుతాడు? జానకిరామయ్య నేర్పదలచిన విషయాలేవీ? రైతుల స్థితిని చిత్రిక పట్టిన కథ 'నాగలి గాయాల వెనుక'... అయితే ఒక పిల్లల గలాటాలో కన్న కొడుకు స్పందించిన తీరునుంచి పాఠం నేర్చుకొని, సుదర్శన్‌కు ఎదురుతిరిగిన రైతు చంద్రయ్య గురించి 'సంకెళ్ళు తప్ప'లో చిత్రించి రైతు జీవితాలకు ఓ రెండు పార్శ్వాలను రచయిత పాఠకుల కళ్ల ముందు నిలబెట్టారు. అవినీతి సూపర్వైజర్ రూపంలో, దానవత్వం సింగారావు రూపంలో సుందరి దైనందిన జీవితంలో ప్రతి రోజూ ఎదురవుతాయి. చివరకు దానవత్వం చేతిలో చిక్కిన సుందరి ఏం చేసింది? చీకటి చెత్తను ఉద్దేస్తూ డ్యూటీ ఎక్కిన సూరీడు, వ్యర్థాన్వేషణలో బయలుదేరిన సుందరికి పోలిక ఏమిటో 'వ్యర్థాన్వేషి'లో తెలుస్తుంది.

"మొక్కకు కాపు రాలేదని పత్తి మొక్కకు మందు కొట్టడం ఆపే త్తామా? అవలక్షణం ఉందని మడిసిని ఏరివేత్తామా? అందునా పేనాలకే పెమాదం ఉన్నప్పుడు. ఏమో! నేనయితే సూత్తా ఊరుకోలేను". ఇది సాంబశివుడు మామయ్య చెప్పిన మానవతా పాఠం. ప్రవాహంగా సాగిన కథనంతో సాంబశివుడి 'శివతాండవం'తో కథ మరో మెట్టుకు చేరుతుంది.

పారిశుధ్య కార్మికురాలు జంగమ్మ మనుమరాలికి డెంగ్యూ, జాండీస్ కలిపి వచ్చాయి. ఆసుపత్రి ఖర్చులకు కూడా సాయపడని శానిటరీ ఇన్స్పెక్టర్, సూపర్ వైజర్ల ప్రవర్తనతో ఇబ్బందులు పడి నాగరాజు సాయంతో గండం గట్టెక్కుతుంది. కొద్ది రోజులకే శానిటరీ ఇన్స్పెక్టర్ కొడుక్కి అదే డెంగ్యూ జ్వరం

వస్తుంది. జంగమ్మ సాయం అవసర పడిన సమయంలో ఆమె ఎలా స్పందిస్తుంది? ఇల్లంతా శుభ్రం చేశాక బయట పడేసే చీపురు మళ్ళీ శుభ్రం చేయడానికి ఇంట్లోకి చేర్చబడుతుంది. ఈ కథకు 'చీపురు పుల్ల' అనే పేరు పెట్టడంలోనే రచయిత చతురత బయటపడుతుంది. క్యాన్సర్ చికిత్సలో భాగంగా ఉపయోగించే కీమో థెరపీతో పలు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. వాటిలో ఒకటి జుట్టు పూర్తిగా రాలడం. ఇలాంటి పేషెంట్లకు విగ్గులు తయారు చేసే సంస్థకు రచయిత కుమార్తె జుట్టు దానం చేసిన సందర్భాన్ని తీసుకుని అల్లిన కథ 'కురుక్షేత్రం'. కేన్సర్‌తో పోరాడే యుద్ధంలో పేషెంట్లకు కురులు ఇవ్వడం ద్వారా కథానాయిక జీవితం ఎటువంటి మలుపులకు లోనవుతుందో తెలియాలంటే ఈ కథ చదివి తీరాలి.

ధనవంతులు, శ్రీమంతులు అని ఎవరిని అంటాం? సాధారణ సమాధానానికి భిన్నంగా అసలైన శ్రీమంతులను తన 'శ్రీమంతులు'లో రచయిత పరిచయం చేస్తాడు. మనమూ అలా మారాలంటే ఏం చేయాలనే ఆలోచన రేకెత్తిస్తాడు. కరోనా దెబ్బ పడిన వృత్తుల్లో మన ఊహకు కూడా రాని వృత్తి వ్యభిచారం. అద్భుతమైన కలల భావిజీవితం ఊరిస్తుంటే, రాజుతో ఊరు దాటుతుంది ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి. ఆ దాటడం దాటడం రకరకాల మలుపులు తిరిగి, షకీలా పేరుతో వేశ్యావృత్తిలో తేలుతుంది. వివాహ బంధానికి ఫలంగా పుట్టిన పాపను బతికించుకోవడానికి సాగిస్తున్న వృత్తికి కరోనా కాటు పడింది. చివరకు యాదమ్మ సలహాతో జీవితాన్ని ఎటు తిప్పుకుందో 'షకీలా మరణం' చెబుతుంది.

కథలన్నీ రచయితకెదురైన ఘటనలనుంచి ఉద్భవించడంతో ఎక్కడా కృత్రిమత్వం కనపడక, అవి ప్రాణంతో కళ్ళముందు కదలాడతాయి. 'సేవ' అనే ఒకే నేపథ్యంతో దాదాపు అన్ని కథలు రాసినా ఎక్కడా పునరుక్తి దోషం కనిపించదు. వేటికవే విభిన్నంగా ఉన్న అంశాలతో రాయబడిన కథలను ఒక చోట చేర్చి, మంచి నాణ్యత కలిగిన ముద్రణా, ప్రతి కథకు అచ్చులో వచ్చినప్పటి చిత్రంతో కలిపి సరసమైన ధరతో అందించారు. ప్రత్యేకించి ఈ పుస్తకాన్ని 'కోవిడ్ వారియర్స్'కు అంకితం చేయడం సముచితంగా ఉంది. సామాజిక స్పృహకు పెద్ద పీట వేసే ఇటువంటి కథా సంపుటాలను మళ్ళీ మళ్ళీ రచయిత (ఎమ్వీ రామిరెడ్డి 9866777870) నుంచి ఆశించడం, ఆయన సామర్థ్యం దృష్ట్యా అత్యాశ కాబోదు.

■

# మట్టిపరిమళం

**మ**ట్టి కుండలో మంచినీళ్లు చల్లటివే
చావ చేసి చేరిస్తే చెల్లుబాటు లేదు
మట్టి పాత్రలో చద్ది కూడు ఆరోగ్యమే
ఆకర్షణతో అంతమైపోయి అంటేది లేదు

మట్టితో దేవతమూర్తులకు ఆరాధనలే
ఆరాధన లేని ఆకృతులు అలంకారంగా
మిగిలింది లేదు
మట్టిలో ఆకారాలు ఆకర్షణలే
మట్టిలోని జీవితం మట్టితో జీవనం
మట్టి లేందే మనిషి లేదు

మట్టిలోకి పోవాలన్న
మట్టి కుండతో తుది చుక్కలు
మట్టి మనిషిని నేను
నాకు మట్టి కావాలి
మట్టిలోకి నేను పోవాలి
మట్టిలో కాసుల్లేని జీవితంలో గతి లేని గమనం

గుడ్డ గూడు లేకపోయినా
బువ్వలేకుండా గడిపేదెలా?
బువ్వ కోసమే కాయ కష్టాలు
మట్టిలో మనిషిగా మిగిలిపోయాను

మిగిలిన జీవితంలో కష్టానికి కాసుల్లేవు
కాపాడలేక పోయినా
కష్టాన్ని కంటితో చూసే మనుషులం

కన్నీటి పర్యంతమయ్యే
కష్ట జీవులను కాసుకునే బాధ్యతగా
బజారులో ఒక్కసారి ఒక్కటి కొంటె చాలు
మనం మన చేత్తో మట్టిలో మనిషిని
కాపాడ్డానికి చేసే మేలు..!

**- కొలచిన రామ జగన్నాథ్**
**85200 05313**

## కవిత

# మా ఊరు - పావురాళ్లు

- మహమూద్

94410 27462



పేరులోనే ప్రొద్దు ఉన్నందుకేమో
మా ఊరిని వెలుతెరెప్పుడూ వీడదు
పావురాళ్ల రెక్కల వెన్నెల
ఒక ఆభరణం మాకు

పసిపాపాయి మోము మీద
నవ్వులు పువ్వులుగా విచ్చుకున్నట్టు
రెక్కలు విప్పార్చుకొని
మా ఊరి పొద్దుల మీద
పావురాళ్ళు వాలుతూ ఎగుర్తుంటాయి
వాటి ఎగిరింతలు
గాలి గిలిగింతలు జమిలిగా
ఊరు ప్రశాంతత ఊయలలో ఊగుతుంటుంది

కపోతాలు శాంతి దూతలంట కదా
ఇన్ని వందల దూతలు మా వైపుంటే
శాంతి మా ఊరి మీద గాలి పరవళ్ళవదా?
ఆ రెక్కల వర్ణంలో అవి
బూడిద పూసుకున్న శివభక్తుడిలా ఉంటాయి
వాటి మెడకింద సప్తవర్ణాలను
ఇంద్రధనుస్సులు అద్దిపోయా ఏమో మరి!

రెక్కలొచ్చిన భూమిలా
వాటి దేహం గోళాకారం
గుటుర్గూ అంటూ ఒకటే శబ్దం
వాటి వల్ల మా దరి చేరదు నిశ్శబ్దం

ఒక వైపు మసీదు మీనార్లూ
ఇంకో వైపు గోపురాలూ మా ఇండ్ల వసారాలు
ఊరి చెవులకు లోలాకులు కుట్టినట్టు
ఎటు తల తిప్పినా అటు వాటి గూళ్ళు
గుడ్లు పెట్టి పొదిగే సమయంలో తప్ప
నిమిషం కూర్చోని కుదుర్తనం లేని
అల్లరి పిల్లల్లా గుంపులు గుంపులుగా
చక్కర్లు కొడుతుంటాయి!

ఎంత ఐక్యత వాటికి
గూటిని కాపాడుకొనే పనిలో
వాటి నిమగ్నతను చూసి
మన కాంక్రీటు గుహలు సిగ్గుపడుతుంటాయి
ఆ జంటల మధ్య పని విభజన
మన జెండర్ బయాస్‌ను ప్రశ్నిస్తున్నట్టుగా ఉంటుంది
సమ సమాజం మనకొక కలైతే వాటికి వాస్తవం!

ఒక్క గద్దని కూడా పక్షుల రాజ్యపు గద్దె మీద
కూర్చోనీయని బలమైన విహంగ వీక్షణం వాటిది
ఎంతో నేర్చుకోవాలి మనం, ఈ బుల్లి జీవుల్నించీ?

ఆకాశాన్ని భూమిని కలిపే వారధులు పక్షులనీ
వాటి గూళ్ళలో కొంత చెట్టుకూ
గుండెల్లోనూ కొంత నింగికీ
ఇంకొంత భూమికీ చోటుందని
అవి చెబుతుంటాయి!

మనలా సంపద కోసం అటు అంబరాన్నీ
ఇటు అరణ్యాల్నీ కబ్జా చేయకూడదనీ
ప్రకృతి జీవులుగా జీవించడానికి
ఏ కృతినీ చెడగొట్టకూడదనీ
వాటి గూళ్ళు ఉదాహరణలవుతాయి

అందుకే
నేనూ ఓ పావురాన్నిపుడు
నా రెక్కల కింద కొత్త భూగోళం పొదుగుతూ... ■




# మానవ విలువలూ .. సామాజిక సంబంధాలూ ...

- రాజాబాబు కంచర్ల
94900 99231

ఏ కథ పుట్టినా... ఆ కథకు ఆ వ్యవస్థలో రూపుదిద్దుకున్న అనేక సంఘటనలు, సందర్భాలు ప్రేరణగా నిలుస్తాయి. కథ సమాజానికి నిలువుటద్దం. రచయిత బాలం వెంకటరావు 22 కథలతో తాజాగా 'పరిహారం' (మరికొన్ని కథలు) పేరిట ఒక సంపుటి వెలువరించారు. వీటిలో ఎక్కువ భాగం నాలుగు దశాబ్దాల క్రితం రాసినవే కావడంతో... నాటి పరిస్థితులకు, నాటి సామాజిక స్థితిగతులకు అద్దం పడతాయి. ముఖ్యంగా ఈ సంపుటిలోని అన్ని కథలూ మనిషి జీవితంలోని వివిధ కోణాలను స్పృశిస్తూ, మనిషిలోని మానవత్వాన్ని తట్టి లేపుతాయి. మానవ సంబంధాలను, మనిషి విలువలను విశ్లేషిస్తాయి. నిత్యజీవితంలో సమాజంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను కథావస్తువుగా తీసుకొని సరళమైన శైలిలో కథలుగా మలిచారు. మనిషిపై మనిషికి నమ్మకం వుండాలని, బంధాలను, విలువలను వస్తురూపంలో లెక్కించరాదన్న అంశం దాదాపు ప్రతి కథలోనూ కనిపించే సారూప్యత.

ఈ పుస్తక శీర్షికగా ఎంచుకొన్న 'పరిహారం' కథ యజమాని తన తప్పును నౌకరుపై వేసే కుటిల మనస్తత్వాన్ని చిత్రిస్తూ సాగుతుంది. ఊళ్లలో ఉండే రాజకీయాలకు పనోళ్లు ఎలా బలైపోతుంటారో, యజమానులు ఎలా తప్పించుకుంటారో ఈ కథ కళ్లకు కదుతుంది. కరెంటు షాకుకి గేదెని పోగొట్టు కున్న నరసయ్య 'పరిహారం' కోసం ఉద్యోగం వదులుకోవాలో, ఉద్యోగం కోసం యజమాని అన్యాయాన్ని సహించాలో అర్థంకాక తల్లడిల్లుతాడు. యజమాని బాగుంటే తనకో పదిరూపాయలు పెంచమని అడగొచ్చని పనివాళ్లు అనుకుంటే, పనివారి శ్రమను ఎలా దోచుకోవాలా అని యజమాని చూస్తుం టాడు. పెట్టుబడిదారులు... కార్మికుల మధ్య వుండే వైరుధ్యం ఈ కథలో స్పష్టంగా కనిపిస్తుంది.

కాలం ఎంత అభివృద్ధి చెందినా, విజ్ఞానం ఎంత పెరిగినా సాటి మనిషిలో నిజాయితీ, మాట మీద నమ్మకం వున్నంతకాలం రుజువులు, సాక్ష్యాలు అక్కరలేదని, మనిషి వస్తువు కాదు... మనిషి మీద మనిషికి నమ్మకం వుండాలని, మనిషిని మనిషి నమ్మలేనినాడు జీవితం దుర్భరం అవుతుందని చెప్పే కథ 'విలువలు'. మనిషిని మనిషి నమ్మకపోతే మానవత్వానికి అర్థం ఉండదని ఈ కథ ద్వారా రచయిత విలువైన విషయాలను చెబుతారు.

కొందరు నవ్వుని ముఖాన మాస్క్‌లా తగిలించుకొని పైకి ఎంతో అప్యాయతను ఒలకబోస్తారు. ఆ నవ్వు వెనుక, ఆ ఆప్యాయత వెనుక అసలు రూపం వేరే ఉంటుంది. 'సార్' అంటూనో, 'గారూ' అంటూనో పిలుస్తూనే పక్కకు వెళ్లి అవమానకరంగా మాట్లాడతారు. స్కూలు పిల్లల్లా 'అరేయ్'... 'ఒరేయ్' అనుకుంటూ ఎందుకు అన్యోన్యంగా వుండలేక పోతున్నాం... అనే ప్రశ్న 'ఒరేయ్' కథలో కనిపిస్తుంది. 'ఒరేయ్' అని పిలిపించుకోడానికి రాజారావ్ పడిన తపన, ఆవేదన చూసి.. 'ఒరేయ్' అని ఆప్యాయంగా పిలిచే ఒక్క స్నేహితుడూ లేని జీవితం వ్యర్థమని ఈ కథ చదివినవారికీ అనిపిస్తుంది. మంచి పంటభూమిని, పచ్చని పంట పొలాలను చేపల

చెరువులుగా మార్చేసి, డాలర్లు సంపాదనలో పడి పచ్చని ప్రకృతిని నాశనం చేస్తే వచ్చే పరిణామాలేమిటో 'చేను-చేప' కథ చెబుతుంది. పచ్చని చెట్లను కూడా నరికేస్తే... కాస్తంత నీడ కోసం, కాసిన్ని మంచినీళ్ల కోసం అప్పల్రాజు పడే నరకం, అతను సంపాదించిన డబ్బు తీర్చలేకపోతుంది. ఆ అనుభవం తర్వాత అప్పల్రాజు ఎలాంటి గుణపాఠం నేర్చుకున్నాడు, ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడనేది ఈ కథ చదివితే అర్థమౌతుంది. ప్రకఅతిని విధ్వంసం చేస్తే ఎలా గుణపాఠం చెబుతుందో 'చేను-చేప' వివరిస్తుంది. మనిషికి-పర్యావరణానికి ఉన్న సంబంధాన్ని, పర్యావరణం ధ్వంసమైతే మనిషి పరిస్థితి ఏంటన్న విషయాన్ని సుబోధకంగా వివరిస్తుంది.

ప్రేమ పేరుతో వంచనకు గురై, వ్యభిచార రొంపిలో కూరుకుపోయిన ఓ యువతి కథ 'వాసనలేని పువ్వు'. ప్రేమించిన వాడిని నమ్మి, తల్లిదండ్రులకు చెప్పకుండా... ఇల్లు వదిలిపోయిన యువతి... తన జీవితం ప్రేమించిన వాడితో అద్భుతంగా... పూలనావలా సాగిపోతుందనుకున్న దశలో ఓ బిడ్డకు తల్లవుతుంది. ఖర్చులు పెరుగుతాయి. ప్రేమించి, అద్భుతమైన జీవితాన్నిస్తానని చెప్పిన శ్యామలరావు... 'ఇకముందు నాకేమీ కావు. మిగిలిన గొడవల్తో నీతోనూ కూడా నాకు సంబంధం లేదు' అంటూ ఒక అర్ధరాత్రి తల్లీబిడ్డను వదిలేసి వెళ్లిపోతాడు. బతుకుదెరువు కోసం ఆ యువతి రోడ్డున పడితే... ఈ వ్యవస్థ ఆమెను వేశ్యగా మార్చుతుంది. బిడ్డను అనాధాశ్రమానికి చేర్చుతుంది. అనుకోని పరిస్థితుల్లో ఆ యువతి తన అక్క, బావను ఎలా కలిసింది... తర్వాత ఆ యువతి ఏమైంది అనేది ఈ కథ చెబుతుంది.

ఈ దేశానికే కాదు... ఏ దేశానికైనా ఆహారం అందించేవాడు రైతు. అలాంటి రైతు వ్యవసాయ రంగం నుంచి తప్పుకుంటే మనిషి మనుగడకు అర్థం లేదని 'పునరాగమనం' కథ చెబుతుంది. నిచ్చెన మెట్లలాంటి ఈ దళారీ వ్యవస్థలో రైతు ఎంత దోపిడీకి గురవుతున్నాడో వివరిస్తుంది. వ్యవసాయం శుద్ధ దండగ అని, గిట్టుబాటు ధరలేక అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోందని, వ్యవసాయాన్ని వదిలి.. పట్నం వెళ్లి... చెరకురసం బండి నడిపిన ఓ యువకుడి కథ ఇది. చివరకు చెరకురసం బండి నడపడంలో వున్న పోటీతో పాటు.... రైతు ఎలా మోసపోతున్నాడో కూడా తెలుసుకుంటాడు. రైతు వుంటేనే మానవజాతి బతికి బట్టకడుతుందని, వ్యవసాయంతోనే రైతు మనుగడ అని ఈ కథ చెబుతుంది.

ఈ రోజుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇప్పుడే కాదు ఎప్పుడైనా ప్రవర్తన... మనిషికి ఆభరణం వంటిది. ఎంత పెద్ద చదువు చదివినా, ఎన్ని డిగ్రీలు చేసినా... ఉద్యోగానికి ఆ సర్టిఫికెట్లతో పాటు ప్రవర్తన కూడా ముఖ్యం. ఆ విషయాన్ని చాలా సింపుల్‌గా వివరించిన చిన్న కథ 'ఉద్యోగం'. కథ చిన్నదే అయినా... ఇందులో పెద్ద నీతి వుంది. జీతం పెంచమని అడిగితే... 'ఎందుకు?' అంటూ అర్థం లేని ప్రశ్న వేస్తాడు యజమాని. తన వ్యాపారాన్ని పెంచుకోడానికి లంచం ఇవ్వడానికి మాత్రం వెనకాడడు. ఆ లంచం కూడా ఆ ఉద్యోగి ద్వారానే పంపుతాడు. జీతం పెంచమంటే సర్దుకుపొమ్మని చెప్పే యజమాని పై అధికారులకు తన చేతుల మీదుగానే లంచాలు ఇప్పిస్తుంటే... విసిగిపోయిన ఉద్యోగి ఏం చేశాడన్నదే 'సంపాదన' కథ సారాంశం.


'తప్పెవరిది?' కథలో సత్యవతి పాత్ర చిత్రణ అభ్యంతర కరంగా ఉంది. కోర్కెలతో బరి తెగించిన అమ్మాయిగా.... చిత్రించారు. శంకరం పాత్రను ప్రవేశపెట్టిన తీరు కూడా సందర్భోచితంగా లేదు. సత్యవతే శంకరాన్ని పిలిచి, తన కథ తనే చెప్పుకోవడం అంత ఆసక్తికరంగా లేదు. సత్యవతి కథను చెప్పడానికి ప్రవేశపెట్టిన ఒక అప్రధాన పాత్ర శంకరం. వయస్సు తొందరలో కోర్కెలకు బానిసైతే... నైతికంగా, భౌతికంగా ఎలా పతనం అవుతామో చెప్పాలనుకున్న రచయిత తాపత్రయం అభినందనీయమే. అదే సందర్భంలో సత్యవతి పాత్రను, తన ఫ్లాష్‌బ్యాక్ చెప్పే సన్నివేశాన్ని మరింత బిగువుగా చెప్పివుంటే.. ఈ కథ ఆసక్తికరంగా ఉండేది. మొత్తం మీద ఈ కథలన్నీ చదవదగ్గవే. మనుషులను, మనస్తత్వాలను వివరించేవే! ■



**"ఉద్యమాలూ విప్లవాలూ**
**నెగ్గినా మగ్గినా ...**
**ఆకాలంలో వచ్చే**
**సాహిత్యం మాత్రం నాటి**
**చరిత్రను సజీవంగా**
**భద్రపరుస్తుంది."**
**- ఆరుద్ర**

# కవితలు

## చిన్ని ఆశ



ఇప్పుడు ...
జీవితం – ఓ చీకటి రాత్రి!
నవ్వు – ఓ కాగితం పువ్వు!
ఆశ – చిక్కుపడ్డ కలల చిట్టా!
.
నిజం మీద సమాజం కొట్టిన దెబ్బలన్నీ
వాటికవే వైరుధ్యాలై
ఇజాలను కప్పుకొంటే
ఇప్పటి నైరూప్యం రేపటికి రూపమౌతుంది
.
అసలిక్కడ మనస్సుకు చెప్పుకునే ఊసులేవీ
మలిన దేహావాహాలు తప్ప
మమతల కౌగిళ్ళ ఊహలేవీ
ఆవేశకావేశ వ్యూహాలు తప్ప!
.
మనుషులకు రెండు ప్రపంచాల జీవితం
సహజమైపోయాక
అసలు ముఖం ఒక ప్రశ్నేంది
నిజాయితీ వెగటెత్తి పోయింది
.
అయినా, మనస్సు ఏకకాలంలో
వైరుధ్యాలతో చెట్టాపట్టాలేసుకుని
విహారాలు చేస్తున్నప్పుడు
విచక్షణ కనిపించని ఓ చల్లని తెమ్మెరలా
ఆవరించదా అనే చిన్న ఆశ!

**- తాంద్ర రమణ**

## దిష్టిబొమ్మలు

**- ఈదర శ్రీనివాసరెడ్డి**

వాళ్లలా ఉండు వీళ్ళలా ఉండు అంటూ
వెంటాడి వేధించేవాళ్లే ఎదురవుతున్నారు కానీ
నువ్వు నీలా ఉండు అని భుజం తట్టే వాళ్లే లేరు
నీదంటూ ఒక చెరగని ముద్ర వేసిపో అని అడిగే వాళ్ళే లేరు

ఎవరెవరివో అడుగుజాడల్లో నడవమని నచ్చజెప్పే వాళ్లే కానీ
కొత్త అడుగులు వెయ్యమని ప్రోత్సహించే వాళ్ళే లేరు
ఎవరో ఒకరు నడిచి చూపిస్తేనే కదా కొత్త దారులు ఏర్పడేది
ఇంకొకరి చెప్పుల్లో కాళ్ళు పెడితే నడక వేగం తగ్గదా మరి!

సమూహాల స్వరాలకు మద్దతివ్వమనే వాళ్లే కానీ
కొత్త గొంతులు వినిపించమని ముందుకు తోసే వాళ్లే లేరు
ఎవరో ఒకరు గళం విప్పితేనే కదా కొత్త స్వరాలు వినబడేది
వేరొకరి గొంతుతో స్వరం కలిపితే మాట మరగున పడదా మరి!

నిన్నటి చరిత్రను పదే పదే మననం చేయమనే వాళ్లే కానీ
చరిత్రను తిరిగి రాయమని వెన్నుతట్టే వాళ్ళే లేరు
ఎవరో ఒకరు రాస్తేనే కదా సరికొత్త చరిత్రకు నాంది పలికేది
వేరొకరి గతం మన భవిష్యత్తుకు అడ్డుపడదా మరి!

మందలో ఒకడిగా మిగిలి పొమ్మని భయపెట్టే వారే కానీ
ఒంటరివైనా నీదైనా బతుకు బతకమని ధైర్యం చెప్పే వాళ్లే లేరు
వేరొకరి చొక్కాలో దూరి దిష్టిబొమ్మలా మిగిలే కన్నా
నాదైన నగ్నదేహంతో సమాజం ముందు నిలబడటమే మంచిదిమరి!

## సాహిత్య ప్రస్థానం అక్టోబరు 2021 పురస్కారాలు

**ఇప్పుడు నిశ్శబ్దం కాదు**
కవితకు రూ.500
కవి : డాక్టర్ కటుకోర్ముల రమేష్

**వాట్సాప్ 2.0**
కథకు రూ.500
రచయిత: జి.ఉమామహేశ్వర్

■■■

*కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*


*కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

***- ఎడిటర్***

**పరిచయం**




# ఆకాశ విహారం అనుభూతినిచ్చే కవిత్వం


**- శాంతికృష్ణ ఎం.ఎస్**
95022 36670


**ఆ**కాశం ఎప్పుడూ ఓ అద్భుతమే! ప్రతి ఉదయం రంగులు చల్లుకున్న బాల్యమంత అమాయకంగా కనిపిస్తూ మధ్యాహ్నం బడిలో మాష్టారంత కఠినంగా దండిస్తుంటుంది. సందెపొద్దుకు అమ్మ లాలిలా మారి... చీకటి వేళ అమ్మ ఊయలవుతుంది. ఇలా ఒకటే ఆకాశం ఘడియ ఘడియకు తన ఉనికిని మార్చుకుంటూ మనతో అనుబంధం కలిగి ఉంటుంది.

'ఒకే ఒక ఆకాశం' అంటూ వచన కవిత్వ సంపుటితో మన ముందుకు వస్తున్న కవి నెల్లూరు వాస్తవ్యులు సాహితీసేవకులు, ప్రముఖ కవి గుర్రాల రమణయ్య గారు. వీరు విశ్రాంత ప్రభుత్వోద్యోగి. గతంలో 'మాట ముల్లు' అనే వచన కవితా సంపుటిని ప్రచురించారు. ఇది వీరి రెండవ సంపుటి. ఇందులో 70 కవితలు ఉన్నాయి. అన్నీ అనేక సామాజిక అంశాలపై రచించిన కవితలు.

**ఒక్కసారైనా ఊరెళ్ళి రావాలి**
**చివరిసారిగానైనా**
**అమ్మ సమాధి చూసి రావాలి**
**బక్క చిక్కి ఉన్నా**
**ఎండి మండి పోతున్నా**
**మా ఊరి ఏటి ఒడ్డున కూచొని**
**మురళినూదుకోవాలి**
**దేవాలయం కోనేరులో**
**రాత్రి స్నానమాడే చుక్కల్ని చంద్రుణ్ణి**
**మరొక్కసారి దర్శించుకోవాలి**
**ఒక్కసారైనా చివరిసారిగానైనా!"**

**– 'చిగురించని కొమ్మ'** కవితలో...

బాల్యాన్ని ఆత్మీయంగా స్పృశిస్తున్న కవిత ఇది. ఒక్కసారైనా ఊరెళ్ళి రావాలని, అమ్మ సమాధిని చూడాలని, మిత్రుల ఇండ్ల అరుగులపై గిజిగాడి గూళ్ళు పెట్టాలని, తాను నడిచిన వీధిలో తన అడుగుల జాడలు వెతకాలని, తొలినాటి ప్రేమ గురుతులు, దేవాలయం కోనేట్లో చంద్రుణ్ణి దర్శించటం... ఇలా ఎన్నో మధురమైన జ్ఞాపకాలను మళ్ళీ తడిమి చూడాలని ఉందని ఆర్తిగా రాసుకున్న ఈ కవితను చదువుతున్నంత సేపు పాఠకులు కూడా అది తమ మనసులోని కోరికే అన్నంతగా మమేకమై పోతారు.

**"ఆకాశంలో రంగు రంగుల కలలు ఆవిష్కరిస్తూ**
**ప్రపంచ యాత్రకు పయనమౌతారు మీరు**
**రెక్కలతో శూన్యాన్ని ఈదుతూ**
**సముద్ర కెరటాలతో పోటీ పడుతుంటారు" – 'పక్షి వసంతం'** కవితలో...

ఆకాశంలో అద్భుత విన్యాసం చేసే పక్షుల గురించి ఈ కవితలో ఆవిష్కరించిన తీరు వసంతంలా వర్ణమయంగా ఉంది.

**"ఒక్కడుండాలి**
**కీకారణ్యంలో వేసిన కేకని**
**ప్రతిధ్వనించి మోసుకెళ్ళే వాడు**
**ఒక్కడైనా చాలు**
**ప్రపంచపు చివరి అంచుపై నిలిచి**
**పదుగురినీ సమీకరించి**

**సమైక్యతా సమరనాదాన్ని అందివ్వగలవాడు"**

**– 'ఒక్కడే'** కవితలో....

వీరి కలం మృదువైన భావాలనే కాదు ఘాటుగా కూడా స్పందించ గలదని మనకు ఈ కవిత నిరూపిస్తుంది. సమాజాన్ని చైతన్య పరచే ధీరుడైన నాయకుడు తప్పకుండా ఒక్కడు ఉ ండాలని... అతను వేల అబద్ధాలను నడి రోడ్డుపై నిలదీసేవాడై ఉండాలని కవి ఈ కవితలో బలంగా కోరుకుంటున్నారు.

**"అమ్మ చిత్రం గీస్తూ దేవుడు కూడా**
**ఆమె పెదాలపై సూర్యోదయం**
**చిత్రించడం మరచిపోయాడు మరి"**

**– 'అమ్మ చిత్రం'** కవితలో.

బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపాలని అమ్మ నవ్వునే కాదు ఎన్నింటినో త్యాగం చేస్తుంది కదా...

**"ఇక్కడ చిరునవ్వులకు**
**మతాలు కులాలు అంటురోగాలుండవు**
**అందరిదీ పరిమళ భాష**
**అందరిదీ ఒకటే శ్వాస"**

**– బడి గంట'** కవితలో...

పసివాళ్ళ మనసులెపుడూ పరిమళ భరితమే. అందుకే బడి ఎపుడూ ఓ ఉద్యానవనంలా ఉంటుంది.

**"ఎన్ని భాషల పదాలో**
**చేరి సముద్ర మైన భాష**
**నా తెలుగు భాష**
**కోటి కోటి సూర్యుళ్ళొచ్చినా**
**సముద్రం ఆవిరి కానట్లు**
**కోటి కోటి తరాలు మారినా**
**నా భాషకు మరుగు ఉండదు"** అంటారు **'శాశ్వతం'** కవితలో.

భాష పైన ఈ కవికి ఎంత గౌరవమో అంత నమ్మకం కూడా ఉంది. ఎన్ని తరాలు మారినా చెరిగిపోనిది మన తెలుగు భాషంటూ ఆత్మ విశ్వాసంతో ఈ కవితను రాసుకున్నారు.

**"నీ హస్తవాసి సంజీవని**
**నీ హృదయం కల్పవృక్షం" – 'చలి మంట'** కవితలో...
వైద్య వృత్తిలో ఉన్న తన కుమారుడిని గురించి ప్రేమతో గొప్పగా రాసుకున్న కవిత ఇది.

ఇలా అన్ని కవితలు ప్రత్యేకంగా ఉన్నాయి. ఇంకా ఇలా ఎన్నో పుస్తకాలను ప్రచురించాలని కోరుకుంటూ.... 'ఒకే ఒక ఆకాశం' రచయిత గుర్రాల రమణయ్య గారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు. వారిని 99639 21943 నెంబరుపై పలకరించొచ్చు.

■

# మట్టిదాహం

**ఒ**కానొక నిద్రలేని రాత్రి
కళ్లు పొడుచుకున్నా కానరాని చీకట్లో
కళ్లల్లో దీపాలు పెట్టుకొని రేపటిని వెతుకుతున్నాను
రేపంటే ఆశ కదా!
రేపంటే బతుకు కదా!
రేపటిలోకంలోంచి నడిచొచ్చే
కాగడాకు ఎదురెళుతున్నాను

◆ ◆ ◆

ఎవరూ రాని ఏకాంత ప్రదేశాన
అడవిని పులుముకున్న నేలపై
నగ్నదేహంతో పచ్చదనాన్ని చిలకరిస్తున్న
నాగలిని నాలోకి లాక్కుంటున్నాను
నాగలంటే మట్టిని చీల్చి
అన్నంముద్దను దోసిలిలో పెట్టేది కదా!
నిరంతరం దేహంనుంచి స్రవిస్తోన్న
చెమటతో తడిచిన చేతుల్లోంచి
మేడి జారిపోతోంది
ఎలపట దాపట ఎడ్లు చెరోవైపు లాగుతున్నాయి
సరళరేఖలా సాగాల్సిన కొంద్ర
వంకర టింకరగా సాగుతోంది

◆ ◆ ◆

గొంతులార్చుకుపోతున్న గ్రీష్మకాలాన
నదీతీరపు ఇసుక పొరల్లో
గుక్కెడు నీళ్లకోసం చెలమలు తవ్వుకుంటున్నాను
దాహపు తీరాల్లో ఊరుతున్న కన్నీటిని
బొట్లు బొట్లుగా ఒడిసిపడుతున్నాను
వట్టిపోయి నా పక్కనే నడుస్తున్న నది
తనను ముంచెత్తే ప్రవాహాల కోసం ఎదురుచూస్తోంది

◆ ◆ ◆

మట్టిలో పండిన అన్నం
మట్టిలో పడి పనికిరానిదవుతోంది
భూమిపొరల్లోనో పైనో ప్రవహించే నీరు
నన్ను నిలువునా ఎండబెట్టి
మట్టిదాహమూ తీర్చడం లేదు!

**- బండ్ల మాధవరావు**
**88976 23332**

కథ



# కాంతిరేఖ

- సిహెచ్.సి.ఎస్.శర్మ

097909 25909

"రేయ్!.. మామయ్యకు జ్వరంగా ఉందట... భవానీ అత్తయ్య చెప్పింది. వెళ్లి చూడరా" అంది మాధవి. ఆ మాటకు దిగ్గున లేచిన రాజా... దండెం మీది బనీను వేసుకొని పక్క ఇంటివైపు పరుగు తీశాడు. ఇంటి వాకిట భవాని ఎదురుపడింది. ఆమె ముఖం విచారకరంగా ఉంది.

రాజా నేరుగా మామయ్య గదిలోకి వెళ్లాడు.

కళ్లుమూసుకొని ఒళ్లు తెలియని స్థితిలో ఉన్నాడు రంగారావు. రాజా అతని శరీరాన్ని తాకి చూశాడు. జ్వరం చాలా తీవ్రంగా ఉంది. వీధిలోకి పరుగెత్తి.. ఐదు నిమిషాల్లో ఆటోలో వచ్చాడు. తమ్ముడు గోవిందును పిలిచి ఇద్దరూ చెరొక వైపు చేరి రంగారావును ఆటోలో కూర్చోబెట్టారు.

'గోవిందూ!.. నేను మామయ్యను హాస్పిటల్‌కి తీసుకొని వెళతాను. నువ్వు అమ్మనడిగి డబ్బు తీసుకొని త్వరగా వచ్చేయ్..." అని తమ్ముడికి చెప్పి "అత్తా! నీవు వచ్చి ఆటోలో కూర్చో" అన్నాడు రాజా .

భవాని ఇంటి తలుపులు దగ్గరకు లాగి వచ్చి ఆటోలో భర్త పక్కన కూర్చొని ఆయనను పట్టుకుంది. ఆటో హాస్పిటల్‌వైపు బయలు దేరింది.

'అత్తయ్యా!.. భయపడకు... చలికాలం కదా! ఫ్లూ జ్వరాలు అక్కడక్కడా ఉన్నాయి. అదే ఇది. రెండు రోజుల్లో తగ్గిపోతుంది." అనునయగా చెప్పాడు రాజా.

పావుగంటలో ఆటో హాస్పటల్‌కి చేరింది. రంగారావును స్ట్రెచర్‌పై పడుకోబెట్టి హాస్పిటల్‌లోకి తీసుకువెళ్లారు సిబ్బంది. వారి వెనుకే రాజా వెళ్లాడు. ఈలోగా గోవిందు తల్లి దగ్గర డబ్బు తీసుకొని వచ్చి అన్న చేతికి ఇచ్చాడు.

'గోవిందా.. నీకు కాలేజీకి టైమ్ అవుతోంది వెళ్లు. మామయ్యను నేను చూసుకుంటాను. అమ్మతో చెప్పు.. మామయ్యకు ఏం పర్వాలేదని' తమ్ముడికి చెప్పి పంపించాడు.

భవానీని విజిటర్స్ మెయిటింగు ప్లేస్‌లో కూర్చోబెట్టి... రాజా లోనికి వెళ్లాడు. రంగారావును మంచంపైకి చేర్చారు. సెలైన్ ఎక్కిస్తున్నారు.

"డాక్టర్... వీరి పరిస్థితి" అనడిగాడు, రాజా.

"ఓ గంటలలో మేల్కొంటారు. ఏం భయంలేదు. రెండు రోజుల తర్వాత ఇంటికి తీసుకొని వెళ్లవచ్చు" చెప్పారు డాక్టర్.

"మా అత్తయ్య వచ్చి ఇక్కడ వీరికి కేర్‌టేకర్‌గా ఉండొచ్చా సార్!"

"ఆ ఉండొచ్చు... పంపండి"

"థ్యాంక్యూ సర్" అని డాక్టర్‌కి చెప్పి, తర్వాత బయటకొచ్చి "అత్తయ్యా!.. మామయ్యకు ఏం ఫర్వాలేదని డాక్టరు చెప్పారు. మీరు ఇంటికి వెళ్లి స్నానం చేసి టిఫిన్ తిని రండి. మీరు వచ్చాక మావయ్య దగ్గర ఉండొచ్చు. అంతవరకు నేను చూసుకుంటాను" అని చెప్పి... అత్తయ్యను ఆస్పత్రి బయట ఆటో ఎక్కించాడు. తరువాత తల్లి మాధవికి ఫోన్ చేశాడు. "ఏం భయం లేదు అమ్మా... అంతా బాగానే ఉంది" అని చెప్పాడు.

◆ ◆ ◆

మూడో రోజు సాయంత్రం రంగారావుని డిశ్చార్జి చేశారు. గడిచిన మూడు రోజులు అత్తయ్య భవానికి సాయంగా అన్నా తమ్ముడు హాస్పిటల్ డ్యూటీ నిర్వహించారు. వారికి కావలసిన ఆహారాన్ని మాధవి సిద్ధం చేసింది. ఇంత జరుగుతున్నా ఎదుట ఉన్న రాజాతో రంగారావు ఒక్క మాటైనా మాట్లాడలేదు.

"రాజా.. ఎంతో సాయం చేశాడు. వాడిని కాస్త పలకరించండి" మెల్లగా చెప్పింది భవాని. ఆ మాటలు రాజాకు వినిపించాయి. రంగారావు భార్యను ఒక క్షణం తీక్షణంగా చూసి తలను పక్కకు తిప్పుకున్నాడు. ఎప్పుడూ తన గది నుంచి బయటకు రాని చందన అప్పుడే బయటికొచ్చి.. రాజాను చూసి మళ్లీ తన గదిలోకి వెళ్లిపోయింది. రాజా గమనించాడు. తరువాత మౌనంగా తమ ఇంటికి వెళ్లాడు.

♦ ♦ ♦

రాజా తండ్రి ధర్మరాజు. పెద్దగా చదువుకోలేదు. చిన్న చిన్న కాంట్రాక్టు పనులు, వ్యవసాయం చేస్తాడు. రంగారావు క్షణం తీరిక లేని రాజకీయ నాయకుడు. పేరుప్రతిష్టలు, డబ్బు బాగానే సంపాదించాడు. ధర్మరాజు సోదరి భవానిని రంగారావు వివాహం చేసుకున్నాక అతడికి బాగా కలిసి వచ్చిందంటారు. ఆమెతో పెళ్లయ్యాకనే రంగారావుకు కోర్టులో పదీ పదిహేనేళ్లుగా నలుగుతున్న ఆస్తి వ్యాజ్యం అనుకూలంగా వచ్చింది. అప్పట్నుంచి రంగారావు తరహా కూడా మారిపోయింది.

భవాని ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

మా అమ్మే పుట్టిందని రంగారావు మురిసిపోయాడు.

అప్పటికే ధర్మరాజుకు ఇద్దరు మగపిల్లలు. రాజాకు ఆరేళ్లు.. గోవిందుకు రెండేళ్లు. మేనకోడలికి పద్ధతి ప్రకారం చేయవలసిన మర్యాదలను బారసాల రోజున ధర్మరాజు జరిపించాడు. ఆ శిశువుకు చందన అని నామకరణం చేశారు. చందన పెరిగేకొద్దీ రంగారావు పేరు ప్రఖ్యాతులు బాగా పెరిగాయి. ఆ రెండు కుటుంబాల మధ్య గల బాంధవ్యం క్రమంగా నామమాత్రం అయిపోయింది. కాలచక్రంలో పదహారేళ్లు గడిచిపోయాయి.

రాజా అగ్రి కల్చరల్ బిఎస్సీ పూర్తి చేసి .. ఊళ్లోనే యోగా స్కూలు నడుపుతూ .. తండ్రికి విశ్రాంతి ఇచ్చి.. వ్యవసాయ దారుడయ్యాడు. చందన బిఎస్సీ పాసైంది. రంగారావు చందనకు వివాహ ప్రయత్నాలు ప్రారంభించారు. అన్నా, వదిన, మేనల్లుడు రాజా అంటే ప్రేమాభిమానాలు గల భవాని మనసులో రాజాకు చందనకు వివాహం చేయాలనే సంకల్పం ఉండేది. కానీ. రంగారావు ఆలోచన వేరు.

ఒకరోజు భార్యతో చెప్పాడు.

'రెండు నెలల్లో అమ్మాయి పెళ్లి జరిపించాలి'

'ఎవరితోనండీ' అంది ఆమె.

'మన అంతస్తుకు తగిన వారితో.. ఎమ్మెల్యే పార్థసారధి కొడుకు ముకుందరావుతో'' అన్నాడు కాస్త గర్వంగా.

'అమ్మాయి ఇష్టాయిష్టాలతో అవసరం లేదా' అనడిగింది.

'నా కూతురికి ఎలాంటి సంబంధం తగునో నాకు తెలియదా?' అన్నాడు.

'లేదు... అమ్మాయి ఇష్టాన్ని అడిగి తెలుసుకోవడం మన ధర్మం' అంది.

'అయితే పిలు' అన్నాడు. భవాని కూతురిని పిలిచింది.

రంగారావు కూతురిని దగ్గరకు తీసుకొని.. 'అమ్మా.. ఇంతవరకూ నువ్వు కోరినవన్నీ సమకూర్చాను. ఇప్పుడు నీకు వివాహం చేయాలి అనుకుంటున్నాం. మన అంతస్తుకు తగిన, నీకు అన్ని విధాలా జోడీగా .. నీ పక్కన నిలబడగలిగిన యువకుడిని నీకు కాబోయే భర్తగా నిర్ణయించాను. ఇదిగో.. ఈ ఫొటో చూడు" చందన చేతికి ఫొటో అందించాడు. అందుకున్న ఫొటోను చూడకుండానే టీపాయ్‌పై బోర్లించింది చందన.

'నాన్నా' అంది తల పైకెత్తి.

ఏమిటన్నట్టు చూశాడు రంగారావు.

'వివాహం నాకు సంబంధించినది. అందులో నా ఇష్టానికి ప్రాముఖ్యం ఉండాలి. నాకు మామయ్య కొడుకు రాజశేఖర్ అంటే ఇష్టం. తనతో నాకు పెళ్లి జరిపించండి' అంది.

రంగారావు ముఖం రంగులు మారింది. 'ఏమిటి?' అంటూ కళ్లు పెద్దవి చేశాడు.

'రాజా బావనే చేసుకుంటాను' అని కుర్చీ నుంచి లేచింది చందన.

'నీ నిర్ణయం తప్పు. నేను ఒప్పుకోను. మనసు మార్చుకో. నేను నా మిత్రుడు పార్థసారధికి మాటిచ్చాను. అతని కొడుకు ఆ ఫొటోలో ఉన్న అబ్బాయి. ముకుందరావుతోనే నీ వివాహం. కాదు అని నన్ను వ్యతిరేకిస్తే నేను, మీ అమ్మ విషం తాగి చస్తాం. మాట తప్పి నేను బతకలేను' అని కోపంగా గది నుంచి బయటకు వెళ్లిపోయాడు రంగారావు.

చందన తల్లిని కావలించుకొని, ఇద్దరూ ఏడ్చారు.

ఆ సంఘటన తరవాత రంగారావు వారం రోజులైనా ఇంటికి రాలేదు. ఎక్కడికి వెళ్లాడో తెలీదు. భవానీ ఏడుస్తూ

జరిగిన అన్నా వదినకు చెప్పి బోరున ఏడ్చింది.

రాజా పార్టీ కార్యాలయానికి వెళ్లి రంగారావును గురించి విచారించగా ... ఎమ్మెల్యే పార్థసారధితో ఢిల్లీ వెళ్లినట్లు తెలిసింది. ఇంటికి వచ్చి విషయం చెప్పాడు. అందరూ స్థిమితపడ్డారు.

♦ ♦ ♦

ఆరోజు ఉదయం కుర్చీలో కూర్చొని కిటికీ గుండా ఇంటి వెనుక వున్న పెరటిలో ఉన్న పూలచెట్లను చూస్తున్నాడు రాజా. చందన మౌనంగా అతడిని గమనిస్తుంది. కొంత సమయం తరువాత.. గొంతు సవరించింది. రాజా తొట్రుపాటుతో వెనుతిరిగి చూశాడు.

'ఎందుకు వచ్చావు' అనడిగాడు.

'రాకూడదా' అంది.

'ఇంట్లో అమ్మా, నాన్న ఎవ్వరూ లేరు'

'కాబట్టే వచ్చాను'

ప్రశ్నార్థకంగా చందన ముఖంలోకి చూశాడు రాజా.

'నేను అడిగిన ప్రశ్నకు జవాబు చెబుతావా బావా!' ముఖంలోకి చూసి అడిగింది.

'నేనంటే నీకు ఇష్టమే కదా?' అడిగింది.

'లేదు చందన' కిటికీ గుండా శూన్యంలోకి చూస్తూ మెల్లగా చెప్పాడు.

'బావా, నువ్వు చెప్పేది నిజమేనా?' బొంగురుపోయిన కంఠంతో అంది.

'నిజమే.. మీ నాన్న మాట విను. అది మనందరికీ మంచిది.' అన్నాడు. ఒక్కక్షణంలో అక్కడినుంచి లేచి, పరుగున తమ ఇంటికి చేరి తన గదిలో మంచంపై వాలిపోయింది.

♦ ♦ ♦

ఈనెలలోనే చందన వివాహం ఎమ్మెల్యే పార్థసారధి కొడుకు ముకుందరావుతో జరిగింది. ఏదో పార్టీ కార్యక్రమానికి వెళ్లివస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ముకుందరావు, తండ్రి పార్థసారధి చనిపోయారు. పెళ్లయిన రెండు నెలలకే రంగారావు ఇంటికి చేరింది చందన. కోడలి దుస్థితికి ధర్మరాజు, మాధవి చాలా బాధపడ్డారు. భవాని ఎంతగానో కుమిలిపోయింది. భర్త రంగారావును నిర్భయంగా నోటికి వచ్చినట్లు విమర్శించేది. రంగారావు పశ్చాత్తాపంతో.. వేదనతో.. కుంచించుకుపోయాడు.

♦ ♦ ♦

హాస్పిటల్ నుంచి వచ్చిన రంగారావును చూడటానికి ధర్మరాజు, మాధవి వచ్చారు. చందనను తలచుకొని 'ఆ పిల్ల ఇంతవరకు నా ముఖం చూడలేదు. ఆ గది నుంచి బయటకి రాలేదు. ఆమె జీవితాన్ని నేను నాశనం చేశాను. మనశ్శాంతి లేకుండా ఫలితాన్ని అనుభవిస్తున్నాను'' అని కన్నీళ్లు పెట్టుకున్నాడు రంగారావు. అతడికి ఊరడింపుగా మాటలు చెప్పి ఓదార్చి... ధర్మరాజు, మాధవి చందన ఉన్న గదిలోకి వెళ్లారు. టేబుల్‌పైన పెట్టిన టిఫిన్ అలానే ఉంది.

వారి అలికిడి విన్న చందన కళ్లు తెరచి చూసింది.

అత్తా మామయ్యలతో పాటు తల్లి భవాని కూడా ఉంది.

"ఇదీ, వదినా... దీని వరస. వేళకు తినదు. మాతో మాట్లాడదు. నిన్న రాజా వాళ్ల మామయ్యను గదిలో దింపి వెళ్లేటప్పుడు గది నుంచి బయటకు వచ్చింది. తరువాత గదిలోకి వెళ్లి తలుపులు మూసుకుంది. ఏమైపోతుందోనని నాకు భయంగా ఉంది." అని కన్నీరు పెట్టుకుంది భవాని.

చందన తల్లి ముఖంలోకి చూసి విచారంగా నవ్వింది. కళ్లలో కన్నీరు.

మాధవి భర్త ధర్మరాజు ముఖంలోకి చూసింది. ఆయన ప్రసన్నంగా చూవాడు. మాధవి చందనను దగ్గరకు తీసుకొని.. కన్నీటిని తుడిచింది.

'వదినా! నా కోడలిని నేను మా ఇంటికి తీసుకొని వెళతాను. శాశ్వతంగా మా దగ్గరే ఉంచుకుంటాం.' అంది.

భవాని ఆశ్చర్యపోయింది.

'అవును చెల్లీ.. రాజా చందనల వివాహం చేద్దాం. నీకు సమ్మతమేగా' అనడిగాడు.

రాజా అప్పుడే వచ్చాడు. చందన ఆశగా అని ముఖంలోకి చూసింది. వీరి మాటలు విని రంగారావు అక్కడికి వచ్చాడు. అందరి ముఖాల్లోకి చూశాడు.

'విన్నారా? చందనని మా వదిన, అన్నయ్య వాళ్లింటికి తీసుకు వెళతారట. నా మేనల్లుడు జీవితాంతం తనకు తోడుగా ఉంటాడట.' భర్త ముఖంలోకి చూస్తూ ఆనందంగా చెప్పింది భవాని.

ఆ మాటకు చందన ముఖంలో కాంతిరేఖ విరిసింది.

అది చూసి, అందరి హృదయాలు తేలిక పడ్డాయి.

■



## గాయం

రాత్రికీ పగటికీ మధ్య లెక్కకట్టలేని సెకన్లముల్లు ఆమె
కాళ్ళకి చక్రాలే తొడుక్కుందో
చేతులవెంట మరికొన్ని చేతుల్ని అతుక్కుందో..
రేపటి ప్రణాళికకో అందరి సావకాశానికో
నిద్రలోనూ పనుల్ని కలగంటుంది
తనని మాత్రమే తాను మరుస్తుంది.
అందరూ ఆమెను విస్మరిస్తారు.
సరిపుచ్చుకోవడం, తనని తాను సర్దుకోవడం తెల్సిన
నవనీత హృదయం ఆమె!

వచనం లేని నిర్వచనాలెన్నో జ్ఞాపకాల చేసంచిలో దాచి
నవ్వుల్లో వెన్నెల్లు కురిపిస్తుంది
చుట్టూ పచ్చటి ఒయాసిస్సుని పోలిన మనుషులుంటారు
తీరా చూస్తే మనసులన్నీ ఎండమావులుగా మిగిలుంటాయి

తాను నీరవగీతం ఆలపిస్తుంది
వినడం తెలియని శ్రోతలు మరింత శూన్యంలోకి విసిరేస్తారు

ఖాళీతనంలోంచి పుట్టుకొచ్చిన విచ్ఛిన్న రాగాల్ని
అనురాగంగా మలచి చేరదీయడం ఆమెకే చెల్లు
వేకువజాము కల, వెన్నెలతీరపు దాహం
రెండూ తాను మరచిపోతుంది
దిగంతాల మీద అస్పష్టపు దృశ్యాలన్నీ
తన కలలతీరపు దరికి చేర్చవు
దేహంమీద గాయం మానుతుంది
హృదిగాయానికి మందుండదు
రెండు కుటుంబాలమధ్య ఏ ఇల్లూ తనదనిపించదు
ఏ బడీ నేర్పని పాఠం కాలం నేర్పాక
తనకు తానుండి తీరాలని ఆమెకు అర్థమవుతుంది
హృదిగాయం నెమ్మదిస్తుంది ...

**- యామినీ దేవి కోడె**

**83094 20900**

## పెనుగులాట

జీవితం రెండు నిర్ణయాల మధ్య
ఊగిసలాడుతూ దిగాలుగా వుంది
సాయంకాలపు పార్కులో
ప్రతి వాడూ రంగుపూసుకుని తూలుతుంటాడు
ఇలా రాస్తున్నప్పుడు
అక్షరం వయ్యారంగా చూస్తుంది
ఏదో అందమైన ముసుగు కౌగలించుకోబోతుంది
అప్పటిదాకా రాసిన కాగితాల మీద
అడ్డంగా ఒక గీత గీస్తాను!
లోపలెక్కడో మూలుగులు
కనుమరుగవ్వడం నాకు మాత్రమే తెలుసు
అందరూ ఆశల్ని తాకట్టు పెట్టేశారు
గడియారం రికామీగా  తిరుగుతూనే ఉంది
ఆశ ఎక్కడో  ఒకచోట
పెనుగులాడుతూ ఉంటుంది!

**- ఏటూరి నాగేంద్రరావు**

**74166 65323**



కవిత

## ఏముంటుంది?

- పద్మావతి రాంభక్త
99663 07777



ఎవరో ఆత్మీయంగా
ఒక పుస్తకం పంపుతారు
పేజీల్లోకి నడక సాగిస్తూ
మైమరచిపోతూ తప్పిపోయేకొద్దీ
నదుల లోతుల్లోకి మునకలేసేకొద్దీ
వాక్యాలలో మనకు మనం
నెమ్మదిగా దొరకడం మొదలవుతుంది

అక్కడక్కడ తారసపడ్డ
మనలను పోలినట్టున్న
బతుకు రంగుల అనుభవాలు
నింగిలో తళుకుల నక్షత్రాల్లా మెరుస్తూ
కాసేపు అక్కడ కట్టిపడేస్తాయి!

వారు పరచిన
సున్నితమైన అనుభూతుల నీడలు
హృదయపు గదులలో నిద్రిస్తున్న
పాత గీతాలను తట్టి లేపుతాయి
మధురమైన సంగీతాన్ని శృతి చేస్తాయి

కొన్ని దు:ఖపుటలు తడిమినపుడు
హృదయం హఠాత్తుగా
నల్లమబ్బులు కమ్ముకున్న చీకటి ఆకాశమై
దిగులు సెగలతో ఉక్కిరిబిక్కిరవుతుంది
తిరగేస్తున్న పేజీపేజీలో
ఎన్నో ప్రపంచాలు పురి విప్పుతాయి

ఒక్కొక్కరిది ఒకొక్క రకం ఉక్కపోత
పోలికలు లేనితనం
ఎన్నో వింత గాథలను వినిపిస్తూ ఉంటుంది

అయినా
ఎవరి పుస్తకంలోనైనా ఏముంటుంది?
క్షణక్షణానికీ
మలుపులు మలుపులు తిరుగుతూ
ప్రవహించే జీవితం తప్ప ..!

## వెలేసావు ఎందుకు ?


నీ కళ్ళలో నలుపంటే ఎంత అలుసు
పుట్టుక నలుపుదనమే
చావు నలుపే.. అయినా కూడా
దూరంగా పారిపోతుంటావు

మట్టి రంగు ఏదంటే ఏమి చెప్తావు
ఎదిగిన క్రమాన్ని ఎట్లా మరుస్తాం
తెలుపుదనం వెనుక దాగిన
కుత్సిత బుద్ధిని నిలదీసినందుకు
తరాల నుంచి వెక్కిరింపే
ఈ దేశానికి అంటుకున్న ప్రేమ రంగు నలుపే

నలుపు ఆత్మగౌరవానికి ప్రతీక
నలుపే కదాని చిన్న చూపు చూడకు
అదే నలుపులో కలిపేస్తారు!

- పుష్యమీ సాగర్
79970 72896

## సమీక్ష






# మధ్య తరగతి ప్రతిబింబాలే 'అద్దంలో బొమ్మలు'


- చందలూరి నారాయణ రావు

9704437247


**కం**టి ముందు దృశ్యాలను మనసులో చిత్రిక పట్టి అక్షరాకృతి ఇచ్చే ఓ గొప్ప ప్రక్రియల్లో కథ ఒకటి. ఇంటి నుంచి ప్రపంచం దాకా, రక్త సంబంధాలు నుంచి మానవ సంబంధాలు దాకా ఒక మనిషి అనుభవంలో ఎదురైన ప్రతి సంఘటనలో ప్రతి పాత్రను లోతుగా పరిశీలించి 13 కథలతో ప్రముఖ రచయిత జంధ్యాల రఘుబాబు రాసిన పుస్తకమే 'అద్దంలో బొమ్మలు'. ఈ పుస్తకాన్ని రాయలసీమ కథాసింగం సింగమనేని నారాయణ గారికి అంకితమివ్వడం సముచితమైన గౌరవం.

అనుభవంలోకి వచ్చిన ఏ అంశాన్ని వదలక ఓ ఉత్తమ ఆలోచను జోడించి సమస్యను ఎత్తి చూపడంలో ఒక కొత్త దారిని వెతుక్కొని, అదే స్థాయిలో ఓ ఉన్నతమైన ముగింపుతో కథకు పరిపుష్టం చేయడం ద్వారా పాఠకుల్లో ఓ ఆసక్తి, ఓ ఆలోచన రేకెత్తించి సఫలీకృతులయ్యారు రఘుబాబు. ప్రతి కథలో సన్నివేశాలను గమనిస్తే చాలా సరళంగా ఉండటంతో పాటు కొన్ని చోట్ల ఆయన కలం కవిత్వ పరిమళం కూడా గుప్పించింది. ఏ కథను చదివినా ఓ పరిషత్ నాటికను చూసిన భావన ఉంటుంది. సహజ ధోరణిలో చక్కని మాటలతో సాగే కథనం ఓ ఆదర్శానికి దారితీస్తూ సమాజానికి ఓ ఆలోచనను అందించింది. ఈ అద్దంలో కనిపించే ప్రతి బమ్మ లాంటి కథా అంతర్గతంగా విలువైన అంశాన్ని కలిగి ఉండటం విశేషం. నూరుశాతం సమాజానికి, కుటుంబానికి, వ్యక్తుల ప్రవృత్తులకు అద్దం పట్టి, పాఠకులను చదివించి ఓ భావనను హృదయానికి హత్తుకునేలా చేయడం ద్వారా జంధ్యాల వారు అనుకున్న లక్ష్యాన్ని పొందారు. ఈ పుస్తకంలోని ఒక్కో కథను పరిశీలిస్తూ ముందుకు నడిచేకొద్దీ ఈ విషయం సుస్పష్టమవుతుంది.

తెలుగు భాషను ప్రాణంగా భావించే ఓ ఆంగ్లోపాధ్యాయుడు వందల మందికి చక్కని విద్యాబోధనతో పాటు మాతృభాషలో ఉన్నత విలువలను బోధిస్తూ, తన జీవితంలో పాటిస్తూ సాగించిన జీవితం గొప్పది. చివరకు ఉద్యోగ విరమణ నాటికి తను సంపాదించిన డబ్బుకు పిల్లలను వారసులుగా, తన జీవితకాలంలో కొన్న పుస్తకాలను గొప్ప ఆస్తిగా భావించి తన వద్ద చదువుకున్న పిల్లలనే వాటికి వారసులుగా భావించి, తను ఎప్పుడైనా ఆ పుస్తకాలను చదవాలని ఉంటే నేనే మీ వద్దకు ఓ వస్తాను అని చెప్పే రాఘవాచారి పాత్ర ద్వారా సమాజానికి ఓ ఆదర్శాన్ని పరిచయం చేశారు. 'నవ వారసత్వం' అనే ఈ కథ ఇచ్చిన సందేశం గొప్పది. యూరోపియన్ దేశాల్లో ఏదైనా ఒక కార్యక్రమం జరిగితే ఓ పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడం, పుస్తకాల పేర్లను ఇండ్లకు, వీధులకు, బస్, రైలు స్టేషన్లకు పెట్టుకొని పుస్తకాన్ని నెత్తిన పెట్టుకొని మోయడం జరుగుతుంది. ఈ కథ ఉద్దేశం కూడా అదే. పుస్తకాలను ఆస్తిగా భావించి వాటిని వారసులను ప్రకటించడం ఓ గొప్ప భావన.

మరో కథలో తన ముద్దుల కూతురు 'సునిధి' పుట్టిన రోజుకి ఓ గొప్ప కానుక ఇవ్వాలని భావించిన మహేష్ చేసిన ఆలోచన ఇతివృత్తం. ఇందులో తాను ఇచ్చే పుట్టినరోజు కానుక ప్రత్యక్షంగా తన కూతురుతో పాటు పరోక్షంగా ఎంతోమందికి ఉపయోగపడాలి అన్న మహేష్ ఆలోచన ఓ కొత్తదనంతో పాటు గొప్పదనం. తన కూతురుకు తెలియకుండానే శ్రీశైలంలో ఓ వృద్ధాశ్రమానికి తీసుకెళ్లడం, తన కూతురికి పరిచయం

చేసి పుట్టినరోజు దీవెనలందుకోవడం అంతటా జరిగేదే. కానీ అక్కడకు వచ్చేముందే ఆశ్రమంలో 'ఈశ్వర్' అనే వ్యక్తితో మాట్లాడిన తరువాత 'ఒక వ్యక్తికి తోడులా, నీడలా నిలచి మనసును సంతోషపెట్టేది పుస్తకమని, అది వారికి ఇష్టమైన అంశమని తెలిసి, ముందుగా ఎవరికి చెప్పకుండా అందరికీ ఒక్కో పుస్తకాన్ని తన కూతురు చేత ఇప్పించడం జరుగుతుంది. ఇదే తన కూతురుకు ఇచ్చే కానుకగా పేర్కొనడం విశేషం. ప్రత్యక్షంగా నాన్న ఇచ్చిన గొప్ప కానుకకు మురిసిన సునిధి తన జీవితంలోనూ ఇలాంటి మంచి పనులు చేయడానికి ఇది ఓ పునాది అని చెప్పవచ్చు.

మధ్య తరగతి గృహిణి కోరికలకు, లేనిపోని హంగులకు గురయ్యే మనసు ఫలితంగా అనుభవించే ఆర్థిక బాధలకు అద్దం పట్టే కథ 'కారు దిద్దిన కాపురం'. ఇందులో సుధ జీవితంలో కారు కొనాలన్న బలమైన కోరికను వెలిబుచ్చే క్రమంలో ఇబ్బంది పడ్డ భర్త మనోజ్ తన ఫ్రెండ్ సునీల్ కారును తెచ్చి సొంతగా కారు కొన్నట్లు నమ్మించి కేవలం పది రోజుల్లో కారు వల్ల ఓ మధ్య తరగతికి వచ్చే కష్టాలను ఆమె గమనించి మనకు కారు అనవసరం అని తెలియడం సుధ ఆలోచనా శక్తికి ఉదాహరణ. ఈ కథలో ఏ వస్తువైన అవసరమైన స్థితిలో మనిషి ఆలోచించాలి. లేనిచో సుధలా ప్రతివారు బాధపడవలిసివస్తుంది అన్నది సందేశం.

ఓ తల్లి కష్టాన్ని చూస్తూ కూడా మిత్రులతో కలిసి మందు పార్టీ చేసుకోవాలని కోరికతో అమ్మ ప్రేమను అడ్డు పెట్టుకొని సాధించిన డబ్బుతో సరదా తీర్చుకొని ఆనందపడ్డ సురేష్ ఆ డబ్బు ఎలా వచ్చిందో ఆలోచించే మనసును కప్పేసిన వయసు ... చాలామంది జీవితాల్లో ఎదురయ్యే పరిస్థితే. బిడ్డ కోసం భరించే కష్టం వెనుక అమ్మ ప్రేమంటే, తల్లి కష్టాన్ని ఆలోచించనీయని తప్పిదాలు వెనుక వయసు తప్పిదం ఉంది. చివరకు వీధిలో మందు సీసాలను ఎరుకుని, వాటిని అమ్మిన వచ్చిన డబ్బుతో తన మందు సరదా తీరిందని తెలుసుకుని ఆ పసిప్రాణం గాయమైన మనసులో 'అమ్మా ఇక జీవితంలో ఎప్పుడూ తాగను' అన్న మాటకి నెలల చిన్న పిల్లవాడిలా కనిపించిన కొడుకుని మురిసిపోవడంతో ముగిసిన ఈ కథ 'అమాయకమైన పసి మనసుకు పుట్టే కోరికలు తీవ్రమైన తప్పులుగా మారకముందే రాకేష్ లాంటి మిత్రులు కళ్ళు తెరిపించడం బాగుంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఇంటిపనులతో సతమతమవుతూ, అందరికీ సేవచేస్తూ బాధ్యతను పలు రూపాల్లో జీవితమంతా మోసే అరుణకు ఓ కొత్త వస్తువును తెచ్చి సంతోషపెట్టాలని చూసిన భర్త శేఖరును మెచ్చుకుంటూనే, ఇంట్లో ఏ వస్తువు తెచ్చినా ఆ వస్తువు వెనుక దాగిన రహస్యం అది ఇచ్చే సౌకర్యం త్వరితగతిన లభించడం ఎవరికి? ఇందులో వంటగదిలోకి కొత్తగా వచ్చిన నాలుగు బర్నర్ స్టవ్ వల్ల ఇల్లాలకి సుఖం అని అనిపించినా, దాని ముసుగులో దాగిన సుఖాలన్నీ ఎవరివి? అన్న ఓ ప్రశ్నతో ముగిసిన కథతో ఓ సెటైర్ లాంటి సందేశం ఉంది.

జీవితంలో చిన్న విషయాలుగా కనిపించేవి కొన్నిసార్లు చాలా ప్రభావితం చేస్తాయి. నీవు ఎప్పుడు వాటర్ బాటిల్ కొన్నా ఉపయోగం పూర్తి ఆయాక దాన్ని నలిపి పారవేయాలి అన్న తమ్ముడు అవినాష్ చెప్పిన మాటలు గుర్తున్న సరే పాటించని అక్క అనన్య పొరపాటుకు రాఖీ కట్టడానికి తన వద్దకు వస్తున్న తమ్ముడు అవినాష్ బండి టైర్ కింద పడి స్కిడ్ అవడం, ఐనా ప్రమాదం నుంచి బయటపడటం, తరువాత తను చేసిన పొరపాటుకు బాధపడటం జరుగుతుంది. ఈ కథలో సమాజంలో ఒక చదువుకున్న వారు సహితం పాటించని క్రమశిక్షణ ఫలితంగా అది మరొకరి జీవితానికి ఎలా శాపమౌతుందో 'రాఖీ' కథ చెబుతుంది. చిన్న చిన్న ఆనందాలను వెతుకుతూ, అనుబంధాలను ఆరాధించే గంగాధర్ ఓ ఆటోవాడు 'వలి'తో పరిచయం మానవ విలువలకు అద్దంపట్టే బంధంగా, రోజూ ఎంతో మందిని గమ్యస్థానాలకు చేర్చే ఆటో తమ తమ జీవితాల్లో ఓ గొప్ప అనుభవం కావడం అనివార్యం. వలి భార్య కాలు జారి పడ్డప్పుడు గంగాధర్ చేసిన సాయం సంఘంలో మనిషి ధర్మాన్ని చెబుతుంది. మానవ సంబంధాల గొప్పతనాన్ని చాటుతూ, జీవితంలో ప్రతి వ్యక్తి మరొకరికి ఓ మానసిక ఆస్తిగా పేర్కొనవచ్చు. ఒకనాడు ఈ ఆటోలో తిరిగిన వారే విమానంలో తిరిగే స్థాయికి ఎదగడం, ఎదిగాక ఉనికికి గుర్తుకు తెచ్చే సందర్భంలో ఏ బంధువు కాని వలి, ఆటో ఓ కమ్మని జ్ఞాపకాలుగా మిగులుతాయి. వారి మనసులో 'వలికి దువా' అని రాయబడి ఉంటాయి.

తరగతి గదిలో మాస్టర్ ఇచ్చే ఓ మంచి మాట, ప్రోత్సాహకాలు పిల్లలను చాలా ప్రభావితం చేస్తాయి. హుస్సేను మాస్టర్ తను పెట్టిన పోటీ లాంటి పరీక్ష మార్కులకు ఇచ్చిన ఓ బహుమతి 'నోట్ బుక్'. అందరిలో అందుకున్న అనుభవం పిల్లవాడి మదిలో శాశ్వతంగా మిగిలిన గొప్ప సంఘటన. దీని మూలంగానే మాస్టర్ గారి చలువతో జీవితంలో ఓ టీచర్గా తన గురువు గారితో కలసి పనిచేసే సందర్భం రావడం ఓ గొప్ప భావన. నిజానికి నాడు నోట్బుక్ పొందిన సందర్భంలో 'ప్రపంచంలో ఉన్న కొండ శిఖరాలన్నింటిని ఎక్కిన ఆ ఆనందమే జీవితంలో ఉన్నత శిఖరాన్ని అధిరోహించడానికి కారణం కావడం జరిగింది. ఈ 'నోట్బుక్' కథలో హుస్సేన్, మహేష్ లాంటి పాత్రల ద్వారా ఓ ఉపాధ్యాయుడు, టీచర్

ఎలాంటి అనుబంధాన్ని కలిగి ఉండాలో తెలిపారు.

'నేను పోరాడవల్సింది ఒక్కొకరితో కాదు; మొత్తం సమాజంతో. నా పుట్టుక నన్ను జీవితాంతం వేటాడుతుందని తెలుసుకున్న నాకు ఇక దానితో సహజీవనం చేయడమొక్కటే మార్గమని అర్థమైంది' అని శుభాకర్ అనే ఓ దళితుడు ఆవేదనే 'టు లేట్' కథ. ఎన్నో ఏళ్లుగా ఈ స్వతంత్ర దేశంలో ఎప్పుడూ పచ్చగా ఉండే ఓ చేదు నిజం కులం. ఓ అద్దె ఇంటికోసం ఎంత తిరిగినా ఇల్లు దొరకనీయని కులాన్ని ఏమి చేయాలి? అన్న ప్రశ్న శుభాకర్ జీవితంలో చేదు నిజాలతో, గాయాలతో సంఘంలో ఈ దుస్థితితో సహజీవనం చేయాలన్న పరిస్థితి నిజంగా ఈ దేశానికి ఓ పెద్ద లోపమే. అప్పటివరకు రాఘవశర్మ గారింట్లో అద్దెకు ఉంటున్న శుభాకర్ పిల్లల చదువుల కోసం ఇల్లు మారవలసి వచ్చింది. ఇంత కాలం ఎంతో అభిమానంతో కలిసిమెలిసి ఉన్న రాఘవశర్మ గారి స్నేహం ఆదర్శం. కానీ ఇప్పుడు అలాంటి ఇల్లు, అలాంటి మనసుల కోసం ఎంత వెదికినా దొరకని స్థితికి జీవితంలో ఓ అనుభవమే. ఇలా కొనసాగే కథలో శుభాకర్‌కు వచ్చిన ఓ గొప్ప ఆలోచన ఈ సమాజానికి ఓ చెంపదెబ్బ. ఎంత తిరిగినా తన కులాన్ని చూసి ఇల్లు ఇవ్వడం లేదని, తాను ఇంతకు ముందు ఏ ఇంట్లో ఉన్నానో, వారితో ఎలా మెలిగామో అన్ని వివరాలను ఓ ఉత్తరంగా రాసి అందరికి పంచడం ఓ చిత్రమైన ఆలోచన. ఈ కథలో ఈ ప్రక్రియ ద్వారా తన నిజాయితీతో పాటు, కులం పేరుతో మనుషుల మధ్య దూరాన్ని ప్రశ్నించిన ఆ ఉత్తరం వెంకట్రావు లాంటి వ్యక్తిని 'ఇల్లు ఏ కులం వారికైనా అద్దెకివ్వబడును' అని టు లెట్ బోర్డ్ పెట్టించడం ఓ మార్పుకు ఉదాహరణ. ఈ మార్పులే దేశానికి అత్యసరమైన చికిత్సలు. ఇవే రేపటి రోజులు పట్ల నమ్మకాన్ని పెంచే శుభప్రదాలు. రాఘవశర్మ, వెంకట్రావు లాంటి వ్యక్తులే ఈ సంఘానికి అవసరమైన విలువైన ఆస్తులు. ఊరిలో ఎవరు చనిపోయినా, తన సొంత 'మనిషి' పోయినట్లుగా ఏడ్చే ఈశ్వర్ తన జీవితంలో జరిగిన విషాదాన్ని ఎక్కడా చూసినా ఓ బంధువుగా బాధపడటం అందరికి సొంత మనిషిలా భావించే కథ 'అందరి బంధువు'.

ప్రతివారిలో ఏదో ఓ మూల మానవత్వం ఉండొచ్చు. నిత్యం అత్తగారిని నిందించే కోడలు దీవెన మధ్యలో జరిగిన సంభాషణ బంధాన్ని గౌరవిస్తూ సాగే క్రమంలో ఒకరునొకరు అర్థం చేసుకుని ముందుకు నడిచి పుట్టినిల్లులా సంతోషాన్ని సాధించుకునే కధనమే 'పుట్టినిల్లు'. జీవితంలో దురదృష్టవశాత్తూ బంధాన్ని కోల్పోయి సంఘంలో పిచ్చివాడిగా ఉన్న నారాయణ క్షేమాన్ను ఇంటికి తెచ్చి సాధారణంగా కనిపిస్తూ అసాధారణమైన రచనాశక్తిని, ప్రతిభను గుర్తించి, అతని రచనలను పత్రికలకు పంపుతూ వాడిలో ఉన్న భావనాశక్తి వృథా కాకుండా ఎన్నో రచనలు చేయించి అందరికి ఓ రచయితను పరిచయం చేయడమే 'ఇదీ ఒక కథే'.

ఇలా విభిన్నమైన మనసులను పాత్రలుగా తీసుకుని పలు రకాలుగా కథను అల్లుతూ, చక్కని ఆదర్శం, సందేశాన్ని ఇచ్చేవే 'అద్దంలో బొమ్మలు'. సాధారణ పాఠకులకు సహితం సులభంగా అర్థమయ్యే విధంగా సమస్యను ఎత్తిచూపి, ఆలోచన కలిగేలా చక్కని కథలను అందించారు జంధ్యాల రఘుబాబు. ప్రతి కథలో కుటుంబాన్ని, విలువలను, బంధాలని గౌరవంగా భావిస్తూ, దీనిపరంగా ముందుగా వ్యక్తిలో మార్పు రావాలని, తరువాత సంఘంలో మార్పు రావాలని ప్రతి కథకు ప్రాణం పోశారు. ఏ కథను తాకిన అందులో కుటుంబ నేపధ్యం మనసును అంటి, మనిషి నైజాలను అద్దం పడుతుంది. ముఖ్యంగా ఇప్పుడిప్పుడే రచనలు చేసి కొత్త కలాలకు, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు, కొద్ది నిడివి గల ఓ మంచి కథల పుస్తకం 'అద్దంలో బొమ్మలు'. ఆ బొమ్మలతో పాటు కొన్ని కథలలో తమని తాము చూసుకునే సందర్భాలు ఎదురవ్వడం ఈ కథల ప్రత్యేకత. రఘుబాబు మరెన్నో రచనలను వినూత్న రీతిలో తేవాలని ఆశిద్దాం. ■

## జన రంజక కవి

## ప్రతిభా పురస్కారాలు 2021

స్పష్టంగా, సూటిగా, నిరాడంబరంగా, భావ యుక్తంగా, శక్తివంతంగా ఉండే జన సంక్షేమ కవిత్వం రాసే కవులు 'జన రంజక కవి ప్రతిభా పురస్కారాల కోసం' కవితల సంపుటాలు పంపించవలసినదిగా కోరుతున్నాం. వచన కవితలు/ పద్యాలు/ గేయాలు/ లఘు కవితలు/ బాలగేయాల సంపుటాలు... ఒక పుస్తకం పంపితే చాలు. 2017 నుంచి 2021 వరకు ప్రచురించిన పుస్తకాలు పంపవచ్చు. ఎంపికైన పుస్తకాల కవులకు ఒక్కొక్కరికి రూ.2000ల నగదు, శాలువా, జ్ఞాపికతో 'రావి రంగారావు సాహిత్య పీఠం' పక్షాన గుంటూరులో జరిగే సభలో ప్రముఖుల సమక్షంలో సత్కరించటం జరుగుతుంది. 2021 డిసెంబరు 31లోగా పుస్తకాలు పంపించవలసిన చిరునామా : న్రా ప్రభావతి, 101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్ 5వ లైన్ తూర్పు, గోరంట్ల, గుంటూరు- 522034, ఫోను : 9247581825.

కవిత

# ప్రాంగణం

రంగు రంగుల సీతాకోక చిలుకలు
తుమ్మెదల ఝుంకారం ఆ ప్రాంగణం కళ కళ
చేతుల్లో పుస్తకాలు
వస్తుందో రాదో తెలియని బస్సు కోసం
కళ్ళు అలసిపోకుండా కనుచూపు మేర దుర్భిణీలా
మధ్య మధ్య అవే కళ్ళు తన చుట్టూ తాను తిరుగుతూ
మరెవ్వరి కోసమో వెతుకుతుంటాయి!

అల్లుకున్న జడలు
కొత్త కథలు అల్లుకునే చోటు
జేబులో పెన్ను సిరా కక్కి
గుండెలకి తాకిన మధురిమలు వస్తువుగా
కవితలకు అంకురార్పణ జరిగే చోటు

ఎక్కే మెట్టు
ఎక్కాలో వద్దో
ఇంకాసేపు ఆ చూపుల్లో బందీ కావాలనే ఆలోచనలు
అదే ఆఖరి బస్సు హెచ్చరిక మైకులో
వెనుకనే ఎక్కే వారి ఎక్కు ఎక్కు మాటలు చెవిలో
కదిలిన కాళ్ళు కిటికీ వార సీట్
బస్సు బయల్దేరే దాకా అయినా
ఆ చూపుల్లో ఒదిగి పోవాలని ...

రద్దీ బస్సులో సామాజిక జీవనం
హెచ్చు తగ్గుల కొలమానం లేదు
సమతుల్యత గుబాళింపు బస్సు నిండా
చెమట చుక్కలతో పూల పరిమళంతో
బస్సు బయల్దేరే ...
వీడుతున్న చూపులు
ఆరాధనా భావం కళ్ళల్లో సుడులు తిరుగుతూ
కను కొలను దాటకుండా
అలుగు పోస్తే అలుసౌతామని
రేపింకా మిగిలి వుందని ఆశతో

సంధ్య కుంగే వేళకి బస్సు ఊరు చేరింది
దేహం దిగింది
మనసు అక్కడే జారవిడిచి



మళ్ళీ రేపు అదే బస్సెక్కి
ఈ దేహాన్ని ఆ మనసుని కలుపుకుని
అచ్చోట సీతాకోక చిలుకల్లా రెక్కలిప్పి ఎగురాలని
లోలోన ఆశల మొలకలు
మౌనంగా అడుగులు ఇంటి వైపు

సంధ్య ఉదయించింది
ఉత్తేజితమైన దేహం
మనసు కోసం పరుగులు
ఆలస్యమవుతున్న బస్సు
అదుపు తప్పుతున్న దేహం
గుండె సవ్వడి మారుతుంది
మనసేమౌతుందని బెంగ!

వచ్చింది బస్సు చేరింది గమ్యం
దేహం, మనసూ కలిసాయి
కొత్త పుంతలు తొక్కుతుంటే
ప్రాంగణం సాక్షిగా నిలబడింది!

- గిరిప్రసాద్ చెలమల్లు
94933 88201



# తిరుపతి నాయుడు

- కృపాకర్ పోతుల
80084 16660

**తి**రపతి నాయుడు గుర్తొచ్చాడు ఉదయాన్నే. ఆదివారం సెలవు కదా. అందుకే మామూలుగా లేచే టైముకంటే కాస్త ఆలస్యంగా లేచాను. నెమ్మదిగా బయటికొచ్చి చూస్తే ఆకాశమంతా మబ్బుపట్టి చిన్నగా చినుకులు పడుతున్నాయి. ''వాతావరణశాఖ వారు హెచ్చరించినట్టు తుపాను మొదలైందన్నమాట. చస్తున్నాం వెధవ తుపానుల్తో. రెండు నెలల్లో ఇది మూడో తుపాను. ఏ ఒరిస్సావేపో కొట్టేసుంటే ఎంత బాగుండేది" అని విసుగ్గా అనుకున్నానో లేదో ...

"తప్పు సారూ. ఏమాలోచిస్తున్నారు. కురుస్తున్నది వర్షం కాదు సారూ. అమృతం" అంటూ చిన్న పిల్లాడిలా వర్షంలో గంతులేసిన తిరపతి నాయుడు గుర్తొచ్చాడు.

ఏనాటి తిరపతి నాయుడు! ఎన్నాళ్ళ కిందటి అనంతపురంజిల్లా! పన్నెండేళ్ళా పదిహేనేళ్ళా? పదిహేను. నేను అనంతపురం వదిలేసి పదిహేను సంవత్సరాలైపోయింది. పాతికేళ్ల వయసులో, బేంకులో రెండేళ్ళ ప్రొబేషన్ పూర్తి చేసుకొని, పర్మనెంట్ పోస్టింగ్ మీద వెళ్ళానా ఊరు. అనంతపురం జిల్లాలో ఒకమూల విసిరేసినట్టున్న కుగ్రామం అది.

అక్కడికి వెళ్ళేవరకూ తెలియలేదు అదెంత చిన్న ఊరో. ఒక హైస్కూలూ, మా బేంకూ తప్ప వేరే ప్రభుత్వ కార్యాలయం ఏదీ, కనీసం ప్రైమరీ హెల్త్ సెంటరైనా లేనంత, చిన్న ఊరు. బేంకింగ్ వ్యాపారానికి ఏమాత్రం అవకాశం లేని గ్రామం. బుద్ధున్న బేంకేదీ అలాంటి ఊర్లో బ్రాంచి పెట్టదు. అలాంటిది మా బేంకు అక్కడే ఎందుకు బ్రాంచి తెరిచిందో అర్థం కాలేదు నాకు. 'ఫూల్స్ రష్ ఇన్ వేర్ ఏంజెల్స్ ఫియర్ టు ట్రెడ్' అంటే ఇదే అనుకున్నాను వేళాకోళంగా. ఆ బ్రాంచిలో రైతులకి రుణాలిచ్చే 'ఫీల్డాఫీసర్' ఉద్యోగం నాది.

అక్కడ పరిచయమయ్యాడు తిరపతి నాయుడు నాకు. ఆర్థిక కారణాల వల్ల ఇంటర్మీడియెట్ మధ్యలోనే మానేసి వ్యవసాయంలోకి దిగాల్సివచ్చింది అతనికి. మూడెకరాల భూస్వామి. అందులో చెనిక్కాయ పండిస్తాడు. కాడెద్దూ, ఒక గేదె ఉన్నాయి. గేదెపాలు సొసైటీకి పోస్తాడు. వాటి ఆదాయంతో గుట్టుగా బతుకుబండి లాగిస్తాడు. ఊరి గొడవలకూ, రాజకీయాలకూ ఆమడదూరంలో ఉండే సౌమ్యమైన మనిషి. తనూ, తన వ్యవసాయం తప్ప వేరే విషయాలు అసలు పట్టించుకోని నైజం. అతనిలోని ఆ లక్షణాలు నాకు నచ్చడంవల్ల అతను అప్పుడప్పుడు నా రూముకి వచ్చి కొంచెంసేపు కూర్చున్నా ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు నేను.

ఒకరోజు... ఈరోజులాగే ఆదివారం. మబ్బుగా ఉండి గంటకో ఘడియకో వర్షం పడేలా ఉంది. ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాను. అంతలో వచ్చాడు తిరపతి నాయుడు. వచ్చికూర్చుని ఒకపావు గంటసేపు ఏదో పిచ్చాపాటీ మాట్లాడాడో లేదో... ఒక్కసారిగా దడదడమంటూ,

కుంభవృష్టిగా వర్షం కురవడం మొదలైంది. అంతే, అంతవరకూ వినయంగా, కుర్చీలో ఒదిగి కూర్చొని కబుర్లు చెప్తున్న తిరపతి నాయుడు ఒక్క ఉదుటున లేచి నిలబడి, కుండపోతగా కురుస్తున్న వర్షంలోకి ఒక్క దూకు దూకి, గంతులెయ్యడం మొదలుబెట్టాడు పూనకం వచ్చినవాడిలా. అలా నాట్యం చేస్తూ చేస్తూ మధ్యలో తలపైకెత్తి, తన్మయత్వంతో కళ్ళు మూసుకొని, నాలుక బయటకి చాచి, దాని మీద కురుస్తున్న వర్షపు చినుకుల్ని, అవి తియ్యటి తేనెచుక్కలన్నంత తన్మయత్వంతో చప్పరిస్తున్నాడు... పరవశంగా. కురుస్తున్నంతసేపూ వర్షంలోనే చిన్నకుర్రాడిలా చిందులేసేడు తిరపతి నాయుడు.

"ఏంటి నాయుడూ, చిన్న కుర్రాడిలా వర్షంలో ఆ గంతులేంటి. వర్షం చినుకులవి. వాటిని తేనె చప్పరించినంత ఆనందంగా చప్పరించడమేంటి" అని తమాషాగా అంటే ...

"అవి మీ సర్కారు జిల్లాల వాళ్ళకి వట్టి వర్షపు చినుకుల్లాగే కనబడతాయి సార్. కాని, మా రాయలసీమోళ్లకి మాత్రం అది అమృతపు జల్లు. మూడు కాలాల్లోనూ దండిగా నీళ్ళుండే మీకెలా తెలుస్తుంది సార్ నీటి విలువ, చుక్కనీటి కోసం వెంపర్లాడెపోయే మాకు తెలిసినట్టు. వర్షం మాకొక అపురూపమైన వరం సార్. మీలా ఎప్పుడు కావాలంటే అప్పుడు మాకు దొరకదది. అందుకే ఈ ఆనందం" అని సమాధానం ఇచ్చాడు హాయిగా నవ్వుతూ.

ఆరోజు తరవాత వారం రోజులు కనబడలేదు తిరపతి నాయుడు. కనిపించాక 'ఏంటి సంగతి' అని అడిగితే 'మొన్న మంచివర్షం కురిసింది కదా సార్. చెనిక్కాయ వేసేం. ఆ పనులతో అస్సలు ఖాళీలేదు. అందుకే కలవలేకపోయాను' అన్నాడు. "మొన్న పడిన వర్షం సార్, మంచి టైంలో పడింది సార్. ఇలాగే రెండుమూడు వర్షాలు కురిస్తే చాలు సార్. చెనిక్కాయ బ్రహ్మాండంగా పండేస్తాది. బంగారం లాంటి భూవులు సార్ మావి. నీటి సదుపాయం లేకగాని, ఉంటేనా బంగారం పండించేవాళ్ళం మేము కూడా" అన్నాడు కళ్ళు అరమోడ్చి శూన్యంలోకి చూస్తూ. తరవాత నాలుగు రోజులకి బేంకుకు వచ్చి అప్పు శాంక్షన్ చెయ్యించుకొని వెళ్ళేడు.

లోను శాంక్షన్లతో క్షణం కూడా తీరికలేకపోవడంతో, కొన్ని వారాల పాటు తిరపతి నాయుడు గురించి ఆలోచించడానికే సమయం లేకపోయింది నాకు. ఒకరోజు సాయంత్రం బేంకు బయట కనిపించాడు. ఆందోళనగా ఉన్నాడు. "ఏంటి నాయుడూ, విశేషాలు. చాలా రోజులైంది కనిపించి. ఎలాగుంది వ్యవసాయం" అని ప్రశ్నించిన నాకు సమాధానం ఏమీ చెప్పకుండా, ఆకాశం వేపు చూపులు సారించి, చేతులు రెండూ పైకెత్తి, కనిపించని దేవుడికో నమస్కారం పెట్టాడు. తరవాత నావేపు నిర్లిప్తంగా చూస్తూ "ఏముంది సార్. మా అనంత పురానికి ఎప్పుడూ ఉండే దరిద్రమే. వర్షాలు ఎత్తిపెట్టేసాయి. చూసేరు కదా... ఆరోజు పడిన వానే. తరవాత మళ్ళీ పడలేదు. ఇంకొక వారం రోజుల్లో, కనీసం ఒక మాదిరి వర్షమైనా పడకపోతే, పంట మొత్తం ఎండిపోతాది సార్. ఏంచెయ్యాలో బోధ పడట్లేదు" అన్నాడు ఆందోళనగా.

"పోయిన ఏడు కూడా చెనిక్కాయ పీకే టైంకి వర్షం పడలేదు సార్. దానితో పంట సరిగ్గా పీకలేకపోవడంతో దిగుబడి బాగా తగ్గిపోయింది. ఇప్పటి పరిస్థితి చూస్తుంటే పోయినసారి వచ్చినంత దిగుబడి కూడా వచ్చేటట్టు కనబడటంలేదు సార్" అన్నాడు దిగులుగా.

"భయపడకు నాయుడూ. ఇంకా వారం రోజులు టైం ఉంది కదా. ఈలోపులో పడుతుందిలే" అని ధైర్యం చెప్పాను తిరపతి నాయుడుకి.

"అదే సార్, ఆ ఆశే... ఈరోజు కాకపోతే రేపు, రేపు కాకపోతే వచ్చేవారం, ఈ సంవత్సరం కాకపోతే వచ్చే ఏడు. ఎప్పటికన్నా వర్షం పడకపోతుందా అన్న ఆశ. అదే సార్ మమ్మల్ని చావకుండా బతికించేది" అన్నాడు బాధగా.

"నాకు తెలియక అడుగుతున్నాను నాయుడూ, పెద్దపెద్ద రాజకీయ నాయకులు ఇంతమంది ఉన్న ప్రాంతం కదా మీ రాయలసీమ. ముఖ్యమంత్రుల్లో చాలామంది మీ సీమవారే కదా. అయినా ఈనీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం ఆలోచించకుండా ఎందుకలా వదిలేసారు?" అడిగాను నేను.

"ఏమో సార్. ఆ రాజకీయాలేవీ నాకు సరిగ్గా తెలీదు గాని మా నాన్ననేవాడు ఆయన చిన్నప్పట్నుంటీ వింటున్నాడట మా సీమకి నీళ్ళు తీసుకొస్తామని రాజకీయ నాయకులు చెప్తున్న మాటలు. మా నాన్నెల్లిపోయాడు. నేనొచ్చేను. నీళ్ళు మాత్రం రాలేదు. నేనుండగా ఒస్తాయన్న నమ్మకం కూడా లేదు సార్" అన్నాడు నిరాశగా.

చూస్తుండగానే రోజులూ వారాలూ గడిచిపోయాయి. చినుకు మాత్రం రాలలేదు. అప్పటికే అక్కడి పరిస్థితులూ, రైతులు శతాబ్దాల తరబడి అనుభవిస్తున్న ఇక్కట్లూ ఆకళింపు చేసుకొని, వారికి నేను చేయగలిగిన ప్రతి సాయం చేసితీరాలనే నిర్ణయానికి వచ్చానేమో, నాకు కూడా తిరపతి నాయుడులాగే, గంటకో అరగంటకో తల పైకెత్తి, ఎక్కడైనా చిన్న మబ్బుతునక కనడుతుందేమోనని ఆకాశంలో ఆశగా వెతుక్కోవడం అలవాటైపోయింది.

వృత్తి నిర్వహణలో రైతులతో కలసి, వాళ్ళ పొలాల తనిఖీకి కూడా వెళ్ళాల్సి రావడంతో, ఆ ప్రాంతంలో నీటిఎద్దడి ఎంత భయంకరంగా ఉంటుందో నా కళ్ళతో నేను స్వయంగా

చూడాల్సి వచ్చేది. చుక్కనీరు లేక, ఎండకి మాడిమసైపోతున్న వేరుశెనగ పంటా, గిడసబారిపోయి నేలరాలిపోతున్న చీనీకాయలూ, బొప్పాయి కాయలూ, ఇవి మాత్రమే కాక, రైతుల గుండెల్లో గూడుకట్టుకున్న ఆవేదనా, గడ్డకట్టుకుపోయిన కన్నీరూ, భవిష్యత్తు గురించి ఆందోళనా ప్రత్యక్షంగా చూడాల్సిరావడం తప్పేది కాదు. ఇన్స్పెక్షన్‌కి వెళ్ళొచ్చినరోజు ముద్ద గొంతు దిగేది కాదు, కంటిమీద కునుకుండేది కాదు.

పోనీ, రైతులకి బోరు బావులు వేయ్యించుకోవడానికి సాయం చేద్దామంటే, దానికీ అవకాశం లేని పరిస్థితి. 'ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పాతాళమంత లోతున ఉంటాయనీ, ధైర్యం చేసి అంత లోతుకు ఎవరైనా తవ్వుకెళ్ళినా, నీళ్ళు పడే అవకాశం చా...లా స్వల్పం అనీ' భూగర్భజల విభాగం వారే చెప్పడంతో ఆ ఆలోచన కూడా విరమించుకొని, దేవుడి మీదే భారం వేసి, రైతులందరి లాగానే, వర్షం కురిపించమని ఏడుకొండల వాడికి దణ్ణం పెట్టుకోవడం మొదలెట్టాను నేను కూడా.

ఆ సంవత్సరం తిరపతి నాయుడు భయపడినట్టే వర్షాలెత్తిపెట్టేసాయి. పంట సర్వనాశనమైపోయింది. ముందు సంవత్సరం వచ్చినపాటి పంట కూడా రైతుల చేతికి రాలేదు. జిల్లా మొత్తాన్ని ప్రభుత్వం కరవుప్రాంతంగా ప్రకటించింది. దానితో, గుడ్డిలోమెల్లలా, క్రాప్ ఇన్స్యూరెన్స్ డబ్బులు రావడంతో రైతులు తీసుకున్న అప్పులు తిరిగి వెంటనే కట్టాల్సిన అవసరం రాలేదు వారికి. అంతేకాకుండా, పెట్టుబడులకి కొత్త ఋణాలు కూడా మంజూరు చేసాం.

తిరపతి నాయుడు మళ్ళీ అప్పు తీసుకెళ్ళేడు బేంకు నుండి. ఆ ఏడు కూడా ముందటి ఏడు లాగానే, అదునుకు ఒక పెద్ద వర్షం కురిస్తే, చెనిక్కాయ జల్లేడు. జల్లి... ఆకాశంవేపు చూస్తూ కూర్చున్నాడు. అయితే ఈసారి రెండో వర్షం కూడా సమయానికే కురవడంతో రైతులందరి మొహాల్లోనూ ఆశలు చిగురించాయి. పంట చేతికొస్తుందనే నమ్మకం కలిగింది. తిరపతి నాయుడు అయితే అందరికంటే ఎక్కువ ఆనందంగా ఉన్నాడు.

"ఇంకో రెండు వానలు ఇలా పడితే చాలు సార్. చెనిక్కాయ పండేస్తాది. చెరువు కూడా నిండిపోతాది. ఆ తరవాత ఇంకో రెండేళ్ళు వర్షం పడకపోయినా బతికిపోతాం" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"ఎంత అల్ప సంతోషులు పాపం" అనుకున్నాను మనసులో. నా చిన్నప్పుడు నాన్న పనిచేసిన స్వర్గసీమలాంటి కోనసీమ గుర్తొచ్చింది. ఇలాంటి పరిస్థితులు కనీసం కలలో కూడా ఊహించనంత అదృష్టవంతులు అక్కడి ప్రజలు.

"ఒకే రాష్ట్రం. రెండు వేరు వేరు ప్రాంతాలు. ఎంత వ్యత్యాసం రెండింటి మధ్యా. అక్కడి ప్రజలు చేసుకున్న పుణ్యం 'కాటన్ దొర'. అందులో ఎవరికీ సందేహానికి తావే లేదు. కాని, ఈ రాయలసీమ ప్రజలు చేసుకున్న పాపం ఏంటో, వీరికి ఎవరు పెట్టిన శాపమో ఇది, ఎవరైనా కాస్త చెప్తే బాగుండును" అనుకునేవాడ్ని బాధగా.

రెండు వర్షాలు ధాటిగా కురిపించిన వరుణుడు మూడో దాని దగ్గరకు వచ్చేసరికి మొహం చాటేసాడు. దాని పుణ్యాన, ఎకరాల కొద్దీ పంట, రాలని చినుకులకోసం అంగలార్చి అంగలార్చి, ఎండిపోయి చచ్చిపోయింది. పంట మాటసరే, పశువులు తినడానికి మేత కూడా దక్కలేదెవరికీ.

"వచ్చే ఏటికి జల్లడానికి విత్తనాలు కూడా లేవు సార్. గవర్నమెంటు వాళ్ళు సప్లై చేస్తే జల్లుతాం. లేకపోతే లేదు. అయితే వాళ్ళిచ్చే విత్తనాలు ఎలా ఉంటాయో తెలుసుగా మీకు. సగానికి పైగా సచ్చువీ, పుచ్చువీ ఉంటాయి. మొలిచి చావవు సార్" అన్నాడు తిరపతి నాయుడు.

వరసగా రెండేళ్ళు పంటలు పోయాయేమో తాగడానికి నీళ్ళుగాని, తినడానికి సంకటి గాని లేదు అక్కది రైతులకి. వలసపోవడం తప్ప వేరే మార్గం ఉన్నట్టు నాకైతే కనబడలేదు. ఒక బేంకు ఆఫీసరుగా నేను అంతకంటే ఏం చెయ్యగలనో కూడా అర్థం కావట్లేదు నాకు. అదే మాట మా మేనేజరుతో అంటే ...

"మనం చెయ్యగలిగినదంతా సిన్సియర్‌గా చేసేంకదయ్యా. అంతకంటే ఇంకేం చెయ్యగలం చెప్పు. ఒక మాట చెప్పనా? బేంకు మనకి అప్పజెప్పిన బాధ్యతల్ని నిజాయితీగా చేసితీరాలి గాని, ఉద్యోగాన్ని మరీ అంత సీరియస్‌గా తీసుకోకూడదయ్యా. మైండూ బాడీ రెండూ పాడవుతాయి. లవ్ యువర్ జాబ్, నథింగ్ రాంగ్ ఇన్ ఇట్ బట్ నెవర్ లవ్ ఇట్ మోర్ దేన్ యువర్ గర్ల్ ఫ్రెండ్. కుర్రాడివి. ఎక్కడో విశాఖపట్నం నుంచి వచ్చావు. ఇలాంటి భయంకరమైన కరువు కాటకాలు ఎప్పుడూ ఎక్కడా చూసుండవు. అందుకే ఇలా గింజుకుపోతున్నావు. మేమిక్కడే పుట్టిపెరిగిన వాళ్ళం. చిన్నప్పట్నుండీ ఇవన్నీ చూసినవాళ్ళం. అలవాటైపోయింది మాకు" అన్నాడాయన తేలికగా.

నేనక్కడికి వెళ్ళి రెండేళ్ళు పూర్తయ్యాయి. బేంకు నిబంధనల ప్రకారం రెండేళ్ళ తరవాత ట్రాన్స్ఫర్‌కి రిక్వెస్ట్ పెట్టుకోవచ్చు. కళ్ళముందు కరాళ నృత్యం చేస్తున్న కరువు కాటకాల్ని నిస్సహాయంగా చూస్తూ, మనశ్శాంతి లేకుండా అక్కడే పడుండడం కంటే వెళ్ళిపోవడమే మంచిది అనే నిర్ణయానికి వచ్చాను. కొద్దిపాటి ప్రయత్నంతోనే అక్కడనుంచి బదిలీ చెయ్యించుకోవడంలో సఫలీకృతుడ్నయ్యాను.

రిలీవై వెళ్ళిపోతున్నరోజు... నిజం చెప్పాలంటే, నేనా ఊరి నుంచి పలాయనం చిత్తగిస్తున్న రోజు... తిరపతి నాయుడు బేంకుకి వచ్చి కలిసాడు నన్ను. నా రెండు చేతులూ పట్టుకొని ... "మనస్ఫూర్తిగా మా మంచి కోరుకున్న దేవుడులాంటి ఆఫీసరు సార్ మీరు. ఇంతవరకూ మీలాంటి అధికారి ఎవరూ ఈ బేంకుకి రాలేదు. మీరే మొట్టమొదటివారు. ఇప్పుడు మీరు కూడా వెళ్ళిపోతున్నారు. ఒకటి మాత్రం నిజం మీ స్థానంలో ఎవరొచ్చినా మీలా మాత్రం ఉండరు సార్. మిమ్మల్ని నేనేకాదు మా ఊరి రైతులెవ్వరూ కూడా ఎప్పుడూ మరచిపోలేరు సార్" అన్నాడు గద్గదమైన గొంతుతో.

♦ ♦ ♦

ఆ ఊరు వదిలి వచ్చేసిన మూడేళ్ళకి ఏదో పనిమీద బెంగుళూరు వెళ్ళాల్సి వచ్చింది. వెళ్ళిన పని పూర్తైపోయాక కాస్త టైం దొరకడంతో, అక్కడే ఉంటున్న చిన్నప్పటి స్నేహితుడ్ని కలుద్దామని వాడి అపార్ట్మెంటుకు వెళ్ళాను ఎడ్రస్ వెతుక్కుంటూ. నేను బయలుదేరేటప్పటికి చిన్నగా వర్షం కురుస్తోంది. కేబ్ దిగి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ సెల్లార్లో ప్రవేశించాను. రుమాలుతో మొహం తుడుచుకుంటూ, నెమ్మదిగా తలఎత్తి చూసిన నాకు... రెండుచేతులూ జోడించి నాముందే నిలబడి ఉన్న తిరపతి నాయుడ్ని చూసి చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది. చిరుగుల చొక్కా, మాసినగెడ్డం, కళ్ళలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్న దైన్యం, వాటికింద నల్లటివలయాలూ... పుష్కరకాలం వయసు పైబడినవాడిలా, దీనంగా, జాలిగా ఉన్నాడు.

"నాయుడూ... నువ్వేంటి ఇక్కడ" అన్నాను ఆనందంగా అతని భుజాల చుట్టూ చేతులు వేస్తూ.

"ఇక్కడే వాచ్మేన్గా చేస్తున్నాను సార్" అన్నాడు పెద్ద పాపమేదో చేస్తూ అడ్డంగా దొరికిపోయిన వాడిలా, నేలచూపులు చూస్తూ.

"వాచ్మేనా. నువ్వా. ఇక్కడా" అన్నాను ఆశ్చర్యంగా. "మరి ఊరిలో వ్యవసాయం...." ప్రశ్న పూర్తిచెయ్యలేకపోయాను.

"ఇంకెక్కడి వ్యవసాయం సార్. మీరు వెళ్ళిపోయిన తరవాత వరసగా రెండేళ్ళు వర్షాలు ఎత్తిబెట్టేసాయి. మా తిండి మాట సరే, కనీసం గొడ్లకి మేత కూడా పెట్టలేకపోయాక, ఇంక వ్యవసాయం ఏం చెయ్యగలను సార్. అందుకే భూమి బీడు పెట్టేసి, ఎండిపోయిన బర్రెగొడ్డునీ, దుక్కిటెడ్లనీ కసాయోడికి అమ్మేసి, ఈ ఊరొచ్చేసాం" అన్నాడు పొట్ట చేత్తో తడుముకుంటూ.


"అయ్యో అలా ఎందుకు చేసేవు నాయుడూ. పంట పోతే క్రాప్ ఇన్స్యూరెన్స్ రాలేదా? మళ్ళీ లోను తీసుకొని చెనిక్కాయ వెయ్యలేకపోయావా?" ప్రశ్న నా నోటిలో నుంచి బయట పడ్డాకగాని తట్టలేదు నేనడిగినది ఎంత తెలివితక్కువ ప్రశ్నో!

"రెండేళ్ళు మాతోనే ఉండి, మా బతుకులు కళ్ళారా చూసి కూడా ఇదేం ప్రశ్న సార్" అన్నట్టు వింతగా చూసాడు నావేపు.

"మీకు తెలియని కతా సార్ మా కథ. మా జిల్లా రైతులకి కావలసినది పంట పెట్టడానికి లోనూ, అది మంటగలిసిపోతే దానికి ఇన్సూరెన్సూ కాదు సార్. పంట పండించుకోవడానికి నాలుగు చుక్కల నీరు... అంతే. అదే మాకు కావలసినది. అయితే అదేం దురదృష్టమోగాని, నీరు తప్ప మిగిలినవన్నీ ఇస్తామంటారు మాకు. ఏం చేసుకుంటాం సార్ వాటితో. అప్పు తీసుకుంటాం. విత్తనాలు కొనుక్కొచ్చుకొని జల్లుతాం. ఎరువులు పట్టుకొచ్చుకుంటాం. పొలాలకి వేస్తాం. తరవాత? ఆకాశం వేపు నోరు తెరుచుకొని చూస్తా కూర్చుంటాం.. నాలుగు చినుకుల కోసం. అవి మాత్రం రాలవు సార్. పంటలెండిపోతాయి. ఇదిగో ఇన్సూరెన్సంటారు. ఎలక్షన్లొస్తాయి. అదిగో ఋణమాఫీ అంటారు. మళ్ళీ కొత్త అప్పులంటారు. కాని వాటికంటే ముందు మాకు కావలసింది నాలుగు చుక్కల నీరు అని ఎవడికీ ఎందుకు అర్థం కాదు సార్. దాని గురించి ఒక్కడు కూడా ఎప్పుడూ ఎందుకు సార్ మాట్లాడడు" ఉద్రేకంతో ఊగిపోతున్న తిరుపతి నాయుడ్ని నోరు తెరుచుకొని చూస్తూ శిలాప్రతిమలా నిలబడిపోయాను.

♦ ♦ ♦

మొహంమీద ఈడ్చికొట్టిన వర్షపు జల్లుతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. తుపాను ఉధృతి పెరిగినట్టుంది. వర్షం జోరందుకుంది. గాలివేగం హెచ్చింది. ఉధృతంగా కురుస్తున్న వర్షంవేపూ, సైడు కాలవల్లో వృధాగా కొట్టుకుపోతున్న వర్షపునీటి వైపూ కొన్ని క్షణాలు సాలోచనగా చూసి, భారంగా ఇంటిలోనికి ప్రవేశించాను. నెమ్మదిగా తలుపులూ కిటికీలూ మూసేసి, అవి తెరుచుకోకుండా గట్టిగా గడియలు పెట్టేసాను. ఎందుకంటే... చినుకుల సవ్వడి మధురమైన సంగీతంలా నాకు వినబడడం మానేసి... పదిహేనేళ్ళు దాటిపోయింది మరి! ■



**ఏ ఉద్యమం**
**తాలూకూ**
**ఆదర్శాలనైనా**
**ప్రచారం చేయటానికి**
**కవిత చక్కని సాధనం.**
**- ఆరుద్ర**

కవిత



# ద నైట్ వాచ్‌మేన్

- డా. కటుకోర్ఝ్వల రమేష్
99490 83327

**చీ**కటి దోపిడీలను
చీల్చివేయటానికి
ఓ నల్లని సూరీడులా
దేహాన్ని.. ఆత్మను
నిత్యం రగుల్చుకుంటూ...
కాంతిపుంజమై
ధర్మయుద్ధాన్ని నెరిపిన
అసామాన్య సామాన్యుడతడు
హి ఈజ్ నాటోన్లీ
ద నైట్ వాచ్‌మన్..
బటాల్సో ద గ్రేట్ హ్యుమనిటేరియన్!

చీకటిలో మగ్గుతున్న
నల్ల జాతీయుల విముక్తికోసం
జీవితమంతా
పహరా కాసిన త్యాగ చిహ్నం
జాత్యాహంకార శ్వేతజాతి గోడల్ని
ఇటుకలు ఇటుకలుగా కూల్చిన
ప్రజాతంత్ర సోషలిస్టు ధీరుడు
నాలుగ్గోడల మధ్యే
జాతి చరిత్రను లిఖించిన నాయకుడు
ఒక రివొనియా .. ఒక రాబిన్ దీవి
పోల్స్‌మూర్.. వెరిస్టన్ జైళ్లన్నీ
ఇరవై ఏడేళ్ల యవ్వనాన్ని

బంధించామని విర్రవీగాయి
రాళ్లను పూలుగా మార్చుకోగల నేర్పరీ..
అనంతంగా ప్రవహించే ఆలోచనల్ని
ఏ ఊసలు అడ్డుకుంటాయి చెప్పు..?!


ఆయన ఒంటరి కాదు.. ఓ సమూహం
కటకటాలే కార్యక్షేత్రంగా
కల్లోల ప్రపంచానికి
శాంతి సందేశమిచ్చిన క్రియాశీలి..

బ్రిటన్ లిబియా వివాదాల
విచ్చుకత్తులపై పూలవర్షాన్ని
చిమ్మిన శాంతి బోధి..
జనం గుండెలు 'మండేలా'
విముక్తి గీతాన్ని ఆలపించిన
ఆఫ్రికన్ యోధుడు!

హి ఈజ్ నాటోన్లీ నైట్ వాచ్‌మన్
బటాల్సో.. నోబెల్ శాంతి.. లెనిన్ శాంతి
ద గ్రేట్ 'భారత రత్న
హ్యాట్సాఫ్ నెల్సన్..హ్యాట్సాఫ్

(నెల్సన్ మండేలా స్మృతిలో)

**సజీవ పాత్రలు**




# అవకాశవాదులకు ప్రతిరూపం 'గిరీశం'

- భమిడిపాటి గౌరీశంకర్

**'చిన్నతనంలో బొమ్మలాట నేర్చి ఉండటం చేత లోకమనే రంగంలో చిత్ర కోటి రీతులను ఆటాడే మనుష్యులనే పాత్రముల సొగసును కనిపెట్టడము నాకు అలవాటైని. సొగసులేని మనిషే లేదు. స్నేహము, ప్రేమ అనేవి అనాది అయిన్నీ, ఎప్పటికీ కొత్తగా ఉండే రెండు వెలుగులను నరుని మీద తిప్పికాంచితే వింత, వింత సొగసులు బయలుదేరతవి, అసూయ అనే అంధకారంలో అంతే ఏకనలుదే'**

– తన పాత్ర చిత్రణ గురించి 'గురజాడ' వ్యాఖ్యానం.

గురజాడ మహాకవి తన రచనల ద్వారా సమాజంలో స్త్రీ సమస్యలను తన రచనల ద్వారా బహిర్గతం చేసి, వారిని ప్రశ్నించమని, 'ధ్వని'ంచమని చెప్పిన రచయిత, కవి, నాటకకారుడు. 'కన్యాశుల్కం' నాటక రచన గురజాడకు శాశ్వతమైన కీర్తిని తెచ్చిందనడం అతిశయోక్తి కాదు. ఆయన రచనా చమత్కృతి, పాత్రల చిత్రణ, భాషాపటిమ ఆనాటి సాంఘిక సమాజ చిత్రణలో 'నగ్నత్వం' వంటివి ఆయన రచనలో ప్రయోగాత్మకంగా, జనరంజకంగా చెప్పినా అవి ఈ నాటికి సమాజలో 'రూపం మార్చుకొని' తిష్ట వేసుకొనే ఉన్నాయి అనుకోవటం ఓ ఐరని.

'కన్యాశుల్కం' తొలి ప్రతి 1897లో వచ్చింది. రెండో కూర్పు 1909లో వచ్చింది. ఇందులో మొత్తం 14 పాత్రలు ఉన్నాయి. 'కన్యాశుల్కం' వచ్చి ఒక శతాబ్దానికి పైగానే అయింది. కాని ఇందులోని పాత్రలు తెల్లవారితే నేటికి మనకు కళ్ళముందు కనిపిస్తాయి. దోచుకోబడుతున్నవాళ్ళు, దోచే వారు, వ్యసనరులు, మోసగాళ్ళు, లుబ్ధులూ, ప్రేమంటే పెద్దగా 'ప్రేమ'లేని గిరీశాలు, మధురవాణి వంటి వారు నిత్యం పరిచయమవుతుంటారు. నిత్య జీవితంలో పలకరిస్తుంటారు. ముఖ్యంగా గురజాడ పాత్రలన్నీ 'వాడుక భాష'లో ఎటువంటి ముసుగులు లేకుండా మాట్లాడతాయి. వాడుక భాషను ప్రతిభావంతంగా తన 'కన్యాశుల్కం'లో ఉపయోగించుకొని గురజాడ స్రష్టగా నిలిచారు. ఏ పాత్రను తీసుకొని చూసినా 'ఈ భాషా చాతుర్యం' కనిపిస్తుంది.

పాత్రల సృష్టిలో రచయిత 'తను చూసిన', 'తను అనుభవించిన' వ్యక్తులను అనుకరిస్తూ, అనుసరిస్తూ ఉంటారు. గురజాడ వారు 'కన్యాశుల్కం'లో కూడా తన భావనలకు, ఊహలకు రచనా రూపం కల్పించి తదనుగుణమైన పాత్రలను, వాటి పరిచయ రంగాలను ప్రేక్షకులకు పరిచయం చేస్తారు. షేక్స్పియర్ నాటకాల్లో కథాంశాన్ని కథ ప్రారంభంలోనే 'ధ్వని' మాత్రంగా చెప్పటం జరుగుతుంది. గురజాడ వారు సృష్టించిన 'గిరీశం' కూడా అదే చేస్తాడు. నాటకం అతనితోనే ప్రారంభమవుతుంది. అతనితోనే ముగుస్తుంది. అతను పరిచయం 'బొంకులుదిబ్బ' ప్రాంతం (విజయనగరం). 'బొంకులు' అనగా అబద్ధాలు. గిరీశం చెప్పేవన్నీ అవే కదా. ఒక ప్రాంతాన్ని పరిచయం చేస్తూ తద్వారా 'పాత్ర' వ్యక్తిత్వాన్ని కూడా పరోక్షంగా విప్పి చెప్పడం ఓ గొప్ప సృజన. అతను 'నాయకుడు' కాదు. నాడు, నేడు, రేపు కూడా ఎంతో మంది గిరీశాలు మనకు తారసపడుతుంటారు. ప్రజలను 'వెంకటేశాల'ను చేసి దోచుకుంటారు. 'వెంకటేశం'కు గురువుగా గిరీశం చుట్టలు

కాల్చటం తప్ప మరేమీ నేర్పలేదు. వర్తమానంలో 'గిరీశం' వంటి గురువులు ఎందరెందరో! 'సోషల్ రిఫార్మ్' పేరుతో 'సమాజాన్ని', 'సంస్కరణల'ను తనకనుగుణంగా మార్చుకొని 'గొప్పవారుగా' ఎదుగుతారు.

అమాయకులను(?) తొక్కుకుంటూ పోతారు. 'తొక్కేసి' వెళ్ళిపోతారు. 'డామిట్ కథ అడ్డం తిరిగింది', 'కుప్ప సామయ్యరు మేడ్ డిఫికల్ట్', 'మనవాళ్ళు వట్టి వెధవాలయ్', 'అన్నీ వేదాల్లో వున్నాయిష', 'నాతో మాట్లాడటమే ఓ ఎడ్యుకేషన్', 'అట్నుంచి నరుక్కురమ్మన్నారు', 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' వంటి అవకాశవాద వ్యాఖ్యానాలతో అవాస్తవాలను, అసహజాలను సహితం 'సహజాలు'గా చిత్రించి, నమ్మించే గొప్ప వాక్చాతుర్యం కలిగిన 'గిరీశాలు' వర్తమానంలో కోకొల్లలు. గొప్ప స్కీమ్‌లతో, మానిఫెస్టోలతో ప్రజలను బురిడీ కొట్టించి మాటల కోటలు కట్టి 'నోట్లో'నే బూరెలు ఊరించి, 'చిటికెన వేలు' మీద స్వర్గాలు నిర్మించే నాయకులు, వ్యక్తులు మనల్ని నిత్యం పలకరిస్తారు. మోసం చేస్తుంటారు.

'ఏడు అంకాల' కన్యాశుల్కం నాటకంలో ఆరు అంకాల్లో గిరీశం కనిపిస్తాడు. కాని అతను కథానాయకుడు కాదు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి గారు 'గిరీశం పైకి చూడటానికి వెకిలి పాత్రగా, ఔచిత్యం పాటించని వాడుగా, విలువలు లేని వ్యక్తిగా, జీవితంలో గాంభీర్యాన్ని నవ్వులపాలు చేసేవాడుగా కనిపిస్తాడు. 'కన్యాశుల్కం' నాటి సామాజిక వాస్తవాలను గురజాడ అర్థం చేసుకొన్న తీరును వాటి మీద ఆయన అభిప్రాయాలను ప్రతిఫలిస్తాడు. కనుక గిరీశం పాత్ర సంకీర్ణ పాత్ర అంటారు. 'వర్తమాన గిరీశాలు' నేటి సామాజిక వ్యవస్థకు ప్రతిబింబాలు. సమాజంలో పరిస్థితులకనుగుణంగా కొందరు మారిపోతారు. కాని ఆ పరిస్థితులను తమకనుగుణంగా కొందరు 'అతి తెలివి మేధావులు' మార్చుకుంటారు. వారంతా గిరీశాలే! 'ఒపీనియన్సు అప్పుడప్పుడూ ఛేంజ్ చేస్తూంటూనే కాని పొలిటీషియన్ కానేరడు. నాకు తోచిన కొత్త ఆర్గ్యుమెంట్ విన్నావా?' అంటూ 'తనదైన శైలిలో 'ఊసరవెల్లి' రాజకీయ నాయకుల్లో గిరీశం 'అంశ' కనిపించకపోతే అది 'ఓటరు' తప్పు కాదు. వారి తెలివితేటలు. తనకు ప్రయోజనం కలిగతే 'వర్తమానాన్ని' పొగడటం, లేకపోతే తెగడటం 'గిరీశం' నైజం. 'విధవలైన స్త్రీలను' అవమానించిన గిరీశం 'బుచ్చెమ్మ'పై ప్రేమ(?) కలిగిన తరువాత 'వారిపైన' అపారమైన ప్రేమాభిమానాలు కనిపిస్తాడు. 'విధవా వివాహమే నాగరికత'కు నిగ్గు అయినప్పుడు బాల్యవివాహాలు లేకపోతే నాగరికత ఆగిపోతుందని చెబుతాడు. ఓ అస్పష్టతాపూరిత 'స్పష్ట'త తనకు 'ఉపయోగపడుతుందని' అతని అభిప్రాయం. నిన్నటి వరకు ప్రతిపక్షంలో ఉండి నేడు అధికారపక్షంలో ఉన్నవారు 'ప్రతిపక్షం ప్రగతిని' 'అడ్డుకుంటు న్నదని' అంటారు. 'ఆనాడు ప్రతిపక్షం ప్రగతికి మార్గం' అన్నవారు ఇటువంటివారే.. ప్రేమంటే ఓ సరదాగా భావించే వర్తమాన యువ 'గిరీశం' అంశలైన వారు 'లేవదీసుకొనిపోతే సుఖము, కీర్తి' కూడా లభిస్తాయనుకుంటారు.

చివరకు 'డామిట్ కథ అడ్డం తిరిగిందని' వాపోతారు. గిరీశం వంటి గురువులు చెప్పే చదువులకు వెంకటేశం వంటి ఆంగ్లమాధ్యమ విద్యార్థులు 'క్రియేషన్' అంటే ఆవులు, గేదెలు దగ్గరనే ఆగిపోవడం అందరికీ తెలిసిందే. 'కపిద్ధాకార భూగోళ' అని మనుధర్మ శాస్త్రంలో చెప్పినాడు. కపిద్ధమంటేయేమిటి?' అని అడిగిన గిరీశం, తరువాత బుచ్చెమ్మ అందాన్ని గురించి చెప్పిన మాటలు వింటే వర్తమాన విద్యావిధాన ప్రయాణ గమ్యం ఏమిటో అనే ప్రశ్న ఉదయించకమానదు. బుచ్చెమ్మ కోసం 'గిరీశం' చెప్పిన ప్రేమకబుర్లు కూడా నేడు నిత్య నూతనం. మాధ్యమాల్లో పొంగి ప్రవహిస్తున్న కవిత్వం చూస్తుంటే అనేక వేల మంది 'గిరీశం' వారసులైన ప్రేమికులు కనిపిస్తారు. గిరీశం చెప్పిన 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' రైమ్‌ను విని మురిసిపోయే వెంకమ్మలు కూడా నేడు బహు మిక్కుటమే! నాటకంలో ప్రతి పాత్రను 'గిరీశం' ప్రభావితం చేయగలిగాడు. తనమాటల గారడీతో బోల్తా కొట్టించి పబ్బం గడుపుకోగలిగాడు.

మధురవాణి, సౌజన్యరావు పంతులు మాత్రమే 'గిరీశం' పాత్రలోని 'అసలుతత్వం' గ్రహించి దూరంగా ఉంచగలిగారు. ప్రయోజనం తనదైతే 'తాను మారిపోయానని' చెప్పడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. సౌజన్యరావు పంతులు దగ్గర అతను చెప్పిన మాటలు ఇందుకు ఉదాహరణ. బుచ్చెమ్మతో పెళ్ళి చేయమని అడుగుతాడు. కాని సౌజన్యరావు పంతులు 'గెటౌట్' అన్నప్పుడు 'డామిట్ కథ అడ్డం తిరిగిందనుకుంటాడు. ప్రతి ఒక్క పాత్రను అతను ఉపయోగించుకోగలిగాడు కాని ఏ పాత్రకు అతడు ఉపయోగపడలేదు. 'ఏ ఎండకా గొడుగు', 'ఏ అవసరానికి ఆ ఉపాయం' అతని నైజం. రాజకీయ నాయకులంత సులభంగా తన 'ఒపీనియన్స్'ను మార్చు కోగలడు. ప్రస్తుత రాజకీయాల్లో గిరీశం వారసులే ఎక్కువ.

'కన్యాశుల్కం' రచన ప్రారంభంలో గురజాడ వారు 'గిరీశం'

## సౌందర్య దర్శనం!



నెచ్చెలి నుదుటి పాపిడిలో
నిశ్చింత జాబిలి చిక్కుకుంది
మూసిన కనురెప్పల మాటున
నిదుర మబ్బు దాక్కుంది
అయినా వెన్నెల కురుస్తూనే ఉంది
గది నిండా జడివానలా.
తడిసి ముద్దవుతున్నాను
తడి ముద్దు అవుతున్నాను

తొలి వేకువలో చెలి మోము
అరవిరిసిన కలువ పువ్వు
చూస్తూనే ఉండిపోవాలి..
తను లేచేదాకా, తనివి తీరేదాకా,
తెల్లవారే దాకా.
ఉదయపు నడకకు నేడు సెలవు
ఏలన, ఉషోదయపు అందాలు
ఆమె ముందు దిగదుడుపు!

**- డా. డి.వి.జి.శంకర రావు,** మాజీ ఎంపీ,
**94408 36931**

పాత్రను ఇంత విస్తృతంగా విస్తరించలేదు. కాని... క్రమేపి 'గిరీశం' గురజాడను 'డామినేట్' చేసేసాడని చెప్పవచ్చు. వి.శాస్త్రి గారన్నట్టు "Girisham must have taken the author himself by storm and argued and bluffed his way into the drama.." గిరీశం ఇంతగా ఇంతమంది ప్రేక్షకులను, పాఠకులను ఎందుకు కుదిపేస్తున్నాడు అని ప్రశ్నించుకుంటే 'గిరీశంలోని లక్షణాలు, జీవితాన్ని అనుభవించాలనే తపన' వంటివి ప్రతి వ్యక్తి సుప్త చైతన్యంలో దాగి ఉంటాయి. అవన్నీ గిరీశంలో ప్రదర్శితమవుతాయి.

కన్యాశుల్కం... ఆధునిక సాహిత్యంలో 'సోషల్ రియలిజం' 'గిరీశం'...! నిజంగానే నిజమైన పాత్ర.

శివసాగర్ అన్నట్లు ...

**"గురజాడా!/ నీవు సృష్టించిన పాత్రలు**
**నిజంగానే/ సజీవమైనవి**
**అందుకనే కవి మారే కాలంతో పాటు**
**మార్పు చెందుతున్నవి."**

'గిరీశం' ఇందుకు మినహాయింపు కాదు. ■

## దూరం

**- డాక్టర్ ఎన్.గోపి**

ఈ వర్షం
మీ ఊళ్లో కూడా పడుతుందంటే
సంతోషంగా వుంటుంది
ఈ గాలి కూడా అంతే
ఇంతే ఆహ్లాదకరంగా
నిన్ను స్పృశిస్తుందనుకుంటాను.

ఈ సూర్యుడివి కొన్ని కిరణాలు
తక్కువై నట్టున్నాయి
అవి మీ ఇంటి ముంగిట
రాలి వుంటాయి చూడు

ఇక్కడి నుంచి నేను అరిస్తే
నీకు వినపడటం లేదు
అందుకని చుక్కలతో సందేశం పంపిస్తాను.
వాటిని డీకోడ్ చేసుకోవడం రాదు నీకు
ఫోన్‌లో నా మాటలు
సగం సగం చచ్చి పోతుంటాయి

దూరం వల్లనే నీకూ నాకూ
ఇంత సామీప్యం సాధ్యమైందేమో!

ఒక్కొక్క అడుగే కొలుచుకుంటూ
మీ ఊరు చేరాలంటే
కొన్ని సంవత్సరాలు పడుతుంది
అప్పటికి నువ్వుంటావో లేదో!
నేనూ అంతే
ఉన్నా వయస్సు ముదిరి
ఊహ చెదిరి పోవచ్చు!

ఆకాశంలో ఈ మెరుపు
మీ ఊళ్లో కూడా తెరుచుకుంటుందేమో
ఉరుముల విరాట్ శబ్దంలో
ఇక్కడి దిక్కులన్నీ
పిక్కటిల్లి పోతున్నాయి
ఓ మై గాడ్!
పిడుగు ఏదైనా వుంటే
అది మీ ఊళ్లో పడకుండు గాక!



# నేను గృహిణిని

- రజిత కొండసాని
96528 38920

**నా** శ్రమకు  విలువ లేదట
నా చాకిరీకి ఖరీదు లేదట
యాడాదికో పాలి నాకు దినవెట్టినట్లు
మీ పొగడ్తల బిచ్చాన్ని
నా కొంగులో పోయొద్దు
అమ్మా ఆదిశక్తి అంటూ
నన్ను పట్టుచీరలతో ఉరి తీయొద్దు!

ఇప్పుడు నా శ్రమకు ఖరీదు కావాలి
నా ఉత్పత్తులకు కొలతలు కావాలి

నా నెత్తురుతో తడవని ఏ ఇంటి గుమ్మం
ఉంది?
నా భుజం కాపుగాయని ఏ ఇంటి పైకప్పు ఉంది?
ఈ సమాజం ఆహారం తినాలంటే
పొయ్యిలో కట్టెల్లా మండింది నేను కాదూ?
పొయ్యి మీద అన్నం గిన్నె ఉడికింది నేను కాదూ?

నా చెమట పారని నేల ఎక్కడుంది?

నా చేతులతో మోయని ఏ మనిషి ఉన్నాడు?
నా పురిటి నొప్పులలో శ్రమ లేదా?
పౌరులందరూ నా ఉత్పత్తులు కాదా?
నేను యూనిఫారం లేని శ్రామికురాలిని
నేను ఇల్లాలిని
నన్ను ఏ సైరన్ అదిలించనక్కర్లేదు
నాకు ఇరవై నాలుగు గంటలూ ఒకటే షిఫ్ట్!

నేను కార్మికురాలిని
నేను అమ్మను
రక్తాన్ని పాలుగా మార్చి బిడ్డలకు పట్టి
వాళ్ళని డాక్టర్లు ఇంజినీర్లు లాయర్లు అనే
సామాజిక ఉత్పత్తులుగా మార్చే కార్మికురాలిని
నేను అమ్మని ..!

గుండె మీద చేయి వేసుకొని చెప్పండి
అమ్మలని మించిన శ్రామికులెవ్వరు?
ఇల్లాళ్ళని మించిన కార్మికులెవ్వరు?

నా శ్రమ మీద ఆధారపడి
నన్నే పోషిస్తున్నామనుకునే  మగానుభావుల్లారా!
నా శ్రమకు విలువ కట్టండి మరి!




# ప్రకృతి - ప్రభుత్వం - ప్రజలు



- దుప్పల రవికుమార్
99892 65444

**అది** 1977వ సంవత్సరం. నవంబర్ 19.

ప్రకృతి దివిసీమపై కన్నెర్ర చేసింది.

పోటెత్తిన ఉప్పెన ఒక్కసారిగా వందలాదిమందిని మృత్యువాతన పడేట్టు చేసింది. తుపాను కరాళ నృత్యంలో కోట్లాది రూపాయల ఆస్తి సముద్రంలో కరిగిపోయింది. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపలే అంతా జరిగిపోయింది. ఇదంతా దివిసీమ ఉప్పెనగా తెలుగు వారందరికీ ఒక చేదు జ్ఞాపకం. ప్రకృతి మనిషిపై కన్నెర్ర చేస్తే నోరు తెరుచుకుని చూడడమే సాధారణ మానవుడెవడైనా చెయ్యగలిగేది. తుపాను హెచ్చరిక వ్యవస్థ మన దగ్గర ఉన్నప్పటికీ ఉప్పెనను గుర్తించలేకపోవడం మన శాస్త్రవేత్తల వైఫల్యం. విపత్తు సంభవించిన చోట హుటాహుటిన జనజీవనాన్ని ప్రతిష్టించే కార్యక్రమాలు (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) చేపట్టకపోవడం ప్రభుత్వ వైఫల్యం. గూడూ గుడ్డా సమస్తం సముద్రంలోకి కొట్టుకుపోయాక మోడుల్లా మిగిలిన మనుషులను ఆదుకోకపోవడం అధికార యంత్రాంగపు వైఫల్యం. ఇదంతా ఓ సృజన కళాకారుడికి కవితా వస్తువయింది. ఆ కవిత తెలుగు భాషలో ఆధునిక రాజకీయ కావ్యమైంది. అదే కవిత సాహిత్యాభిమానులకు నిత్య మననీయ ఆధునిక గానమైంది. ఆ కవిత పేరు 'కొయ్యగుర్రం'.

మానేపల్లి హృషీకేశవరావనే కవి 'ఉదయించని ఉదయాలు' కవితా సంకలనం వెలువరించారంటే ఆహా అనుకుంటాం. ఆ పేరుతో ప్రసిద్ధుడైన కవిని మనం ఎరుగం. విరసం ఏర్పడక అర్ధ దశాబ్ద కాలానికి ముందర 1965లో ఇదే కవి మరో అయిదుగురు కవులతో దిగంబర కవితోద్యమాన్ని ప్రారంభించారు. అప్పుడే తన పేరును 'నగ్నముని'గా మార్చుకున్నారు. 1977లోనే 'కొయ్యగుర్రం' వెలువరించారు. కొయ్యగుర్రం వస్తూనే అనేక ప్రభంజనాలు, దుమారాలు రేపింది. దేశ విదేశాల్లోని అనేక భాషల్లోకి అనువాదం పొందింది.

జరిగిన విపత్తు దాచేస్తే దాక్కునేది కాదు. అరచేతుల్తో ఆపలేనిది. కేవలం ముందస్తుగా తుపాను రాకను పసిగట్టలేక, చెల్లాచెదురైన బాధితుల్ని ఆదుకోలేక, పునరావాస కార్యక్రమాలు చేపట్టలేక ఉదాసీనంగా ఉండిపోయింది ప్రభుత్వం. కాబట్టి ఈ దురాగతంలో హంతకి మరెవరో కాదు, ప్రభుత్వమే! హతులు 'అలగాజనం'. కాని జరిగిన ఘోరాన్ని కవిత్వీకరించాలి కదా – కళ్లకు కట్టినట్టుగా చెప్పాలి కదా! అందుకే కవి పదే పదే నెపం వేరేవాళ్ల మీదకి తోసేస్తారు. నెపం తోసింది ఎవరి మీదకో కవి చాలా స్పష్టంగా చెప్తున్నప్పటికీ పాఠకులకు కవి అసలు ఉద్దేశాలు అర్థమవుతున్న కొద్దీ అసమర్థ ప్రభుత్వంపై నెమ్మది నెమ్మదిగా కోపం పెంచుకుంటూ పోవడంలో రచయిత సఫమయ్యారు.

కావ్యంలో మొదటి మూడు అధ్యాయాల్లో ఒక కవి తత్వాన్ని వర్ణించిన నగ్నముని... మూడో అధ్యాయంలో కవిగా తన ప్రత్యేక తత్వాన్ని స్పష్టపరుస్తారు. తన పొట్టలోంచి ఒక పేగును బయటకు పీకి ఏకతార వాయిస్తూ కవితను గానం చేయడానికి

పూనుకున్నాడు. ఈ నగ్నసత్యాన్ని వినగల, విని భరించగల ధీరులకోసం కవి గాలింపు మొదలవుతుంది. అసలు కవిత ప్రారంభించడమే పాతను తూలనాడడంతో మొదవుతుంది. జీవితం మిథ్యంటారు వేదాంతులు. అది అబద్ధమని పొలికేక పెడుతూ 'కొయ్యగుర్రం' ప్రారంభమవుతుంది. నీచమైన కాకులు మాత్రమే మిథ్య మాటలు మాట్లాడుతాయంటారు. పాత పురాణాల పద్ధతిని పరిహసిస్తారు. కొత్త జీవితపు ఎరుకను ఏర్పరుచుకోమంటారు. దీనిద్వారా తాను చెప్పబోయే విషయా నికి పాఠకులను మానసికంగా సంసిద్ధులను చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది చేయకపోవడం వల్లనే భావ కవిత్వాన్ని (రొమాంటిక్ పొయట్రీ) తొలిసారి రాసిన ఎస్.టి.కోల్‌రిడ్జ్ తన లిరికల్ బాలాడ్స్‌కు సవివరమైన పీఠిక (ప్రిఫేస్) రాసుకోవాల్సి వచ్చింది. ఆ తప్పు మళ్లీ తెలుగు కవి చేయలేదు. కవితలోనే మొదటి మూడు అధ్యాయాల్లో పాఠకులను సన్నద్ధపరుస్తారు.

నాలుగో అధ్యాయంలో నవంబర్ 19న వచ్చిన దివిసీమ ఉప్పెన దుర్ఘటనను ప్రస్తావిస్తారు. ఉప్పెన ముఖ్యాంశం కాదు. ఉప్పెన దివిసీమను తాకిన తేది ముఖ్యాంశం కాదు. అందుకే అంటారు – 'కేలండర్‌కి రక్తమాంసాలుండవు / కేవలం / కాలం కుక్క నోటిలోని ఎముక ముక్క/ గోడకు బల్లిలా కరుచుకుపోయిన వుత్తి కాగితం ముక్క / తారీకులు ముద్దాయిల్లా బోనుల్లో నిలుచునుంటాయి / అది ఏ తారీకన్నా కావొచ్చు/ అది నవంబర్ 19 కావడం యాదృచ్ఛికం కావొచ్చు".

అయిదో అధ్యాయంలో జరిగిన ప్రకృతి బీభత్సాన్ని కవి చాలా నేర్పుగా వర్ణిస్తారు. జరిగిన ఉత్పాతానికి కారణం మరెవరో కాదు సముద్రుడే. అంటే బతకడానికి అవసరమైన నీరే బతుకును కడతేర్చింది. దాన్నే కవి ఎలా చెప్తున్నారో చూడండి : "మనిషి ఊపిరి కొయ్యడానికి / కత్తే కానక్కర్లేదు / జీవితాల్ని చెరచడానికి / మరుక్షణం మృతకళేబరం చెయ్యడానికి / తుపాకులూ యుద్ధాలే రానక్కర్లేదు / నూరేళ్లు నవ్వుతూ తుళు ్లతూ వేయిరేకలతో / వెలుగులు వెదజల్లుతూ పుష్పించవలసిన బతుకుల్ని / భగ్గున మండించెయ్యడానికి పెట్రోలే అక్కర్లేదు / ఉప్పు నీళ్లు చాలు / దాహం తీర్చి ప్రాణం నిలబెట్టవసిన నీరే / గొంతు పిసగ్గలదు" అంతే! నీరు అలగాజనం ఉసురు తీసుకుంది. పోయినవారు పోగా మిగిలినవారిని పరామర్శిం చడానికి అధికారులు, రాజకీయ నాయకులు వచ్చారు. వెళ్లారు. ప్రకటనలు చేశారు. కానీ ఒరిగిందేమీ లేదు. ఒకప్పుడు సస్యశ్యామలమైన ఆ ప్రాంతం ప్రమాదం తర్వాత శవాల పోగులతో నిండింది. "బలహీనుడు సంపద సృష్టిస్తాడు / బలవంతుడు సంపద మింగి / దరిద్రం పంచుతాడు. / చరిత్ర నిండా దరిద్రుల శవాల గుట్టలే" అని చెప్తూ ఈ భాగాన్ని ముగిస్తారు. ఆరో అధ్యాయం చాలా కీలకమైనది. రెండే పదచిత్రాలు ఉన్నప్పటికీ కవి ప్రణాళికలో ముఖ్యమైన భాగమిది.

ఈ విషయం చెప్పడం ద్వారా నగ్నముని పాఠకులను స్వయంగా చెయ్యి పట్టుకుని తన ప్రపంచంలోకి లాక్కుపోవడానికి వీలైంది. బ్రహ్మాండమైన ఎత్తుగడ. బుద్ధుడిగా మారనున్న సిద్ధార్థుని సాగనంపిన అశ్వమింకా అతడి ఆగమనం కోసం నాగార్జున కొండలో ఎదురుచూస్తూనే ఉంది. కానీ మనిషిలో మహాబోధి మిగల్లేదు. ఎప్పుడో కూలిపోయింది. మానవీయత అడుగంటింది. ఆధునిక మానవుడు మనసు లేని చెక్క (డ్రైవుడ్) అయ్యాడు. ఆ చెక్కతో చెయ్యబడిందే కొయ్యగుర్రమనే పాలన యంత్రాంగం – ప్రభుత్వం. ఈ కష్టాలన్నీ స్వతంత్ర ఫలాలు పొందిన ఆనాటి తరం, తన భవిష్య దేశాన్ని తయారుచేయడంలో విఫలమవ్వడం వల్ల వచ్చినవి. నగ్నముని తన కవితలో ఇవేమీ చెప్పలేదు. కేవలం గుర్రం ఇంకా బుద్ధుడి కోసం చూస్తున్నా, మనిషిలోని మహాబోధి కూలిపోయిందంటారు. తర్వాతిదైన ఏడో అధ్యా యంలో తాను కొయ్యగుర్రాన్ని దేనికి ప్రతీకగా ఈ కవితలో వాడుకుంటున్నారో స్పష్టపరుస్తారు. ఎనిమిదో భాగంలో జరిగిన నేరంలో దోషులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. "నిద్రపోతే కలలు కళ్లను కుడతాయి / కదిపితే తేనెటీగలు ఒంటిని వెంటాడి మరీ కుడతాయి / కదపకపోయినా నోరు మెదపకపోయినా / క్షుద్ర రాజకీయాలు / నిండు జీవితాల్ని కుడతాయి" అని సూటిగా అనడానికి ముందర ఈ విషయంలో పాఠకుని బుర్రలో పుట్టబోయే చిల్లరమల్లర సందేహాల్ని ఇలా నివృత్తి చేస్తాడు. "తీరమంతటా గుడిసె వుందని తెలుసు / పాలుపోసే చేతినే అదను చూసి పడగకెరటాల కోరలు / కాటేస్తాయని తెలుసు" అంటే అన్నీ తెలిసినా ఏమీ చెయ్యకుండా నిశ్శబ్దంగా వుండడం ద్వారా ఈ దురాగతానికి సహకరించిన రాజ్యవ్యవస్థ పాత్రను బహిర్గతపరుస్తారు.

తొమ్మిదో అధ్యాయంలో నగ్నముని ఆ భీకర రాత్రిని వర్ణిస్తారు. ఆదమరిచి అంతా నిద్రపోతున్న వేళ సముద్రం తన కెరటాల బాహువుల్తో దివిసీమను బంధించి ఉక్కిరిబిక్కిరి చేసేసింది. కవి మాటల్లో చెప్పాలంటే... "నదుల మంచినీళ్లని కౌగిలిలోకి / తనివితీరా తాగి తాగి తెగబలిసిన కొండ చిలువలా / మెలికలు తిరిగి / కాలంపై భూగోళంపై 'అలగాజనం' ముఖాలపై / వృక్షాలపై పక్షులపై సమస్త జంతుజాలంపై /

చీకటి ముసుగు హఠాత్తుగా కప్పి / నీటితో పేనిన తాళ్లతో గొంతు బిగించి / కెరటాల్తో కాటేసి వికటాట్టహాసంతో బుసలు కొడుతూ / పరవళ్లు తొక్కింది / మనిషి బతికుండగా దాహం తీర్చలేని / ఉప్పునీటి సముద్రం / మిగిలింది కెరటాలు కాదు / శవాల గుట్టలు / శరీరాలనుండి తెగిపోయి గాలికి ఊగుతున్న ఊపిరి దారాలు." ఇది ఇలా జరుగుతుందని మన నిస్తేజపు పాలక వర్గానికి తెలియదా? తెలుసు. కాని, నిర్లక్ష్యం. సముద్రం పక్కనే ఎలాంటి రక్షణాలేని జనం ప్రాణాలు ఉంటే ఎంత, పోతే ఎంత అనే భావజాలమున్న వారే అధికారంలోకి వస్తూ వుండడం మానవ దౌర్భాగ్యం. దాన్నే పదో అధ్యాయంలో చెప్తారు: "బతుకుల్ని నిలబెడతామని భుజాలెక్కి కూచున్న వాళ్ల / అలక్ష్యానికీ అహంకారానికీ సాక్ష్యాలుగా / మిగిలిపోయాయి. / అయినా మరేం పర్వాలేదు / కంకాళం సంజాయిషీ కోరదు".

కొయ్యగుర్రం భావనను దేనికి ప్రతీకగా వాడారో ఆ భావాన్నంతటినీ పదకొండో అధ్యాయంలో నగ్నముని వివరిస్తారు. కవి హృదయంలోని ఆవేదన, ఆక్రోశం ఇందులో వాడిన ప్రతిమాటా చాలా కచ్చితంగా బయటపెడ్తాయి. "ఇప్పుడు కొత్తగా సముద్రం చంపేదేమిటి/ ఇప్పుడు కొత్తగా కొయ్యగుర్రం చంపేదేమిటి/ మరేం పర్వాలేదు/ ప్రజాసేవ చెయ్యడానికి కావలసినంతమంది/ పోటీలు పడే నాయకులున్నారు/ శవాల్ని ఖాళీ చెయ్యడానికి కాకులూ గద్దలూ రాబందులూ/ లేకపోయినా పర్వాలేదు/ కాంట్రాక్టర్లున్నారు/ జాతికి సేవ చేస్తారు". అలా ధ్యానంలో మునిగిన కవికి నిస్సత్తువ ఆవహిస్తుంది. ప్రజల బాగు చూడాల్సిన ప్రభుత్వపు చేతగానితనం నిరాశ కలిగిస్తుంది. అందుకే... "ఈ వ్యవస్థలో/ పుట్టడం మోసపోవడానికే/ పెరగడం మోసపోవడానికే/ ప్రేమించడం మోసపోవడానికే/ నమ్మడం మోసపోవడానికే.." అంటూ అందులోంచి పుట్టిన కోపాన్ని ప్రజలమీదకి మళ్లిస్తారు. కొయ్యగుర్రం లాంటి వ్యవస్థను తయారుచేస్తూ భరిస్తూ తరిస్తున్న జనాన్ని విసుక్కుంటారు. "రోడ్లపక్క ప్లాస్టిక్ చెట్లు నాటుదాం/ ప్లాస్టిక్ కొమ్మపై ప్లాస్టిక్ పక్షుల్ని కూచోబెడదాం/ ప్లాస్టిక్ కంకు నాటి/ పొలాలు బంగారం పండినట్లు చూపుదాం . . . / ప్లాస్టిక్ ఆవు ప్లాస్టిక్ గేదె ప్లాస్టిక్ పొదుగు/ పితుక్కుని ప్లాస్టిక్ పాలు తాగుదాం/ కొయ్యగుర్రాన్ని ఒహెూం ఒహెూం అంటూ/ జీవితాంతం మెడలమీద మోద్దాం"

చివరిదైన పన్నెండవ అధ్యాయంలో దీనికి విరుగుడుగా కవి తనదైన దఃఅక్పథంలో ముగింపునిస్తారు. ఇదీ కొయ్యగుర్రం కథ. 1965లో దిగంబరగా కవిగా ఒక వెలుగు వెలిగిన నగ్నముని, 1970లో విరసం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. మరి 1977లో రచించిన 'కొయ్యగుర్రం' ఎందుకంత వివాదాస్పదమైందన్నది ప్రశ్న. దానికి సమాధానం ఈ కావ్యంలో పాక్షికంగానే లభిస్తుంది గాని, నగ్నముని సాహిత్యాన్నంతటినీ అధ్యయనం చేస్తే సంపూర్ణ జవాబు దొరుకుతుంది. అయితే ఆ క్రమ పరిణామాన్ని మార్క్సిజపు వ్యతిరేకతగా కొట్టిపారేయకూడదు. ఈ కవికి కవితావస్తువును అందించింది సమాజం కావచ్చునే గాని, ఆ వస్తువును పరికించవలసిన దృష్టినిచ్చింది మాత్రం మార్క్సిజమే. ఆ చూపునిచ్చింది ఆ తత్వమే. 75ల తర్వాత రాస్తున్న కవిత్వంలో క్రమంగా విశ్లేషణలో, సమస్యకు పరిష్కారం సూచించడంలో ఈ దఅక్పథం నుంచి కవి వైదొలగుతుండడాన్ని గమనిస్తాం. ఇక కొయ్య గుర్రంలో మాత్రం ఎనిమిదో అధ్యాయంలో కవి తొలిసారి బయటపడతాడు. "మనిషిని మనిషిచేసే మోసం కాలానికి తెలుసు/ కారణాలు కార్ల్ మార్క్సుకు తెలుసు/ రోడిన్/ మ్యూజియంలో శిల్పంగా మారి గడ్డానికి చేతులు ఆంచి/ ఆలోచిస్తూనే ఉంటాడు / ఆలోచనకీ మనిషికీ వున్న సంబంధం ఏమిటి" అలా అని ఊరుకుంటే సరే మార్క్సును ఏమైనా అనొచ్చుగాని, సిద్ధాంతాన్ని ఏమనలేదు కదా అని సరిపెట్టు కోవచ్చు. ముగింపు వద్దకొచ్చేసరికి కవి మరింత పదును తేలుతారు. మార్క్సిజం ఇచ్చే ఆశావహ దృక్పథాన్ని పక్కనపెట్టి, సమాజంపై కోపంతో, మారని విలువలపై ఏహ్యతతో నిస్ప ృహలోకి జారిన కవి నిరాశావహ దృక్పథంలో పడిపోతారు. పెసిమిస్టిక్ ధోరణి అలవరచుకుంటారు. అందుకే కావ్యం ముగింపులో– "నాకు రాకెట్లద్దు చంద్రమండలం వద్దు / విమానయానాలొద్దు / కాలాన్నీ జీవితాన్నీ కలుషితం జేసే / రాజకీయ కార్యకలాపాలద్దు / రైళ్లొద్దు బస్సులొద్దు యీ నాగరికత రద్దీ వద్దు / పాత రాతియుగం పనిముట్టు పట్టుకుని / చరిత్ర చీకటి కోణాల గుహల్లోకి వెళ్లిపోతాను" అంటాడు. అయితే ఇదంతా కేవలం పరిస్థితినంతటినీ అవలోకించిన కవి మానసిక స్థితిగానే మనం భావించాలి.

కొయ్యగుర్రం వెలువడి మూడు దశాబ్దాలైన సందర్భంలో 2007లో కొత్త ఎడిషన్ ప్రచురించారు. వీటిలో చేకూరి రామారావు రాసిన పీఠిక, నికీతా గూరోవ్ రాసిన పరిచయం, మో రాసిన 'జార్జ్ మాండెల్/ నగ్నమునీ' అనే ఇంటీరియర్ డైలాగ్ చదవడం గొప్ప అనుభూతి. ఇవి కావ్యాన్ని మరింత విస్తృతంగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. ఈ 25 పేజీల కవిత చదవడం సమాజం పట్ల మనకు కొత్త చూపు లభించడం కోసమే! ■



## ఆ ఉదయం రావాలి!

ఆ ఉదయం రావాలి
వేలాది రాతిరుల చీకట్లను చీల్చడానికి
వందల తరాల నిస్తేజాన్ని వదిలించడానికి
ఒక మహా ఉదయం రావాలి..

మనిషితనం తెలియని రాతియుగం వైపుకి
ప్రయాణం కదుతున్న వర్తమానపు అమానుష
దృష్టికోణాన్ని
అణచివేయడానికి ప్రళయకాంతిని ప్రసవించే
ఒక ప్రచండ ఉదయం రావాలి

ఆటవిక దారుల్లోకి దిగజరిపోతున్న
అవివేక జనవాహినికి జ్ఞాన నేత్రాలు తెరిపించడానికి
అరుణచేతనను వెదజల్లే
ఒక అసమాన ఉదయం రావాలి..
జడత్వాన్ని, మూఢత్వాన్ని నెత్తిన పెట్టుకొని
విలువల వలువలు విప్పుకు నడుస్తున్న
అర్ధనగ్న సమాజానికి
హద్దులు నిర్ణయించే ఒక కఠోర ఉదయం రావాలి..

చీకటిరంగుని పూసుకున్న మానవ మెదళ్ళలో
అక్షర కిరణాలు నింపే
ఒక క్రాంతివర్ణపు భాస్వర ఉదయం రావాలి
జాతి నరాల నిండా పేరుకుపోయిన
అధోముఖ భావజాలాన్ని చెదరగొట్టి సంస్కరించే
ఒక మహోభ్యుదయం రావాలి..
ఆ ఉదయం రావాలి..
వెలుగు విస్ఫోటనమవ్వాలి..

- బి.బి.టి సుందరతేజ
83095 14802

## అతడు మనిషి..

పడుతూ లేస్తూ .. లేస్తూ పడుతూ
ఒక్కోసారి ఎవరో తల వెనుక
రెండు చేతులు పెట్టి
నన్ను వెదురు బద్దలా వంపుతున్నట్టు

నాలుగు వైపులా
తడిసి నాచు పట్టిన భయంగోడలు
నా మీద పడుతున్నట్టు
గుంజి పట్టిన బాణాలు
నా గుండెనుంచే దూసుకెళ్తున్నట్టు ...

ఆ కల నా నిద్రను ఊడ్చేసింది
ఆ వార్త నా స్థిమితాన్ని కడిగేసింది
ఆ కల
చివరికి ఆ హక్కుల దిక్సూచి
ప్రాణాలనే జుర్రేసింది!

జైలుగోడలు ధర్నా చేసేంత యోధుడు
ఇనుప గజాలు గొడగొడా ఏడ్చేంత ధీరుడు
పేరు లేకుండా ఊరు లేకుండా
ఏరూ ఏరూ తిరిగిండు
సెలయేళ్ళని కలిపేందుకు
కీలు కీలు అరిగించుకున్నడు
పండుటాకుల అరచేతి కాయల్ని
లేత మొగ్గలకు చూపిండు.

కండ్లకు రెప్పల నిఘా తలుపుకు గొళ్ళెం నిఘా
కాళ్లకు చెప్పుల నిఘా
ఇన్ని గాలింపులు వేధింపుల మధ్య
ఇళ్లే జైలుగా వణికిస్తున్నపుడు
జైలు రూపం మాసిపోయింది
శిక్ష అర్థం మారిపోయింది
ఇది పాము దారుల ప్రజా పాలనా కాలం
ఇది పెనం లాంటి బతుకులీడ్చే
నడుస్తున్న భారతం!

- డా. ఉదారి నారాయణ
94414 13666



# భద్రత

- నల్లపాటి సురేంద్ర
94907 92553

దేశంలో ఆవుకి ఉన్న భద్రత మహిళకు లేదంటే నేను ఇన్నాళ్లూ అంతగా పట్టించుకోలేదు. రాత్రి జరిగిన సంఘటన తలుచుకుంటే అది నిజమే అనిపిస్తుంది. ఇంత ఆధునిక కాలంలోనూ మహిళలను పురుష ప్రపంచం ఆట బొమ్మలుగానే చూస్తుందా? ఈ ఊహ రావడంతోనే బాధ కమ్ముకొస్తోంది. చిన్నప్పటి నుంచి ఎన్నో వేధింపులూ ఆటంకాలూ ఎదుర్కొని, నాకంటూ ఒక గ్రాడ్యుయేషన్ సంపాదించుకున్నాను. పెళ్లితో ఒక ఇంటికి అడుగు పెట్టాను. "ఉద్యోగం చేస్తాను" అంటే "మంచి నిర్ణయం" అన్నారు మా వారు. చాలా సంతోషం కలిగింది. నిన్నటి సంఘటనతో మహిళల ఉద్యోగాన్ని ఒక ఆదాయమార్గంగానే చూస్తున్నారా? అనిపిస్తోంది.

♦ ♦ ♦

డ్యూటీ అయ్యేసరికి రాత్రి 12 దాటింది.

"ఈ టైమ్‌లో ఒంటరిగా ఎలా వెళ్తారు? మీ బండి ఇక్కడ వదిలేయండి. నా కార్లో మా ఇంటికి వచ్చేయండి" అన్నాడు కొలీగ్ ఉపేంద్ర.

"నో.. ఇంటికి వెళతాను" అన్నాను. అతడు నాకు భద్రత ఇవ్వదలిస్తే తన కారులో మా ఇంటి వద్ద దించుతాను అనొచ్చు కదా అనుకున్నాను. ఆఫీసు నుంచి బయటికి వచ్చాను.

"మేడం మేడం" అంటూ సెక్యూరిటీ గార్డు వచ్చి ఈ సమయంలో ఇంటికి వెళ్ళడం ఎందుకండి. ఆఫీస్‌లోనే ఉండండి. ఇంటికి ఫోన్ చేసేయండి... వర్క్ ఉంది.. ఉదయం వస్తానని..." అన్నాడు.

"లేదు.. వెళతాను." అన్నాను.

మా వారికి ఫోను చేశాను. ఆయన లిఫ్ట్ చేయలేదు.

తరువాత చేస్తారులే అనుకొని బండి స్టార్ట్ చేసాను.

కొంత దూరం వెళ్ళాను. స్ట్రీట్ లైట్లు చాలాచోట్ల సరిగ్గా వెలగటం లేదు. రోడ్డు మీద ఒకరిద్దరుగా రాకపోకలు సాగుతున్నాయి. కానీ, ఎవరూ ఎవరినీ పట్టించుకొనే స్థితిలో లేరు. భయంగా అన్పించి మావారికి మళ్లీ ఫోన్ చేద్దాం అనుకున్నాను. బండి ఆపటం ఎందుకు అనిపించింది. వేగంగా నడిపితే అరగంటలో వెళ్లిపోవచ్చు అనుకొని ఫోను ప్రయత్నం విరమించుకున్నాను. ఇంకో పది నిమిషాల్లో ఇంటికి చేరతాననగా.. సడెన్‌గా బండి ఆగిపోయింది. మళ్లీ మళ్లీ స్టార్ట్ చేసే ప్రయత్నం చేశాను. ఏమైందో ఏమో! స్టార్ట్ కావటం లేదు. ట్రావెల్ బస్సులు, లారీలు మెరుపు వేగంతో దూసుకు వెళున్నాయి. నెమ్మదిగా నాలో బెరుకు మొదలైంది. మా వారికి ఫోను చేశాను. రింగవుతోంది. కానీ, ఆయన లిఫ్ట్ చేయటం లేదు. నెమ్మదిగా బండి నడిపించడం మొదలు పెట్టాను. కొంత దూరం వెళ్ళిన తర్వాత ఒక బండి నా వెనుక మెల్లగా రావడం గమనించాను. చాలా భయం వేసింది. వెంటనే మా వారికి ఫోన్ చేశాను. రింగవుతోంది. నిద్ర పోయారేమో! ఫోన్ ఎత్త లేదు.

నా వెనుక వస్తున్న బైకు సరాసరి ముందుకు వచ్చి ఆగింది. "ఏమైంది అండి!" అని అడిగారు, ఆ ఇద్దరూ.

"బండి సడెన్‌గా ఆగిపోయింది." అన్నాను.

"పెట్రోలు ఉంది కదా.." అంటూనే ఒక వ్యక్తి నా బండి తన చేతుల్లోకి తీసుకున్నాడు. నాకు కాళ్లు చేతులు వణికాయి. వారిద్దరూ బండి దగ్గరికి వస్తుంటే బ్రాందీ కంపు నా భయాన్ని రెట్టింపు చేసింది. ఇక లాభం లేదు.. పోలీసులు ఫోన్ చేద్దాం అనుకుంటే అప్పుడే ఛార్జింగ్ అయిపోవడం చూసి షాక్ తిన్నా.

"ఎక్కడి నుంచి వస్తున్నారు? ఇంత రాత్రివేళ రోడ్డు మీద

ఏం పని?" అనడిగాడు ఒకడు.

వాళ్ల ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంది. ఇద్దరూ నాకు చెరోపక్క నడుస్తున్నారు. "మీరు వెళ్లండి. మా ఇల్లు దగ్గరే" అని బిగ్గరగా చెప్పాను.

"గట్టిగా మాట్లాడకు. అసలు మీకు ఎందుకు ఈ అర్ధరాత్రి ఉద్యోగాలు? భర్త తెచ్చి పడేసింది తినక. రాత్రుళ్లు రోడ్డు మీద తిరిగితే ఏం జరుగుతుందో నీకు తెలియాలి." అన్నాడొకడు వ్యంగ్యంగా.

"ఉద్యోగం చేయడం తప్పు ఎలా అవుతుంది? ఆడవాళ్లు చదువుకొని తమ కాళ్ళ తాము బతకడం కూడా తప్పేనా?" అన్నాను ధైర్యం కూడబెట్టుకుంటూ.

"అబ్బో.. చాలా కబుర్లు చెబుతున్నావు.. మన సంస్కృతిని నాశనం చేస్తుంది మీ లాంటివాళ్లే" అంటూ నాకు అతి చేరువలో వచ్చాడు. ఇంతలో వాడి ఫోన్ మోగడంతో వెనక్కి తగ్గాడు.

అవతలి నుంచి ఎవరు ఏం చెప్పారో ఏమో ... చాలా ఉద్రేకంగా మారిపోయింది అతని గొంతు.

"ఎవరు వాళ్ళు? వ్యాను ఇటు వైపే వస్తుందా? అయితే, చచ్చారు నా చేతిలో.. వాళ్ళని వదిలే ప్రసక్తే లేదు" అంటున్నాడు.

"ఏమైంది?" అని అడిగాడు నా బండి పట్టుకున్న వాడు.

"ఎవరో ఆవులను తరలిస్తున్నారట. మన వాళ్లు ఫోన్ చేశారు. వాళ్ళు ఇటు వైపే వస్తున్నారట!" అన్నాడతడు.

నా బండిని నాకు ఇచ్చేశాడు రెండోవాడు.

"రోజురోజుకీ ఎక్కువ అవుతున్నాయి. ఎన్ని దాడులు చేసినా తగ్గడం లేదు. ఈసారి రక్తం చిందాల్సిందే. ఈసారి మన దెబ్బ దేశం మొత్తం వినిపించాలి" అంటూ చాలా కోపంగా చెపుతున్నాడు మొదటివాడు.

ఇంతలో ఒక వ్యాన్ రావడం గమనించి, ఇద్దరు చాలా వేగంగా దానిని వెంబడించారు. అప్పటికే కొందరు దానిని అనుసరించి వస్తున్నారు. అందరూ గట్టిగా అరుస్తూ .. చేత్తో కర్రలు తిప్పుతూ దూసుకుపోయారు. ఆ వ్యాను వెనుక ఆవులు ఉన్నాయి. వాటిని రక్షించి, తరలిస్తున్న వారిని శిక్షించటానికి కాబోలు, ఈ హడావిడి!

ఇంతలో మా కాలనీలోకి మళ్లే రోడ్డొచ్చింది. తరువాత ఐదు నిమిషాల్లో బండి నడిపించుకుంటూ ఇంటికి చేరాను. నా గురించి మా ఆయన కంగారు పడతారేమో అనుకుంటూ కాలింగ్ బెల్ కొట్టాను చాలా సేపు. అప్పుడు సమయం ఐదు నిమిషాల తక్కువ ఒంటిగంట అయింది.

"నిద్రలో ఉన్నారా? నా గురించి ఎంక్వైరీ చేస్తున్నారా?" అని ఆలోచిస్తున్నాను.

ఇంతలో తలుపు తెరిచారు.

"ఇప్పుడు ఏం జరిగిందో తెలుసా? నువు వస్తున్న దారిలోనే కళేబాకు తరలిస్తున్న ఆవులను కొందరు యువకులు పట్టుకున్నారు. న్యూస్ ఛానెల్‌లో చూపిస్తున్నారు. మూగ జీవాలను కాపాడినందుకు ఆ యువకులకు సలాం చేయాలి.." అన్నారు. అలా అంటూనే మళ్లీ టీవీ వార్తల్లో మునిగిపోయారు.

నేనూ ఆ న్యూస్ చూసాను. నాలో అభ్యంతరకరంగా మాట్లాడిన ఇద్దరూ ఉన్నారు ఆ గుంపులో.

ఆ వార్త మా వారికి చాలా సంతోషాన్ని, ఉత్సాహాన్ని ఇస్తున్నట్టు అనిపించింది.

"12కల్లా వస్తానన్నావు కదా.. ఇంత లేటైందేం?" అనడిగాడు క్యాజువల్‌గా.

"మధ్యలో బండి ప్రాబ్లెమ్ అయింది." అన్నాను.

"ఫోను చేశాను. మీరు లిఫ్ట్ చేయలేదు." అంటూ ఆయన ముఖంలోకి చూశాను. తన దృష్టి మొత్తం టీవీ మీదే ఉంది.

"ఇదిగో.. ఈవార్త మొదటినుంచీ చూస్తున్నాను. మొబైల్ సైలంట్లో ఉన్నట్టుంది." అన్నాడు.

"దారిలో ఇద్దరు భయపెట్టారు నన్ను"

"పోకిరి గాళ్లు.. ఈ టైంలో లేడీస్ కనిపిస్తే అంతే .." అన్నాడు.

ఇందాక రోడ్డు మీద కనిపించిన ఇద్దరిలాగానే ఇతడూనూ అనిపించింది.

"ఉద్యోగం మానేస్తాను. టైమింగ్స్ ఇబ్బంది అవుతున్నాయి." అన్నాను.

"ఆ నిర్ణయం తీసుకోవద్దు. నా జీతంతో గడవటం కష్టం. ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టాలి." అన్నాడు.

తను నా మాటలు తేలికగా తీసుకోవడం అసలు నచ్చలేదు చాలా చిరాకు వేసింది. ఛీ కొట్టాలి అన్పించింది.

తెల్లారింది. లేచి హాల్లోకి వచ్చాను. ఆరోజు ఆదివారం. ఆఫీసులకు సెలవు. అప్పటికే టీవీలో లీనం అయిపోయి ఉన్నాడు. రాత్రి సంఘటన మీదే చర్చ మొదలైనట్టుంది.

"ఏయ్! లేచావా? ఈ డిబేట్ చూడు. గోమాత సంరక్షణ గురించి చాలా గట్టిగా మాట్లాడుతున్నారు. ఆ తరలిస్తున్న వారికి కఠినంగా శిక్ష పడుతుంది అట. చాలా ఆనందంగా ఉంది."

టీవీ వైపు చూశాను.. పెద్ద పెద్ద అరుపులతో చర్చ నడుస్తోంది. ఆ కిందనే చిన్న అక్షరాలతో స్క్రోలింగ్ వస్తోంది. "పదేళ్ల పాపపై అత్యాచారం.. తప్పించుకుని తిరుగుతున్న నిందితులు.. స్పందించని యంత్రాంగం" అని.

ఈ సంఘటనతో అర్థమైంది, ఎవరికి ఏ విషయం ఎంత ముఖ్యమో!

■

కవిత

# మాక్కొంచెం స్వేచ్ఛనివ్వండి!

పిల్లపక్షులు తల్లి రెక్కల చాటు నుండి
బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టి
రెక్కలు విదిలించేలోపు
చదువుల పంజరంలో వేస్తారు
మేము మాలా జీవించాలనుకున్నా
అధికారులు, తల్లిదండ్రులే
మా మధ్య గోడలుగా నిలుస్తారు
మార్కులంటూ, ర్యాంకులంటూ
మా మధ్య తెలియని గీతను గీస్తారు!

మాక్కొంచెం స్వేచ్ఛనివ్వండి చాలు
పుస్తకాలతో బాటు అల్లరిని
మా భుజాన మోస్తాం
ఆకాశంలోకి ఎగిరేలోపు
ముందు భూమ్మీద నడవటం నేర్పిస్తాం
కిందపడితే కూలిపోవడం కాదు
లేచి నడవడమెలాగో చూపిస్తాం!

వారి హృదయాల్లోకి కిరణాలై ప్రసరించి
వారి కళ్లల్లో వెలుగును చూడకముందే
మేఘాలై అడ్డు నిలిచి నవ్వులను రాల్చేస్తారు
మాక్కొంచెం స్వేచ్ఛనివ్వండి చాలు
పైపైకి ఎదగడం ఒక్కటే కాదు
నీడనిచ్చే మహావృక్షాలను చేస్తాం!

పిల్లల్లో పిల్లలమై తోడుగా
మేము నిలవాలనుకుంటాం
కానీ మమ్మల్ని యంత్రాలుగా చేస్తారు
మాక్కొంచెం స్వేచ్ఛనివ్వండి చాలు
ఆ చిన్న ప్రాణాలకు కూడా
స్వేచ్ఛ ఉందని తెలియజేస్తాం!

పసితనపు తీగలు
మమ్మల్ని అల్లుకుపోవాలని చూస్తాయి
మీ ఆశలకు అనుగుణంగా
వాటిని ఇనుప తీగలుగా మార్చి
బంగారు తీగలని మురిసిపోతారు
మాక్కొంచెం స్వేచ్ఛనివ్వండి చాలు
ఆ పసిమొక్కల ఆలోచనలకు వీలుగా
పాదులు తీసి తడిని పంచి



- పుట్టి గిరిధర్
94914 93170

పచ్చగా అల్లుకునేలా పెంచుతాం!

లేనిపోనివన్నీ రుద్దేస్తూ
అనుక్షణం శాసించేది మీరు
అనుకున్నది చిక్కకపోతే
నిందలు వేసేది మీరే
మాక్కొంచెం స్వేచ్ఛనివ్వండి చాలు
కొత్తగా నేర్పడం కాదు
అసలు బతకడమెలాగో నేర్పిస్తాం!

అలల్లా ఎగసే స్వేచ్ఛను
మీ అదుపాజ్ఞలతో బంధిస్తారు
ఎంతగా ఎగిసినా
తీరాన్ని మాత్రం దాటనివ్వరు
మాక్కొంచెం స్వేచ్ఛనివ్వండి చాలు
ఉరుకుల పరుగుల జలపాతాలను సృష్టిస్తాం!

మీరు కోరే భవిష్యత్తు వైపు పరుగులు పెట్టించి
ఉరితాళ్లను పేననివ్వకండి
మాక్కొంచెం స్వేచ్ఛనివ్వండి చాలు
వలతాళ్ళు విసిరి
లక్ష్యాన్ని అందిపుచ్చుకునేలా చేస్తాం!

ఎవరెటువైపు ఉన్నా
మమ్మల్ని ఎన్నెన్ని హింసలకు గురిచేసినా
గురువులుగా మేము మాత్రం పిల్లలవైపే ఉంటాం
పిల్లలు నడిచే దారులమవుతాం!




# రైతన్నకు బాసటగా కవిత్వ 'సమర భేరి'

- ఎస్.భరత్
94939 95880

**కేం**ద్రం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ చుట్టుపక్కల అన్నదాతల పోరాటం మొదలై పది నెలలు దాటింది. పోరాటంలో ఎంతోమంది రైతులు అసువులు బాశారు. తాజాగా లఖింపూర్ ఖేరిలో శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న రైతులను ప్రభుత్వాలకు అనుకూల వర్గానికి చెందిన రాక్షసమూక వాహనాలతో తొక్కించి నలుగురు రైతులతోపాటు ఓ జర్నలిస్టును, మరో ముగ్గురు సామాన్య వ్యక్తులను మొత్తం ఎనిమిది మందిని హత్య చేసింది. ఈ హింసాత్మక ఘటనలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశీష్ మిశ్రా, అతని అనుచరులు నిందితులుగా విచారణ ఎదుర్కొంటున్నారు.

ఈ రైతుల ఆందోళనకు గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ప్రముఖ కవి గోలి మధు కవితా సమరంతో సంఘీభావం ప్రకటించారు. రైతులు ఎంత ఆవేశంతో, ఆవేదనతో ఉద్యమం కొనసాగిస్తున్నారో అంతే తీవ్రస్థాయిలో ఉద్యమం మొదలైన తొలిరోజుల్లో మధు 25 రోజుల్లో 58 కవితలు రాశారు. రైతు సమరభేరి పేరుతో వాటిని పుస్తకం రూపంలో తీసుకువచ్చారు. ఆ తరువాత కూడా ఉద్యమం కొనసాగుతూనే ఉంది. చట్టాలు రద్దు కాలేదు. ఉద్యమం ఉధృతమైంది. మధు కవిత్వ శైలి కూడా పదునెక్కి అదే రీతిలో కొనసాగుతోంది. మళ్లీ మరో 55 కవితలు రాశారు. మొత్తం 113 కవితలతో రెండో ముద్రణ కూడా తీసుకువచ్చారు. ఇటీవల మంగళగిరిలో 'రైతు సమరభేరి' పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. 2020 సెప్టెంబరు 15 ఒక బిల్లు, 17న రెండు బిల్లులు లోక్ సభలో ఆమోదం పొంది చట్టాలయ్యాయి.

ఈ మూడు వ్యవసాయ చట్టాలకు దేశవ్యాప్తంగా వ్యతిరేకత వచ్చింది. ముఖ్యంగా పంజాబ్, హరియాణాలలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఢిల్లీ సరిహద్దులలో గడ్డకట్టే చలిని సైతం లెక్క చేయకుండా లక్షలాది మంది రైతులు దాదాపు పది నెలలుగా చేస్తున్న పోరాటం చరిత్ర సృష్టించింది. ఏ ప్రభుత్వమైనా రైతులకు లబ్ధి చేకూరేవిధంగా, పండిన పంటకు గిట్టుబాటు ధర లభించే విధంగా వారికి రక్షణగా చట్టాలు రూపొందించాలి. కేంద్ర ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ వర్గాలను దృష్టిలో పెట్టుకొని వారికి సర్వవిధాల లబ్ధి చేకూరే విధంగా, వారికి రక్షణగా, అండగా నిలిచే చట్టాలను రూపొందించింది. రైతులకు ఆదాయ పెంచడం, వినియోగదారుల ప్రయోజనాల కోసం ఈ మూడు చట్టాలు చేసినట్లు కేంద్రం పేర్కొంది. అయితే, చట్టాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులపై నియంత్రణాధికారం కేంద్రానికి సంక్రమిస్తుంది. ఈ చట్టాల వల్ల వ్యవసాయరంగం బహుళజాతి సంస్థల చేతిలో చిక్కుకునే ప్రమాదం ఉందని రైతుల ఆందోళన. వీటి వల్ల చిన్న, సన్నకారు రైతులు చితికిపోతారని, రైతుల ఆత్మహత్యలు కూడా పెరిగిపోతాయని వారి భయం. కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేవిధంగా వీటిని చేశారని ప్రతిపక్షాల ఆరోపణ. అన్ని వ్యవసాయ ఉత్పత్తులు కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యంలోకి వెళతాయన్నది వారి వాదన. ఆచరణలో వినియోగదారులకు కూడా ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత లేదు. కనీస మద్దతు ధర అమలుకాకపోతే కోర్టును ఆశ్రయించే అవకాశం కూడా లేదు.

ఈ నేపథ్యంలో రైతుల పోరాటాన్ని, పోరాటంలో మఅతి చెందిన రైతులను చూసి గోలి మధు చలించిపోయారు.

సామాజిక స్పృ హతో తన వంతుగా స్పందించి కవితా సమరం కొనసాగిస్తున్నారు. రైతులు అక్కడ సమరభేరి మోగిస్తే, మధు ఇక్కడ కవితా సమరభేరి మోగించారు. తన కవితల ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించడానికి నడుం బిగించారు. రైతు శ్రమని అర్థం చేసుకొని రైతాంగం ఉద్యమానికి తన వంతు అండగా నిలిచారు. రైతుకు సేద్యం, స్వేదం చిందించమే తెలుసు, కార్పొరేట్ శక్తుల వలే మోసం చేయడం తెలియదని తన కవితల ద్వారా ఎలుగెత్తి చాటారు. మధు వఅత్తి ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో వర్క్ ఇనస్పెక్టర్, ప్రవృత్తి మాత్రం సామాజిక స్పృహతో కవిత్వం రాయడం. ఈ మధ్య కాలంలో రైతు ఉద్యమంపై కనీసం ఓ కవితన్నా రాయనిదే మధుకు నిద్రపట్టదు.


చట్టాల నిర్మూలనే లక్ష్యమని, అప్పటివరకు పోరు ఆగేది లేదని రైతుబాంధవులు వేస్తున్న అడుగులు విశ్వానికి వెలుగు రేఖలని... కలుపు మీద చేసే పోరు స్ఫూర్తిగా పురుగుపుట్రపై చూపే తెగువే ఆయుధంగా... హస్తినలో తిరగబడ్డాడు రైతు ... నేను సైతం అని గోలి మధు తన కవితలతో కదం తొక్కారు. బతుకు చిత్రం తిరగబడి, రైతు జీవన చిత్రం ఛిద్రమౌతుంటే రైతు పేరిట సొమ్ము చేసుకున్న విశ్వాసమైనా లేక సంఘీభావమే కరువాయే... అని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతకు మూడు వ్యవసాయ బిల్లుల బాణాలు గుచ్చుకుని విలవిలలాడుతుంటే వారి ఓట్లతో అధికారం చేపట్టిన వారికి రైతుల పట్ల దయలేదని, ఆకలి తీర్చేది రైతు, ఆకలి తీర్చుకుని అణగదొక్కేది పాలకవర్గం అని ఆక్రోశం వెళ్లగక్కారు. ధర్మాగ్రహానికి దుర్మార్గం తలవంచక తప్పదులే అన్న భావనతో ఈ కవి ఉన్నారు. చైతన్యం ప్రవాహమై గడ్డకట్టే చలిలో కూడా నిలిచిన రైతు బాంధవులకు శిరసాభివందనం చేశారు. నల్లచట్టాల నిర్మూలనకై ఉపక్రమించిన పరాక్రమానికి అక్రమార్కుల విధ్వంసంపై ధ్వజమెత్తిన రైతు పిలుపు చరిత్రలో మరో మలుపని చాటారు. ముదనష్టపు మూడు వ్యవసాయ బిల్లులు అమలైతే కనిపించే అవసరాలకు కార్పొరేట్ దిక్కైతే పులినోట చిక్కే బతుకే రైతు బతుకు అని రాశారు. ఈ బిల్లులు అమలైతే రైతుకే కాదు మానవాళికీ పగులుతుంది మాడు అని హెచ్చరించారు. *గజగజ వణికించే చలిలో గిజగిజలాడుతూ అన్నదాతలేమో ఊపిరి వదులుతూ ఉద్యమాల బాటలో వెలిగిపోతోంది భారతావని* అని ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డకట్టే చలితో చెలిమి చేస్తూ... సమరం చేస్తున్న రైతుకు ఒక్కొక్క సంఘీభావపు పలకరింత వారికి పులకరింతై మదగజాన్ని తరిమివేసే శక్తినిస్తుందని కవిత్వీకరించారు. హస్తినలో బిగిసిన పిడికిలి ఎర్రకోటను ఉక్కిరిబిక్కిరి చేయక మానదని పేర్కొన్నాడు. కార్పొరేట్ల చెరలోకి నెట్టివేయబడుతున్నది ఒక్క రైతే కాదు దేశభవిత కూడా అని హెచ్చరించారు. మొన్న ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, ఆ తరువాత రైల్వే ఒక్కొక్కటి వడివడిగా కార్పొరేట్ల కౌగిలిలో ఒదిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అపార వనరులు కార్పొరేట్లపరమై ప్రభుత్వ సంస్థలన్నీ బడాబాబుల సంకల్లోకి దూరుతున్నాయన్న వాస్తవాలను తెలియజెబుతూ జనంలో చైతన్యాన్ని నింపుతున్నారు. పుడమి పుత్రుల ప్రాణత్యాగాలకు, సంకల్ప బలానికి ప్రపంచమే నివ్వెరపోతుందన్నారు. ఆవేదన అగ్నికణమై, ఆలోచన అంకుశమై పాలకుల్ని నిలువరించేదే.. అదే అదే హస్తినలోని అన్నదాత హోరన్నారు. దేశద్రోహులంతా దేశభక్తులై అధర్మాన్ని పరాకాష్టకు చేర్చారని, చావులెన్నైనా సడలని పోరు, మిషన్ గన్నులు లేవు, పాలకుల అండదండలు లేవు, ఐనా మానవాళికి దిశానిర్దేశం చేసే దిశగా సాగుతున్న పోరని విశ్లేషించారు. చలిలో పెద్దపులులై పోరాడుతూ ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమై సరికొత్త చరిత్ర సృష్టిస్తున్న రైతన్నల త్యాగాలకు సలాం సలాం లాల్ సలాం అని కొనియాడారు. రైతు ఉద్యమానికి మద్దతు తెలపని, సంఘీభావం ప్రకటించని సినీ పెద్దలకు, చివరకు మీడియాను కూడా వదలకుండా అందరికీ మధు తనదైన శైలిలో చురకలంటించారు. రైతు సమరభేరికి చేయూతగా నిలవాలని, కళ్లు తెరవండి తరలిరండి రైతు పోరుకు బాసటగా నిలవండి భరతమాత పుత్రులారా రండి అని పిలుపునిచ్చారు ఈ కవి. పుస్తకం కోసం ఈ కవిని 99891 86883 నెంబర్లో పలకరించొచ్చు. ■

## దేవిప్రియ సమగ్ర రచనల సంపుటుల కోసం ...

**న**వంబర్ 21 దేవిప్రియ మొదటి వర్ధంతి. ఈ సందర్భంగా 'దేవిప్రియ కవిత్వం, ఇంకొన్ని ఇతర రచనలు' పేరిట దేవిప్రియ సమగ్ర రచనా సంపుటులు తెచ్చే ప్రయత్నంలో ఉన్నాం. 2017లో ప్రచురితమైన ఇం...కొకప్పుడు తరువాత వివిధ పత్రికల్లో, అంతర్జాల పత్రికల్లో ప్రచురితమైన ఆయన కవితలు ఎవరి దగ్గరైనా ఉంటే sikharaschool@gmail.com కు పంపగలరు. 1997లో వచ్చిన 'సమాజానందస్వామి' వ్యంగ్యకవితల సంపుటి ఉంటే శిఖర స్కూల్, ప్రజాశక్తి నగర్, మొఘల్‌రాజ్ పురం, విజయవాడ – 520010కు పంపగలరు.

**– ఖాదర్ మోహియుద్దీన్, బండ్ల మాధవరావు, విజయవాడ**

## వర్తమానం



# ఆకలి కడుపులు ఆహార నిల్వలు

**- ప్రభాత్ పట్నాయక్**

ప్రపంచ ఆకలి సూచికలో భారతదేశం 2020లో 94వ స్థానంలో ఉండేది. అక్కడి నుంచి మరింత దిగజారి 2021లో 101వ స్థానానికి చేరింది. పొరుగు దేశాలైన పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్ కన్నా హీనమైన స్థానంలో ఇప్పుడు ఉంది. 'ఎందుకిలా మన దేశం దిగజారింది?' అన్నదానిని వివరించే బదులు, మోడీ ప్రభుత్వం ఆకలి సూచికను లెక్కించే పద్ధతినే సవాలు చేయడానికి పూనుకోవడం వెగటు పుట్టిస్తోంది. మన ప్రభుత్వం దేశంలో ఆకలి ఎందుకు పెరుగుతోందో, దానివెనుక కారణాలేమిటో గ్రహించలేకపోవడం అంతకన్నా దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

సరిగ్గా మన దేశం ఆకలి సూచికలో దిగజారుతున్న ఈ సమయం లోనే మన ఆహారధాన్యాల నిల్వలు అధికారికంగా అవసరమైన మోతాదు కన్నా ఎక్కువ స్థాయికి చేరుకున్నాయి. మనకు 2 కోట్ల 62 లక్షల టన్నుల ఆహారధాన్యాల నిల్వలు ఉంటే సరిపోతుందని అధికారిక ప్రమాణాలు చెప్తున్నాయి. కాని ఈ సెప్టెంబరు 1వ తేదీకి మన దేశంలో 5 కోట్ల 2 లక్షల టన్నుల నిల్వలు పేరుకుపోయి వున్నాయి. ఇలా ఎందుకు పేరుకుపోయాయి? ప్రజల దగ్గర తమ అవసరాలకు సరిపడా ఆహారాన్ని కొనుగోలు చేయగల ధనం లేకపోవడం వల్లే వారు ఆహారధాన్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొనుగోలు చేయలేకపోతున్నారని స్పష్టంగా కనిపిస్తూనే వుంది. కాని ప్రభుత్వం వాదన వేరేగా ఉంది. ఇంతగా అదనపు నిల్వలు పేరుకు పోయి వున్నాయంటేనే దేశంలో ఆకలి అనేది ఉండడం అవాస్తవం అని, ఆకలి సూచిక లెక్కలు తప్పని ప్రభుత్వం వాదిస్తోంది.

ఒకానొక స్థాయిలో ధరలు, ప్రజల కొనుగోలుశక్తి ఉన్నప్పుడు, ఆహారధాన్యాల నిల్వలు పేరుకుపోవడం, ఇంకోపక్క ప్రజలు ఆకలితో మాడిపోవడం జరుగుతోందంటే ఆహారధాన్యాల ధరలను తగ్గించడం అనేదే ఆ సమస్యకు పరిష్కారం అవుతుంది. లేదా, ప్రజల కొనుగోలు శక్తినైనా పెంచే చర్యలను తీసుకోవాలి. నిజానికి ఎందరో ఆర్థికవేత్తలు, పౌర సంస్థలు, వామపక్ష రాజకీయ పార్టీలే కాకుండా, ఇతర రాజకీయ పార్టీలు సైతం ప్రజల కొనుగోలుశక్తిని పెంచడానికి నగదు బదిలీ వంటి చర్యలను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూనే వున్నాయి. ఆ విధంగా చేయడానికి అవసరమైతే ద్రవ్యలోటును పెంచడానికైనా సిద్ధపడాలని సూచిస్తున్నాయి. అదనపు ఆహార నిల్వలు ఉన్న నేపథ్యంలో, పరిశ్రమల స్థాపక సామర్థ్యం పూర్తి వినియోగంలోకి రాని పరిస్థితుల్లో, ఆవిధంగా నగదు చెల్లింపులు చేసినందువలన ద్రవ్యోల్బణం పెరుగుదలకు అది పెద్దగా దారితీయక పోవచ్చునని కూడా ఆర్థికవేత్తలు చెప్తున్నారు. కాని ఇప్పుడు దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దానికి కారణమేమిటి? ప్రభుత్వం పెట్రో పన్నులు వంటి పరోక్ష పన్నులను పెంచడం ద్వారా ప్రజల కొనుగోలుశక్తిని మరింత హరిస్తోంది. తద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుని ద్రవ్యలోటును తగ్గించుకోవాలని ప్రయత్నిస్తోంది. దానికి బదులు ద్రవ్యలోటును పెంచి, పరోక్ష పన్నులను తగ్గించి, ప్రజలకు అదనపు ఆదాయాన్ని చేకూర్చే చర్యలను చేపట్టడం అవసరం. ఈ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయాలంటే ప్రభుత్వానికి ఉన్నది అదొక్కటే మార్గం.

కాని మోడీ ప్రభుత్వం తీరే వేరు. ఒక మొద్దబ్బాయి తన హెడ్మాస్టరు ఇచ్చే ఆదేశాలను ఏ విధంగా ఆచరిస్తూపోతాడో, అదే విధంగా వ్యవహరిస్తోంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కోరుకున్న విధంగా మన ద్రవ్యలోటును తక్కువ స్థాయిలో ఉంచడానికే ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు ఏ విధమైన నగదు

బదిలీలనూ చేయకుండా వుంది. దాని వలన అతి హీనమైన స్థాయిలో ప్రజల కొనుగోలు శక్తి ఉంది. ఇప్పుడు మనం ఒకదానికొకటి ఏమాత్రమూ పొసగని మూడు ధోరణులను మన ఆర్థిక వ్యవస్థలో ఒకేసారి చూస్తున్నాం. తీవ్రమైన ఆకలి, అవసరానికి మించి వున్న ఆహార నిల్వలు, అయినా వేగంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం. కాని, చుట్టూ ఏం జరుగుతుందో గ్రహించలేని ఈ ప్రభుత్వం మాత్రం కనీసం ఈ మూడు ధోరణులు ఉన్నాయని కూడా గుర్తించలేకపోతోంది. అందుచేత తీవ్రమైన ఆకలి ఉన్నదని అంగీకరిచడానికి నిరాకరిస్తోంది. "ఒక గొప్ప రక్షకుడు నాయకత్వం వహిస్తుండగా ఇటువంటి పరిస్థితి నెలకొనడం అసాధ్యం'' అనే బిజెపి-స్టైల్ ప్రచారార్భాటం ఈ నిరాకరణకు కారణం అని అనుకుంటే పొరపాటు. అదొక్కటే కారణం కాదు. సరళమైన ఆర్థిక సూత్రాలను సైతం అర్థం చేసుకోలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉండడం కూడా ఒక కారణం.

ప్రజల ఆకలిని ఈ ప్రభుత్వం గుర్తించడం లేదు. ఆహార ధాన్యాల ఎగుమతులు ఇటీవల కాలంలో పెరిగాయి. అయినప్పటికీ ఇంకా నిల్వలు పేరుకుపోయి వున్నాయి. వీటిని ఏదోఒక విధంగా తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. బయో ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడం అటువంటి ఒక తాజా ప్రయత్నం. భూ నిక్షేపాల నుండి ఉత్పత్తి చేసే ఇంధనాన్ని తగ్గించి దాని స్థానంలో బయో ఇంధనం ఎథనాల్ ను ప్రోత్సహించాలన్న ధోరణి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. దీనివలన పర్యావరణానికి కలుగుతున్న హానిని తగ్గించవచ్చునన్నది ఆ ధోరణి వెనుక ఆలోచన. అందుచేత గతంలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ఎథనాల్ ఉత్పత్తి కోసం ఆహారధాన్యాలను మళ్ళిస్తున్నారు. అమెరికాలో మొక్కజన్నలను ఎథనాల్ ఉత్పత్తికి చాలా ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఐతే దానివలన అమెరికాకు వచ్చే ఇబ్బందేమీ లేదు. ప్రపంచ ఆకలి సూచికలో అమెరికా ఎక్కడా లేదు. అందుచేత ప్రజల ఆకలి ఒక సమస్య గా ఆ దేశానికి లేదు. కాని మన మోడీ ప్రభుత్వం అమెరికాకు తీసిపోకూడదన్నట్టు ఎథనాల్ ఉత్పత్తిని పెద్ద ఎత్తున చేపట్టి దానిని పెట్రోలుతో కలిపి ఆ మిశ్రమాన్ని వినియోగించేలా ప్రోత్సహించనున్నట్టు అట్టహాసంగా ప్రకటించింది. పెట్రోలులో 20 శాతం ఎథనాల్ ను కలిపి వినియోగించనున్నట్టు, అందుకు అవసరం అయ్యే ఎథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి బియ్యాన్ని, చెరుకును ఉపయోగించనున్నట్టు ప్రకటించింది.

ఈ విధంగా చేయడంలో భారతదేశానికి ఎటువంటి ఇబ్బందీ లేదని, దేశంలోని ప్రభుత్వ ఆహార గిడ్డంగులలో చాలినంత నిల్వలు ఉన్నాయని, అందుచేత దేశ ఆహార భద్రతకు ఎటువంటి ముప్పు వాటిల్లబోదని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి ప్రకటించారు. తక్కిన ప్రభుత్వ ప్రకటనల మాదిరిగానే ఈ ప్రకటన కూడా ఆర్థిక వ్యవహారాల్లో ప్రభుత్వ అజ్ఞానాన్ని ప్రతిబింబిస్తోంది. ఆకలిగొన్న ప్రజల పేదరికానికి నిదర్శనంగా ఈ పేరుకుపోయిన ఆహారధాన్యాల నిల్వలను పరిగణించడం పోయి దేశ సుభిక్షత కు సంకేతంగా పరిగణించడం ఆ అజ్ఞానాన్ని సూచిస్తోంది. ఇదే తరహా ఆలోచనతో ప్రభుత్వం గనుక ఉన్నట్టైతే, రేపు ఒకవేళ దేశంలో కరువు పరిస్థితి ఏర్పడినా, దానిని కూడా ఈ ప్రభుత్వం గుర్తించడానికి సిద్ధపడదు. 'ఆహారధాన్యాల నిల్వలు ఉన్నప్పుడు కరువు ఉందని ఎలా చెప్తారు ఎవరైనా?' అని ఎదురు ప్రశ్నిస్తుంది.

ఆలోచనావంతులెవరైనా సరే, దేశంలో ఆహారధాన్యాల నిల్వలను ఈ విధంగా ఎథనాల్ ఉత్పత్తి వైపు మళ్ళించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలి. దానికి బదులు అదనపు ఆహారధాన్యాలను ప్రజలకు అందేవిధంగా వారి కొనుగోలుశక్తిని పెంచాలని డిమాండ్ చేయాలి. అప్పుడే దేశం ఆకలి కోరల్లోంచి బైటపడుతుంది. ఇక చెరుకును ఎథనాల్ ఉత్పత్తికి మళ్ళించడం వలన దేశంలో భూవినియోగం ఆహారధాన్యాల ఉత్పత్తి వైపు నుండి చెరుకు పంట వైపు మళ్ళుతుంది. పర్యవసానంగా దేశంలో తలసరి ఆహారధాన్యాల లభ్యత తగ్గిపోతుంది. ఆ విధంగా తలసరి ఆహారధాన్యాల లభ్యత తగ్గిపోయినప్పటికీ, ఇంకా దేశంలో మిగులు ఆహారధాన్యాలు ఉంటాయి. ఇదెలా సాధ్యం? నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో నిరంతరం ఆహారధాన్యాల మిగులు కొనసాగుతూనే వుంటుంది. ఒకవైపు తలసరి ఆహారధాన్యాల లభ్యత తగ్గిపోయినప్పటికీ, ఈ మిగులు కొనసాగుతుంది. ఏమిటి కారణం?

ఆహారధాన్యాల నిల్వలు కనీస స్థాయికన్నా తగ్గిపోతే అప్పుడు వాటి ధరలు పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అప్పుడు ద్రవ్య పెట్టుబడి చేతుల్లో ఉండే ఆస్తుల (షేర్లు, స్టాకులు, బాండ్లు వగైరా) విలువ పడిపోతుంది. తమ ఆస్తుల విలువ పడిపోకుండా చూడాలని ద్రవ్య పెట్టుబడి ప్రభుత్వం మీద వత్తిడి పెంచుతుంది. అప్పుడు ప్రభుత్వం దేశంలో ద్రవ్య విధానాన్ని మరింత కఠినతరం చేస్తుంది. అందుకోసం ప్రభుత్వం చేసే వ్యయం తగ్గించుకుంటుంది. అదే ఆహారధాన్యాల నిల్వలు కనీస స్థాయి కన్నా ఎక్కువగా ఉన్నప్పుడు ఆ నిల్వలను తగ్గించడానికి వీలుగా తన వ్యయాన్ని పెంచే చర్యలను తీసుకోదు. పొంతన లేని ఈ విధానాల వలన

సాధారణంగా దేశంలో ఎప్పుడూ ఆహారధాన్యాల మిగులు కొనసాగుతూనే వుంటుంది (ప్రజల ఆకలి తో నిమిత్తం లేకుండా).


ఒకవేళ ఆహారధాన్యాల నిల్వలు కనీస స్థాయికన్నా తగ్గిపోతే ఆ పరిస్థితిని అధిగమించడానికి రెండు దారులు ఉన్నాయి. మొటిది: ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచడం. దానివలన సరఫరా పెరుగుతుంది  అప్పుడు మళ్ళీ నిల్వలు పెరుగుతాయి. ఇక రెండో మార్గం: డిమాండును తగ్గించడం. అందుకోసం ప్రభుత్వం వ్యయాన్ని తగ్గించడం, ద్రవ్య విధానాన్ని మరింత కఠినతరం చేయడం. ఈ చర్యలు ప్రజల కొనుగోలుశక్తిని తగ్గించడానికి దారితీస్తాయి. ఈ రెండో మార్గాన్ని అనుసరించడమే ప్రభుత్వానికి తేలిక. మొదటి మార్గంలో ఫలితాలు రావడం ఆలస్యం అవుతుంది. అందుకోసం అవసరమైన అదనపు ప్రభుత్వ పెట్టుబడిని పెట్టడానికి కూడా సమయం పడుతుంది. ఈ కారణాల వలన నయా ఉదారవాద వ్యవస్థలో ప్రజల కొనుగోలుశక్తి పడిపోతూనే వుంటుంది. తలసరి ఆహార ధాన్యాల ఉత్పత్తి, దానితోబాటు తలసరి ఆహారధాన్యాల లభ్యత కూడా పడిపోతూ వుంటుంది. దాని పర్యవసానంగా ఆకలి తీవ్రత పెరుగుతూ వుంటుంది.

అంటే ఒకవైపు తలసరి ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోతున్నా, తలసరి ఆహార ధాన్యాల లభ్యత పడిపోతున్నా, ఆకలిగొన్న ప్రజల సంఖ్య పెరుగుతూ వున్నా, ఇంకోవైపు ఆహారధాన్యాల నిల్వలు పెరుగుతూనే వుంటాయి. నయా ఉదారవాద పాలనలో మిగులు ఆహార ధాన్యాల నిల్వలు ఉండడం అనేది ప్రజలలో ఆకలి లేకపోవడాన్ని సూచించదు. వాస్తవానికి నయా ఉదారవాద విధానాల వలన ఆకలి గొనే ప్రజల సంఖ్య పెరగడంతోబాటు ఆహార నిల్వలు కూడా పెరుగుతాయి. ఆహారధాన్యాలను బయో ఇంధనాల ఉత్పత్తికి మళ్ళిస్తే అందువలన ఈ పరిస్థితి మరింత జటిలమౌతుంది. బియ్యానికి బదులు చెరుకును ఎథనాల్ తయారీకి వినియోగించినా, దాని వలన భూ వినియోగంలో వచ్చే మార్పు వలన తలసరి ఆహారధాన్యాల లభ్యత ఇంకా తగ్గుతుంది.

బియ్యాన్ని, చెరుకును ఎథనాల్ తయారీకి మళ్ళించాలని మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అటు తలసరి ఆహారధాన్యాల లభ్యతను తగ్గించడమే గాక ఇటు ప్రజల ఆకలినీ పెంచుతుంది. ఒకసారి ఈ మళ్ళింపు వలన ఆహారధాన్యాల నిల్వలు కనీస స్థాయి కన్నా తగ్గడం మొదలవగానే ప్రజల కొనుకోలు శక్తిని మరింత తగ్గించడం మొదలౌతుంది. తద్వారా ఆహారధాన్యాల నిల్వలు కనీస స్థాయి కన్నా పడిపోకుండా నిలబెట్టుకోవడం జరుగుతుంది. అప్పుడు ఆకలిగొన్న ప్రజల సంఖ్య మరింత పెరుగుతుంది.

ఈ విధానం పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. సంపన్న దేశాలలో పర్యావరణహిత ఇంధనం పట్ల ఆసక్తి పెరిగింది. అక్కడి అభ్యుదయవాదులు సైతం దానిని ఆహ్వానిస్తున్నారు. నిజమే. కాని ఆ సంపన్న దేశాల విధానాన్ని, దాని పర్యవసానాలతో నిమిత్తం లేకుండా మన వంటి మూడవ ప్రపంచ దేశాలలో అమలు చేయబూనుకోవడం వినాశకర ఫలితాలకు దారితీస్తుంది. దేశ ప్రజల ఆకలి తీవ్రతను పెంచుతుంది. ■

## జాడలు



**క**లుసుకోలేని.. అవనీ ఆకాశాల బెంగను
దృశ్యమానం చేస్తున్నపుడు
నువ్వు నడుస్తుంటావు
ఏ ఆవలి తీరం లాగుతుందో
ఏ వర్తమానం నెట్టేస్తోందో

దిగంతాల దాకా సాగిన
ఆ అడుగులెన్నడూ అలసిపోవు
వెనకే నడిచిన ఆశలెపుడూ భంగపడవు

దూరాలకు.. జాడలనిచ్చి
గమ్యానికి దారిదీపాలైన.. నీ పాదముద్రలు
భవితలోకి నిక్కి చూడని నీ నైజం..
నీవు వదిలి వెళ్తున్న
నీ అడుగుల పరిగెల్ని ఏరుకుంటూ..
మేము ఆశయాల మూటనెత్తుకుని గుండెనిండుగా
ఆత్మవిశ్వాసం నింపుకుని వెళ్తున్న మొదటి అడుగా..
వీరుడా ..
నీ నిర్భయ నిశ్చయ నిస్వార్థ పాదాలకు
నీరాజనాలద్దనీ..
అడ్డంకులెన్నున్నా
అనుకున్నది.. ఆవిష్కృతం అవకుండా
నీ ఆనవాళ్ళ ఆరాటం వృధా కాదు
ఇక్కట్ల ఇసుకలోనూ
ఆ కాళ్ళ స్థైర్యం వదిలి పోదు
జనహితంగా సాగిన
ఆ నడకల కిదే వందనం..!

**- దారల విజయ కుమారి**
**91771 92275**



# మార్పు కోసం...

- డాక్టర్ కాళ్ళకూరి శైలజ
98854 01882

**కా**ళ్ళు ఒత్తి ఒత్తి చేతులు నొప్పెట్టేయి
వెనుక బాటున నడిచి నడిచి మెడ ఒంగిపోతోంది
కంచె పేరు చెప్పి ఆంక్షల వలయంలో
తొక్కిపెట్టిన మా ఆశలు
కుళ్ళిన వాసన ఊపిరాడనీయట్లేదు.

'సగభాగం' వట్టి మాటై
కేటాయింపుల ముద్ద చప్పగా మారింది
పూల దండలంటూ చుట్టిన సంకెళ్లు
రోజూ చేసే గాయాల నొప్పిని
ఇంకా భరించే ఓపికస్సలు లేదు

అణిగి మణిగి ఉండమంటూ
ఏ మెట్టెక్కడ ఎక్కి దిగాలో
ఏ కాగితమ్మీద ఎలా సంతకం చేయాలో
నెత్తిన రుద్దే 'నీతి' సహించే సమయం దాటిపోయింది

కథలో రాజకుమారిని చూపి బుజ్జగిస్తే
కాబోలని నమ్మే కాలానికి సెలవు!


రాజుల రణరంగ బీభత్సం నుంచి
అధికార కుతంత్రం వరకూ
అన్నీ చూసాక
చేతికందినదేదీ నోటికందనీయరన్న
నిజం పూర్తిగా తెలిసింది!

ఎర వేసి ఆడతనాన్ని కొనే ఎత్తుగడలన్నీ
మరో తరానికి హింసను బోధిస్తున్న కుట్రలే!
అత్యాచారాల నడుమ కూడా
'అంతా బాగానే ఉంద'న్న అందమైన అబద్ధం
విషపు గుళిక మీద చక్కెర పూత!
పూలు చింపి ముళ్ళు పెంచుకుంటూ పోతే
బీడు కాక మిగిలేదేముంది?

దశాబ్దాలు దాచిన రాజదండం తుప్పు వదిల్చి
కుర్చీ డాంబికాలను కూల్చి
దారి తప్పిన సంఘానికి
అమ్మప్రేమ చద్ది తినిపించాల్సిన సమయమిది!
గోరుముద్ద చవికి బాధ్యతల
మిర్చి ఘాటు అద్ది అందించాల్సిందే!

(చట్టసభల్లో మహిళల రిజర్వేషనుపై
ఆలస్యం గురించి)

■






# కవిత దారి పట్టిన నాగేంద్ర

- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

94402 22117

**"కవిత్వం రాయనప్పుడు**
**వెక్కిరిస్తోంది నన్ను / గూట్లోని 'జ్ఞాపిక'**
**(నాగేంద్ర రాసిన 'నానీ')**

'పెద్ద మనుషులు' సినిమా తీసింది వాహినీ సినీ స్టూడియోస్ అనే సంస్థ. అప్పటి నుంచీ 'వాహిని వారి పెద్దమనుషులు' అనే పేరు రూఢి అయ్యింది. 'షావుకారు' సినిమాలో నటించిన జానకి 'షావుకారు జానకి'గా ప్రసిద్ధులయ్యారు. 'సిరివెన్నెల' సినిమాకు పాటలు రాసిన సీతారామశాస్త్రి 'సిరివెన్నె సీతారామశాస్త్రి'గా పేరుపొందారు. 'వందేమాతరం' సినిమాలో అదే పేరుతో ఉన్న పాటను పాడిన శ్రీనివాన్ 'వందేమాతరం శ్రీనివాన్'గా ప్రసిద్ధులయ్యారు. 'అంపశయ్య' నవల రాసిన నవీన్ 'అంపశయ్య నవీన్'గా ప్రాచుర్యం పొందారు. ఈ వరుసలో అనంతపురంలో డా॥ ఎ.ఎ.నాగేంద్ర 'మన నానీలు' రాసి 'నానీల నాగేంద్ర'గా ప్రచారంలోకి వచ్చాడు. బహుశా రాయలసీమలో తన రచనతో ప్రసిద్ధుడైన రచయిత ఈయనే కావొచ్చు.

డా॥ ఎ.ఎ. నాగేంద్ర సామాజిక శాస్త్రం, సాహిత్యం రెండూ చదువుకున్న విద్యార్థి. నా కవిత్వం, సాహిత్య విమర్శల మీద పరిశోధించాడు. అనంతపురం జిల్లా 'అరసం' శాఖకు ప్రధాన కార్యదర్శిగా ఉన్నాడు. నిరంతరం సాహిత్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, రాయలసీమ నుంచి వచ్చిన సాహిత్య విమర్శను చారిత్రక అధ్యయనం చేస్తున్నాడు పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా. నాగేంద్ర అత్యంత సాధారణమైన దళిత కుటుంబంలో పుట్టి చదువుకొని సాహిత్య సంస్కారాన్ని ఒంట బట్టించుకున్నాడు.

సాహిత్య విమర్శ మీద పరిశోధన చేసినా, నాగేంద్రది కవి హృదయం. 'మన నానీలు' తర్వాత కూడా కొన్ని 'నానీ'లు రాశాడు. ఇటీవల తన తండ్రి కరోనా బారిన పడి మరణించినప్పుడు నానీల స్మృతి కావ్యం రాశారు. మరికొన్ని కవితలు రాశాడు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో తెలుగులో కవిత్వ రచన భారీ పరిశ్రమగా మారిపోయినా, నాగేంద్ర తన కవిత్వాన్ని కుటీర పరిశ్రమగానే ఉంచుకున్నాడు. నాగేంద్ర మాటల్లోనే కాదు, రచనల్లోనూ పరిమితంగానే ఉంటాడు.

నాగేంద్రకు సమసమాజం, సామాజిక న్యాయం రెండు స్వప్నాలు. వీటి సాధన కోసం ప్రశ్నించడం, తిరుగుబాటు అనివార్యమని నాగేంద్రకు తెలుసు. పల్లెలన్నా, ప్రజలన్నా పరమప్రీతి. వీటిని ధ్వంసం చేస్తున్న ప్రపంచీకరణపైన కోపం, కష్టపడేవాళ్ళ మీద ప్రేమ, కష్టపెట్టే వాళ్ళమీద ద్వేషం. దేనినైనా తార్కిక, విమర్శనాత్మక దృష్టితో వివేచించే స్వభావం. గ్రామాన్ని ప్రేమిస్తూనే అక్కడి కుల వివక్షపైన ఆగ్రహం. పేదల పట్ల అనుకూల దృష్టి. తెలుగు భాష పట్ల మమకారం. ఈ లక్షణాలన్నీ కలిసి నాగేంద్రను అభ్యుదయ కవిగా రూపొందించాయి. మార్క్సిజం, అంబేద్కరిజాలను నాగేంద్ర అర్థం చేసుకుంటున్నాడు. సమన్వయం చేసుకుంటున్నాడు. భారతీయ సమాజానికి – అంటే భారతదేశ విముక్తికి ఈ సమన్వయం నేటి అవసరం.

సమసమాజం మిథ్య అని, మార్క్సిజానికి కాలం చెల్లించదని పెట్టుబడిదారీ సమాజం గత ముప్ఫై ఏళ్ళ నుంచి కోడై కూస్తున్నది. భారతదేశంలోని పాలకవర్గం, మార్క్సిస్టేతర ప్రజాతంత్రవాదులలో కొందరు మార్క్సిజం భారతదేశానికి

సరిపోదని ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనూ నాగేంద్ర ...

**"సమ సమాజం నిర్మించాలంటే**
**గోడలు కట్టాల్సిన పని లేదు**
**మన మధ్య ఉన్న అసమానత గోడల్ని**
**పగల గొడితే చాలు/ సమ సమాజం**
**కళ్ళముందు ఆవిష్కరింపబడుతుంది."** (సమ సమాజం)

అని సమసమాజ ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నాడు. దీని కోసం జనమంతా ఏకం కావాలని పిలుపునిస్తున్నాడు.

**"పేదరికం, నిర్లక్షరాస్యత, అస్పృశ్యత**
**లేని సమాజం కోసం**
**నడుం బిగించాల్సింది మనమే" (పైది)**

"తిరుగుబాటు చేద్దాం రండి" కవితలో, మధ్య పాలకుల మాటలకు, చేతలకు గల వైరుధ్యాన్ని ఎత్తిచూపి కుల వ్యవస్థ నిర్మూలనకు పిలుపునిచ్చాడు నాగేంద్ర.

**"సాలెపురుగులా అసమానతలను అల్లుతూ**
**దొంతరల, అంతరాలు సృష్టిస్తూ**
**హైందవ సంస్కృతికి ఊపిరిపోస్తున్న**
**కులాల కుళ్ళును**
**సమ సమాజ చైతన్యంతో/ దళితబాట సాక్షిగా**
**కలాలతో తిరుగుబాటు చేద్దాం రండి."**

అన్నది కవి పిలుపు. **'సమసమాజం', 'తిరుగుబాటు చేద్దాం రండి.'** ఈ రెండు కవితలూ నాగేంద్రలోని దేశీయ మార్క్సిజానికి అంటే అంబేద్కరిజాన్ని సమన్వయించుకొన్న మార్క్సిజానికి నిదర్శనం.

ప్రగతిశీల కవికి శ్రామిక జనమే వస్తువు. కష్టజీవుల జీవితవాస్తవికత అభ్యుదయ కవికి వస్తువు. నాగేంద్ర తన వస్తుసేకరణలో ఈ మార్గంలోనే ప్రయాణిస్తున్నాడు. గ్రామాల్లో దళితులు, పట్టణాల్లో ఇంటి పనిచేసే అమ్మాయిలు, ఇంట్లోకి పేపర్ విసిరేసే అబ్బాయిలు, ఫీజులు కట్టి పిల్లల్ని చదివించుకోడానికి ఇబ్బంది పడే తల్లిదండ్రులు, కార్పొరేట్ విద్యాగ్నిలో సమిధలౌతున్న బాలలు, తిండిలేక అల్లాడుతున్న ముదుసల్లు ... ఇవీ నాగేంద్ర కవిత్వంలో కనిపించే వస్తువులు.

పట్నం నుంచి పల్లెకు పోయిన వ్యక్తికి గ్రామ ప్రజలు కరెంటు ఛార్జీలు కట్టలేదని గ్రామానికంతా కరెంటు సప్లై ఆపేయగా, చీకట్లో నిద్రపోతున్న పల్లె కనిపించింది. (పల్లె నిదురపోతున్న వేళ) కథనాత్మక భావచిత్రాలు లేకపోయినా ఈ కవితలోని కథనమే దీన్నొక కవితగా మార్చింది. ఒక వాస్తవికతను వాస్తవికంగా కథనం చేసిందీ కవిత. ఇంటిపని మనుషులు, రాత్రి నగరాల్లో గస్తీ తిరిగే గూర్ఖాలు, పొద్దున్నే వీధులు శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు, పేపర్‌బాయ్‌లు – వీళ్ళ మీద ఇదివరకే చాలా కవితలు వచ్చాయి. కవులు తమ తమ అనుభవాల నుంచి వీళ్ళమీద కవితలు రాశారు. నాగేంద్ర పని మనిషి అయిన అమ్మాయిని 'ఆత్మబంధువు' అని వర్ణించాడు. ఆమె ప్రతి ఉదయం 'సూర్యుని కొప్పులో ముడుచుకు' వస్తుందట. పూలు కొప్పులో ముడుచుకు వచ్చే స్త్రీలున్నారు. సూర్యున్ని కొప్పులో ముడుచుకు రావడమంటే పనిలో చురుకుదనమని అర్థం. చైతన్యానికి ప్రతీక సూర్యుడు. జరుగుబాటున్న వాళ్ళ ఇంటి బద్ధకాన్ని పని అమ్మాయి ఎలా విదిలిస్తుందో నాగేంద్ర బాగా వర్ణించాడు. ఆ అమ్మాయి కేవలం పని మనిషే కాదు. ఆ ఇంటిలో భాగమై పోతుంది. అందుకే 'ఆత్మబంధువు'.

**"ఒక్కరోజు/ ఆమె రాకపోతే**
**ఇల్లు మౌనంగా రోదిస్తుంది**
**అప్పుడు/ ఆ ఇంటిని సముదాయించడం**
**ఎవరితరమూ కాదు."**

మధ్య తరగతి వారి జీవితం పేదలైన పని మనుషుల మీద ఎంతగా ఆధారపడి ఉందో ఈ ఖండిక చెబుతున్నది. పేపర్‌బాయ్‌లు రోజూ మన ఇండ్లకు వస్తుంటారు. పేపర్ విసిరేసి పోతుంటారు. పేపర్ బిల్ చెల్లించే సందర్భంలో కూడా రేపురా, ఎల్లుండిరా అన్నా కానీ వారు ఏమీ మాట్లాడరు. మౌనంగానే వెళ్ళిపోయి ఎప్పుడు రమ్మంటే అప్పుడే వస్తారు. అదొక మౌన సంబంధం. ఈ సంబంధాన్ని నాగేంద్ర రాయలసీమ ప్రకృతిని ఆపాదించి వర్ణించాడు.

**'మౌనమే కాని/ మాటల వర్షం కురిపించని**
**మా సీమ మేఘం వంటి వాడు'** (పేపర్‌బాయ్)

భావుకతలో స్థానికత ఇలా ఉంటుంది. పేపర్‌బాయ్‌ని 'సమాచార శ్రామికు'డని అనడం కొత్తగా ఉంది.

ప్రైవేటీకరణలో ప్రధానంగా కార్పొరేట్ విద్యావ్యవస్థ – ఇది వ్యాపార వ్యవస్థగా మారిపోయింది. పాఠశాల స్థాపనకు చట్టాలు బాగానే ఉన్నాయి. అవినీతి పాలనతో చట్టాలు లంచగొండుల చుట్టాలైపోయాయి. గాలి, వెలుతురు లేని బాడుగ ఇండ్లలో విద్యాసంస్థలు పెట్టి, కోళ్ళఫారాలలాగా నడుపుతున్నారు. సరైన రక్షణ ఏర్పాట్లు ఉండవు. కొన్నేళ్ళక్రితం 2004లో తమిళనాడులో ఒక పాఠశాలలో అగ్నిప్రమాదం జరిగి అనేకమంది బాల విద్యార్థులు చనిపోయారు. ఈ దుర్మార్గం మీద నాగేంద్ర 'నేలరాలిన నింగి చుక్కలు' కవిత రాశాడు.

**"డబ్బే ప్రపంచమైన ఈలోకంలో**
**దాబా పైకప్పు మాత్రం తాటాకు పట్టలే**

**డొనేషన్లకు కొదువలేదు**

**కనీస వసతులకు స్థానం లేదు."**

అగ్నిజ్వాలలు దహించి వేస్తుంటే గుంపులుగా పిల్లలు మెట్లు దిగలేక మంటలకు ఆహుతి అవుతున్న దృశ్యాన్ని కవి ఆర్ద్రంగా, ఆవేదనగా చిత్రించాడు.

గ్రామాలను కాల్పనిక సాంస్కృతిక దృక్పథంతో భావకవులు వర్ణించారు. ఆర్థిక, శ్రామిక దృక్పథంలో అభ్యుదయ, విప్లవ రచయితలు చిత్రించారు. అస్తిత్వ వాదులు సాంఘిక వర్గ దృక్పథంలో చిత్రించారు. ప్రపంచీకరణ వ్యతిరేక రచయితలు పర్యావరణ, మానవ సంబంధాల దృష్టిలో గ్రామాన్ని ఆవిష్కరిస్తున్నారు. నాగేంద్ర 'నా పల్లె' ఈ దృష్టితో రాశాడు. ప్రపంచీకరణ వల్ల మానవజీవితంలో మనిషి కన్నా సంపదకు విలువ పెరిగి మానవసంబంధాలలో కృత్రిమత ప్రవేశించిన వాస్తవాన్ని కవి అధిక్షేపించాడు.

**"మాటలన్నీ పొడిపొడిగా రాలుస్తూ**

**నవ్వులన్నీ కృత్రిమంగా కురిపిస్తూ**

**బంధాలన్నింటినీ తెగతెంపులు చేసుకొని**

**కాలుతెగిన ఒంటెలా ఉంది నా పల్లె."**

ప్రపంచీకరణ కాలంలో రైతుల అప్పులు పెరగడం, రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం, చేతివృత్తులు విధ్వంసం కావడం వంటి పరిణామాలను విమర్శనాత్మకంగా కవి ప్రస్తావించాడు. ఈ కవితలో 'అస్తిత్వం కోల్పోయిన పల్లె' ప్రపంచీకరణ ఫలితమే!

తెలుగు భాషాభిమానం ఇవాళ ఒక ఫ్యాషనైపోయింది. తమ పిల్లల్ని కార్పొరేట్ పాఠశాల్లో ఆంగ్లమాధ్యమంలో చదివిస్తూ తెలుగును గురించి ఊరికినే వగచడం (అగ్నిహోత్రావధాని మాటల్లో) చాలామందిలోని ద్వంద్వవైఖరి. నాగేంద్ర అసలైన తెలుగుభాషా ప్రియుడు.

**"ఎవరో మా ఊరు కాని వాడు**

**మా బడి మీద కన్నేశాడు**

**ప్రైవేటీకరణ వల విసిరి**

**అక్షరాల రూపురేఖల్ని మార్చేశాడు."**

అని తెలుగుభాషా శత్రువును అన్వేషించాడు. భాష పరాయీకరణను గుర్తించాడు. మాతృభాషా హంతకులు ఒకవైపు, పరాయిభాషా ప్రేమికులైన మేధావులు మరోవైపు తెలుగును చంపుతున్నారు. ఈ వ్యవస్థమీద నాగేంద్ర విమర్శ పెట్టారు. 'నామాతృభాష' కవితలో.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 'ప్రత్యేక హోదా' ఒక పెద్ద ఆశయంగా ఉంది. నాగేంద్రకు కూడా ప్రత్యేక హోదా మీద గొప్ప అభిప్రాయం ఉన్నట్లుంది. ఉగాది పండగకి స్వాగతం పలుకుతూ ...

**"మా జీవితాల్లో/ కొత్త కాంతులు నింపుతావు కదా!**

**మా ప్రధాని తెచ్చినట్లు**

**పిడికెడు మట్టి/ చెంబుడు నీళ్ళతో**

**చేతులు దులుపుకోవు కదా!**

**ప్రత్యేక హోదా తెస్తావు కదా!**

**మా కళ్ళల్లో ఆనందం నింపుతావు కదా!"** అని ఆశాభావాన్ని ప్రకటించాడు.

ఆత్మవిమర్శ ఒక గొప్పలక్షణం. ఇది లేకనే చాలామంది పరనిందారోగంతో బాధపడుతుంటారు. కవి ఎంత విమర్శకుడో అంత ఆత్మ విమర్శకుడు కావాలి. ఆత్మవిమర్శకు అద్దం ఒక సాధనం. మనల్ని గురించి మనం ఎంతగా చెప్పుకున్నా, అద్దం మన నిజాన్ని బైట పెడుతుంది. నాగేంద్ర 'హృదయరాగం' పేరుతో ఆత్మ విమర్శకు అరుదైన అద్దం మీద కవిత రాశాడు.

**"అద్దం ముందు నిలబడటమంటే**

**న్యాయదేవత ముందు నిలబడ్డట్టే"**

అందమైన, అర్థవంతమైన వాక్యం ఇది. స్త్రీలు అద్దం ముందు అలంకరించుకోనే క్రమంలో వాళ్ళ అసలు రూపాన్ని కూడా తెలుసుకుంటారు. నాగేంద్ర ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని

**"మనిషి కంటే/ మనసులేని అద్దం నిజాయితీ**

**ఆమెకిష్టం**

**అద్దంలోకి చూడాలంటే/ ఆత్మసౌందర్యం**


**అందనంత ఎత్తులో ఉండాలి."** అన్నాడు. ఇదొక కవిత్వ వాక్యం. అద్దం ఫిలాసఫీ నాగేంద్రకు బాగా అర్థమైంది.

**"అద్దం/ అందాన్నే కాదు**

**అంతర్లోకాన్ని కూడా ఆవిష్కరిస్తుంది"** అన్నాడు.

నాగేంద్ర ఆరోగ్యకరమైన కవిత్వ మార్గంలోనే నడుస్తున్నాడు. ఇప్పటికి వేసింది ఒకటి రెండు అడుగులే. నడవాల్సింది చాలా ఉంది. ఇప్పటికీ సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతకు కారణాలను గుర్తించడంలో సరైన పద్ధతిలోనే ఆలోచిస్తున్నాడు. సామాజిక పరిణామాలు, వర్తమాన రాజకీయ ధోరణుల పట్ల ఇంకా బలమైన విమర్శనాత్మక దృష్టిని అలవరచుకోవాలి. సమాజం పట్ల సమాజంలో నష్టపోయిన వాళ్ళ పట్ల నాగేంద్ర నిబద్ధత నిఖార్సైనది. ఈ యువకవి కవిత్వ ప్రమాణం అర్థవంతంగా సాగాలని కోరుకుంటున్నాను. ■

## కవిత



# కాలుతున్న సిగరెట్ సాక్షి

- పల్లిపట్టు
99894 00881

దేశమెప్పుడూ అలాగే నడుస్తుంది బ్రో
కదలిక లేని మెదళ్ళ పొదల్లో నక్కి నక్కీ
మక్కిన బుర్రల మాటల గారడీల వలలో చిక్కి
ఇట్ ఈజ్ గోయింగ్ ఆన్ బ్రో..!

మందుతాగుతూ నువ్వూ నేనూ
మతం తాగుతూ దేశం
కొంచెంకొంచెం మార్చురీ గదిలా మారుతున్న చిత్రం
కాల పురుషుడు గీస్తున్నా
రాజకీయ సంకలకింద కుళ్లుతున్న దేశం బొమ్మ
నిషా ఎక్కిన నీ జబ్బుకళ్ళకు కనిపించదంతే..!

◆ ◆ ◆

ఇప్పుడు ఇలాగే సాగుతోంది బ్రదర్.!
కాలం వేళ్ళమధ్య కాలుతున్న సిగరెట్ సాక్షిగా
ఉఫ్ ఉఫ్ అంటూ రింగులు తిరుగుతున్న రింగురోడ్లు వారగా
ముసలి మంచు మరీ చేదస్తంగా
ముక్కుల్లో చెవుల్లో దూరి గొణుగుతూ ఉంది
కఫం పట్టి మూలుగుతూ చెట్లు
కాఫ్ పట్టి రొప్పుతూ ఊళ్ళు

ఊళ్లే... అచ్చం మన ఊళ్లే
ఇంటర్వెల్లో లగెత్తుకెళ్లి లాగు తీసి ఆనందంగా
ఉచ్చబోసుకున్న మన సొంత కాల్వగట్ల ఊళ్లే
ఇప్పుడు ఇలా దేవుడు మూత్రంలో తడిసి
భక్తిలో నాని ఉచ్చగంతుకొడుతున్నాయి.!

◆ ◆ ◆

మై డియర్ ఫాల్స్ ఫ్రెండ్
ఫ్రెండ్షిప్ మాస్కు తొడిగి కుట్రలు చేయడంలోనే బిజీ కాకు
బానిసపు తలపైకెత్తి తాగుబోతు కాలాన్ని చూడు
మత్తెక్కిన ఫ్యాన్స్ బ్యానర్ల విషపుగాలికి తూగుతూ
నడ్డిరిగిపోతున్న నవతరాన్ని చూడు
డ్రంక్ అండ్ డ్రైవింగ్ మాత్రమే కట్టడి చేసి
దేశాన్ని కాపాడటంలో కుస్తీ పడుతోంది.!

బార్లు తెరిచిన ఊర్లతో నష్టం లేదట
బోర్లా పడ్డా బతుకులకు గ్యారంటీ కాదంట
కాస్ట్ హిపోక్రసీ కంట్రీలో ఇట్ ఈజ్ కామన్ కదా బ్రో..!

◆ ◆ ◆

నీకెక్కదులే ఏదీ..
మన అక్కను ఏ ఆధిపత్యపు కుక్క పిక్కలపై కరిచినా
నువ్వు అరవలేవూ నువ్వు కరవలేవూ
వారెవ్వా అదే కదా నిన్నెక్కేవానికి నిచ్చెనమెట్టు

◆ ◆ ◆

మతం పెగ్గులకొద్దీ తాగి
కులం రగ్గుల కిందా జోగుతూ
సిగ్గులేని పొడి దగ్గుల రాజకీయాల దేశాన
అంతకు మించి ఏం ఎక్స్పెక్ట్ చేస్తాం డ్యూడ్..!
ఇట్ ఈజ్ గోయింగ్ ఆన్..!!

◆ ◆ ◆

అగ్గిపెట్టి అందుకో
నిన్ను తగలబెట్టు నాకు నిప్పు బెట్టుకుంటా
నోరుండి కళ్ళుండి కూడా తినే మనుషులమై యుండి
ఇదన్యాయమని మాట్లాడలేనోళ్లం
ఉంటే యంత పోతే యంత..!?

◆ ◆ ◆

దేశమిలా అయిపోయిందని డైలాగులొద్దు
దేశాన్ని తెగ ఉద్ధరిస్తున్నట్టు డ్రామాలాడొద్దు
దేశమట్టి బతుకుల్ని మట్టిగలిపే మోసం భరించలేక
హై బిపిలో నినదిస్తోంది దేశపు గుండెకాయ
ఆక్రోశాల బ్లేడ్సెల్స్‌కి రెడ్ సెల్యూట్ చెయ్యకుండా
కనీసం నీ చేతులైనా కలపకుండా
దేశభక్తి ప్రేమ నటించొద్దు బ్రో మండిపోతావుంది.!

◆ ◆ ◆

మళ్లీ మళ్లీ చెబుతున్న బ్రో..!
దేశభక్తి నాటకాలొద్దే వద్దు
దేశంలో
శానామంది శానా శానా మండిపోయున్నారు.! ■




ఫోటోలో వరుసగా రచయితలు ఓట్ర ప్రకాశరావు, మూరిశెట్టి గోవింద్, కృష్ణస్వామి రాజు, పిళ్ళా కుమార స్వామి, ఏ.వజ్రవేలు రెడ్డి, ఎస్.విజయులు రెడ్డి, ఏ.మల్లేశ్వర రావు, టి.రాజశేఖర రెడ్డి, సి.దశరధుడు ఉన్నారు.

# బాలల మనో వికాసానికి బాలసాహిత్యం

**ఆర్.** సి.కృష్ణస్వామిరాజు రాసిన రాణిగారి కథల పుస్తకాన్ని చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో 8.10.2021న ఆవిష్కరించారు. ఈ సభకు ఆ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వజ్రవేల్ రెడ్డి అధ్యక్షత వహించారు. బాలల చిన్నప్పుడు ఏవైతే వారి మనసులో నాటబడతాయో అవి పెద్దయ్యాక కూడా ఆచరిస్తారని, కాబట్టి బాల్యంలోనే వారికి కథల ద్వారా మంచి విషయాలను బోధించాలని ఆయన కోరారు. పుస్తక ఆవిష్కర్త డా. విజయులు రెడ్డి మాట్లాడుతూ, ఈ పుస్తకంలోని కథలు పిల్లలను చదివింప చేస్తాయని, ఇందులో నీతి, వ్యక్తిత్వ వికాసం హాస్య కథలు ఉన్నాయని అన్నారు. పిల్లలు బాల్యంలోనే కథలను చదవడం ద్వారా వారు బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దబడుతారని అన్నారు. పుస్తక సమీక్షకులు, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిళ్లా కుమారస్వామి మాట్లాడుతూ బాల సాహిత్యం బాలల మనోవికాసానికి దోహదం చేస్తుందన్నారు. కృష్ణస్వామి రాజు చిన్న పిల్లల కోసం రాజుగారి కథలు, రాణి గారి కథలు రాశారని, అవన్నీ పిల్లల భావ వికాసానికి తోడ్పడతాయని అన్నారు. ఈ కథలు మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచే విధంగా ఉన్నాయని అన్నారు. కాబోయే ఉపాధ్యాయులు వీటిని చదివి పిల్లలకు చెపితే పిల్లల్లో పఠనాసక్తి పెరిగి తెలుగు భాష అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఆత్మీయ అతిథి ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు మల్లేశ్వర రావు మాట్లాడుతూ... పిల్లలు ఇలాంటి పుస్తకాలు చదివితే వికాసంతో పాటు సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు. రచయిత కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ పిల్లల్లో మనోవికాసం కలిగించడానికే బాలసాహిత్యం రాశానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైట్ జిల్లా రిసోర్స్ యూనిట్ అధికారి డాక్టర్ టి.రాజశేఖర రెడ్డి, తెలుగు లెక్చరర్ సి.దశరధుడు, రచయితలు పేట యుగంధర్, మూరిశెట్టి గోవింద్, ఓట్ర ప్రకాశరావు, అధ్యాపక బృందం, టీచర్ ట్రైనీలు, ప్రభాకర రాజు తదితరులు పాల్గొన్నారు.

# గార్లపాటి పురస్కారాలు ప్రదానం



**తిరుపతి రాస్ భవనంలో 12.10.2021న** విశ్వశ్రీ సాహితీ సమాఖ్య నిర్వాహకులు ఆచార్య గార్లపాటి దామోదరం నాయుడు సాహితీ వేత్తలకు పురస్కారాలు అందించి సత్కరించారు. గార్లపాటి సిద్ధమ నాయుడు పురస్కారాన్ని కవి అడిగోపుల వెంకటరత్నంకి, గార్లపాటి మునస్వామి నాయుడు పురస్కారాన్ని రచయిత ఆర్‌సి కృష్ణస్వామి రాజుకు, గార్లపాటి నారాయణమ్మ పురస్కారాన్ని గంగవరపు శ్రీదేవికి, గల్లా చలపతి పురస్కారాన్ని చలంకోట బురుజు మునస్వామికి అందజేశారు.

# 'ఇచట దుమ్ము దులపబడును' ఆవిష్కరణ

రచయిత, అధ్యాపకుడు కవితశ్రీ రచించిన 'ఇచట దుమ్ము దులపబడును' సాహిత్య విమర్శాగ్రంథం ఆవిష్కరణ గూగుల్ మీట్ వేదికగా 22 అక్టోబర్ 2021న జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ అధ్యక్షత వహించారు. కవితశ్రీ లాంటి యువ విమర్శకులు సాహిత్యరంగంలో రాణించటం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి పుస్తకావిష్కరణ చేశారు. తరువాత తెలుగులో సాహిత్య విమర్శ పూర్వపరాలను వివరించారు. తన తరం తర్వాత కవితశ్రీ లాంటి యువకులతో కొత్త తరం తయారవుతుందని, విమర్శ అనేది కత్తిమీద సాములాంటిదని అన్నారు. ప్రముఖ మార్క్సిస్టు విమర్శకులు డాక్టర్ ఎ.కె ప్రభాకర్ పుస్తకాన్ని సమీక్షిస్తూ... కవితశ్రీ బడుగు జీవుల పక్షాన నిలబడి సాహిత్యాన్ని మదిస్తున్నారని, మార్క్సిస్టు విమర్శా సూత్రాలకు కట్టుబడి సూత్రీకరణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కవితశ్రీకి ప్రత్యేకమైన శైలి, దృక్పథం ఉన్నాయని, అతి తక్కువ కాలంలో ఎక్కువ వ్యాసాలు రాయగలిగారని అన్నారు. విమర్శతో కొంత ప్రాదేశిక పరిధిలో ఉన్నదని, అయినప్పటికీ మార్క్సిస్టు దృష్టికోణం కారణంగా సార్వజనీనత ఉన్నదని పేర్కొన్నారు. కేశవరెడ్డి గారి అతడు అడవిని జయించాడు, సిటీ బ్యూటిఫుల్ నవలల్ని పూర్వ విమర్శకులు తడమని కోణాల్లో ఆవిష్కరించారని, బండి నారాయణస్వామి శప్తభూమి, గద్దలాడతండాయి, కొలకలూరి ఇనాక్ గారి రంధి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి ఒంటరి, కెఎన్ మల్లీశ్వరి గారి నీల లాంటి నవలల్ని, జంధ్యాల రఘుబాబు గారి నెర్రెలు, పి.శ్రీనివాస్ గౌడ్ గారి ధైర్యవచనం కవితా సంపుటాలను ఇతర విమర్శకులు చూడని రీతిలో విశ్లేషించారని వివరించారు. కవితశ్రీ కరోనాపై, పౌరసత్వ చట్టంపై, అలాగే రైతు ఉద్యమంపై వచ్చిన సమకాలీన కవిత్వాన్ని కూడా సమర్థవంతంగా విశ్లేషించారని అన్నారు. ఆఖర్లో రచయిత కవితశ్రీ తన స్పందన తెలియజేశారు. కార్యక్రమాన్ని కె.శ్రీనివాస్, సుంకర గోపాలయ్య, పెళ్ళూరి సునీల్, దోర్నాదుల సిద్ధార్థ నిర్వహించారు.




ఫొటోలో వరసగా ... ఎకె ప్రభాకర్, కవితశ్రీ, శ్రీనివాసరెడ్డి, సత్యాజీ, పల్లిపట్టు నాగరాజు, కొండేపూడి నిర్మల, జంధ్యాల రఘుబాబు, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

# ఈ 'పిల్లల ముచ్చట్లు' అందరూ వినాలి



ప్రముఖ రచయిత్రి, ఉపాధ్యాయురాలు సమ్మెట ఉమాదేవి రచించిన 'మా పిల్లల ముచ్చట్లు' పుస్తకాన్ని 3-10-2021 సాయంత్రం జరిగిన జూమ్ మీటింగ్‌లో.. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి వి లక్ష్మీ నారాయణ ఆవిష్కరించారు. శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి, ఎపి ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖాధికారి వాడ్రేవు చిన వీరభద్రుడు, ప్రముఖ కవి ఏనుగు నర్సింహారెడ్డి, విద్యావేత్త దేవినేని మధుసూదనరావు, గోళ్ళమూడి సంధ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. ఎంతో విలువైన ఈ పిల్లల ముచ్చట్లను అందరూ చదవాలని, వినాలని, ఈ పుస్తకం విద్యారంగంలో ఎన్నో మార్పులకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమాన్ని అయినంపూడి శ్రీలక్ష్మి సమన్వయం చేయగా, సమ్మెట విజయ వందన సమర్పణ చేశారు.



## ప్రజాపక్షం చౌశా కవిత్వం

మహా ప్రస్థానం, మరో ప్రస్థానం ఫేస్ బుక్ సమూహం ఆధ్వర్యంలో యువ కవి చౌశా 'ఎవరు ద్రోహి', 'రాతి తలుపులు' కవితా సంపుటాల ఆవిష్కరణ 10.10.2021న కర్నూలు లలితకళా సమితిలో జరిగింది. సాహితీ స్రవంతి కర్నూలు జిల్లా గౌరవాధ్యక్షులు గౌరెడ్డి హరిశ్చంద్రా రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. రైతు కవిత్వం 'ఎవరు ద్రోహి' పుస్తకాన్ని లలితకళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య చేతులమీదుగా, కరోనా కవిత్వం 'రాతి తలుపులు' పుస్తకాన్ని అనంతపురం జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ ఆవిష్కరించారు. 'ఎవరు ద్రోహి' రైతు కవిత్వాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సమీక్షించారు. కవి చౌశాను రైతు, పర్యావరణ ప్రేమికుడుగా పేర్కొన్నారు. ఈ పుస్తకంలోని 'రైతుపై అభాండాలు', 'దగా పడిన రైతు' అన్న కవితలు చూస్తే చౌశా రైతు పక్షపాతిగా కనిపిస్తాడని, 'ఎన్ని నాల్కలు' అన్న కవితలో ప్రభుత్వ అసలు రంగు బయటపెడతాడని అన్నారు. రైతులకు వ్యతిరేకంగా ఒక వర్గం చేస్తున్న దుష్ప్రచారాలను 'సోషల్ మీడియా' కవితలో దుయ్యబట్టారని వివరించారు.

రాతి తలుపులు కరోనా కవిత్వాన్ని పరిచయం చేస్తూ ప్రముఖ కవి, కథా రచయిత జి.వెంకటకృష్ణ పుస్తకం... పేరులోనే కాఠిన్యాన్ని చూపడం, కరోనా విషయంలో వ్యవస్థ విఫలమైందన్న విషయాన్ని తెలుపుతుందని అన్నారు. అతి సులభశైలిలోనే కాదు, సరళమైన భాష వాడినందువల్ల ఎవరికైనా ఈ కవిత్వం అర్థమవుతుందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ సమన్వయకర్తగా జరిగిన ఈ సభలో అనంతపురం జిరసం గౌరవాధ్యక్షులు ఉద్దండం చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభలో రచయితలు అజీజ్, జహీర్ అహ్మద్, విజ్ఞాన కేంద్రం బాధ్యులు జె.ఎన్.శేషయ్య, ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు బసవరాజు, ప్రముఖ కవయిత్రి కల్యాణదుర్గం స్వర్ణలత, లలితకళా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## స్త్రీవాద కవితాసంకలనం కోసం కవితల ఆహ్వానం


నెచ్చెలి పత్రిక తీసుకురానున్న అపరాజిత స్త్రీవాద కవితాసంకలనానికి మహిళల నుంచి కవితలు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 1995 నుంచి ఇప్పటివరకూ స్త్రీల సమస్యలపై రాసిన మూడు కవితలను మాత్రమే పంపాలి. పత్రికల్లో ప్రచురింపబడినవైనా సరే పంపవచ్చు. ఎప్పుడు రాసినది, ఏ పత్రికలో ప్రచురించబడింది తెలపాలి. 'నెచ్చెలి ప్రచురిస్తున్న స్త్రీవాద కవితా సంకలనం 'అపరాజిత'కు కవితలను ప్రచురించడానికి పూర్తి అనుమతి ఇస్తున్నానని, ఇతర స్త్రీవాద కవితా సంకలనాల్లో/ స్త్రీల సమస్యల మీద వచ్చిన కవితా సంకలనాల్లో ఇప్పటికే వచ్చినవి కావని, ఏ సంకలనానికి పరిశీలనలో లేవని' హామీపత్రంలో రాయాలి. కవితతో పాటు కవయిత్రి ఫోటో, వివరాలూ జతపరచాలి. కవితలు ఒక్కొక్కటి 40 పంక్తుల లోపు యూనికోడ్‌లో ఉండాలి. ఎంపిక చేసిన కవితలు 'నెచ్చెలి అంతర్జాల వనితా మాసపత్రిక'లో కూడా నెలనెలా ప్రచురింపబడతాయి. కవితలు పంపడానికి చివరి తేదీ : నవంబరు 15, 2021. కవితలకు విడిగా పారితోషికం ఇవ్వబడదు కానీ ఒక్కొక్క కవయిత్రికి ఒక పుస్తకం ఉచితంగా ఇవ్వబడుతుంది. కవితలను ఈ-మెయిలు 'అపరాజిత-నెచ్చెలి స్త్రీవాద కవితాసంకలనం' అని రాసి editor@neccheli.com, editor.neccheli@gmail.comకి పంపాలి' అని తెలిపారు.

### చిన్ని నారాయణరావు ఫౌండేషన్ – మల్లెతీగ

## కథల పోటీ ఫలితాలు

చిన్ని నారాయణరావు ఫౌండేషన్– మల్లెతీగ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీ ఫలితాలను మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ విడుదల చేశారు. ఈ పోటీలో వాసంతి (సికింద్రాబాద్) రాసిన 'రేవతి పెళ్ళి' కథ రు.8,000ల మొదటి బహుమతి గెలుచుకుంది. సృజన్ సేన్ (హైదరాబాద్) రాసిన 'లెగసీ' కథ రు.5,000ల ద్వితీయ బహుమతి, వడలి రాధాకృష్ణ (చీరాల) రాసిన 'బతుకు ఆవలి జీవితాలు' కథ రు.3,000ల తృతీయ బహుమతి గెలుచుకున్నాయి. విహారి (హైదరాబాద్) 'లోపలి ప్రపంచం', సింహ ప్రసాద్ (హైదరాబాద్) 'బిర్యాని', బాలి (విశాఖపట్నం) 'నూతిలో కప్పలు', శరత్‌చంద్ర (హైదరాబాద్) 'వెంట వచ్చునది', బళ్ళా షణ్ముఖరావు (విశాఖపట్నం) 'పరిణామక్రమం', జిల్లేళ్ళ బాలాజీ (తిరుపతి) 'మూతబడిన పార్కు', తటవర్తి నాగేశ్వరి (కొవ్వూరు) 'సత్యభామ', వియోగి (కర్నూలు) 'స్ఫూర్తి', టి.తిప్పారెడ్డి (మదనపల్లి) 'బోయకొండ బేరం' కథలు రు.1,000ల ప్రత్యేక బహుమతలకు ఎంపికయ్యాయి. జ్యూరీ ప్రత్యేక బహుమతికి శైలజామిత్ర (హైదరాబాద్) కథ 'ఆడపిల్ల' ఎంపికైంది. త్వరలో జరిగే ప్రత్యేక సభలో కథకులకు బహుమతులు అందజేస్తామని కలిమిశ్రీ తెలిపారు.







ప్రచారరంగంలో వర్గపోరాటం పుస్తకావిష్కరణ; ఫొటోలో వరసగా.. మురళీకృష్ణ, సత్యాజీ, లక్ష్మయ్య, కుమారస్వామి, తెలకపల్లి రవి, కెంగార మోహన్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ మాకినేని కిరణ్, గోళ్ల నారాయణరావు; సభలో మాట్లాడతున్న తెలకపల్లి రవి, డాక్టర్ సుధాకర్





సాహిత్యంలో విప్లవం పుస్తకం తొలి కాపీని తెలకపల్లి ద్వారా అందుకుంటున్న గోళ్ల నారాయణరావు; రెండు గల్పికలు పుస్తకాన్ని డాక్టర్ సుధాకర్‌కి అందిస్తున్న మురళీకృష్ణ



పుస్తక సమీక్ష చేస్తున్న కుమారస్వామి, సత్యాజీ



# సాహితీ స్రవంతి మూడు పుస్తకాల ఆవిష్కరణ

2021 అక్టోబరు 23వ తేదీ సాయంత్రం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో.. సాహితీ స్రవంతి ప్రచురించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. సాహిత్యంలో విప్లవం పుస్తకాన్ని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి ఆవిష్కరించి, తొలి కాపీని ఆంధ్రా ఆర్ట్స్ అకాడెమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావుకు అందించారు. కూతవేటు దూరంలో ఢిల్లీ 2 గల్పికల పుస్తకాన్ని ఎంబివికె కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ ఆవిష్కరించి మొదటి ప్రతిని రచయిత డాక్టర్ ఎస్ సుధాకర్‌కి అందజేశారు. ప్రచారరంగంలో వర్గపోరాటం పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజరు కె.లక్ష్మయ్య ఆవిష్కరించారు. తొలి కాపీని డాక్టర్ మాకినేని కిరణ్ స్వీకరించారు. అనంతరం సాహిత్యంలో విప్లవంలో పుస్తకాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి, కూతవేటు దూరంలో ఢిల్లీ పుస్తకాన్ని ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ పరిచయం చేశారు. డాక్టర్ సుధాకర్ తను రెండు గల్పికలు రాసిన నేపథ్యాన్ని వివరించారు. అనంతరం సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ ... కరోనా కాలం, దేశంలోని పరిస్థితుల నేపథ్యం బుద్ధిజీవులు అందరినీ దేశం కోసం ఆలోచించేలా చేస్తుందని అన్నారు. సామాన్యుల శ్రేయస్సు ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ తమ తమ శక్తియుక్తుల మేర సాహిత్య, సామాజిక రంగాల్లో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సాహితీ స్రవంతి, ప్రస్థానం రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలతో, ప్రచురణలు, ప్రత్యేక సంచికలతో సాహిత్య సేవ చేస్తాయని చెప్పారు. ఈ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్యరంజన్, ఉపాధ్యక్షులు వొరప్రసాద్, గనారా, శాంతిశ్రీ, సభ్యులు నారాయణ, చైతన్య ప్రసాద్, కెవెక్స్ రాజు, వల్లమూడి పద్మ తదితరులు పాల్గొన్నారు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 3 ▪ SANCHIKA - 2 ▪ KRISHNA ▪ November 2021
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.10.2021


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు


## సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం

సమగ్ర సాహిత్యం రచనలు




వెల.120/-

* వీరబ్రహ్మం నడిపిన ఉద్యమం చాలా విశాల దృక్పథంలో నడిచింది. బుద్ధుడిలాగా ఈయన స్వార్థాన్నీ, సామాజిక అసమానతల్నీ ద్వేషించారు. – జి.లక్ష్మీనరసయ్య
* వేమన, వీరబ్రహ్మంలు అసమానతల దోపిడీ వ్యవస్థని, కుల వ్యవస్థని, అంటరానితనాన్ని, మతాన్ని, మూఢాచారాలని, వేదాల్ని, యజ్ఞాల్ని, పౌరోహిత్యాన్ని మాత్రమే నిలదియ్యలేదు. అంతటితో ఆగలేదు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించారు. దాన్ని బోనెక్కించారు. అదే వాళ్లు చేసిన గొప్పనేరం. – జి.కళ్యాణరావు
* బ్రహ్మంగారి రచనలు 17వ శతాబ్దం నాటి రాజకీయ అస్థిరతకూ, ప్రజల కడగండ్లకూ పలురకాల మత సాంఘిక వైరుధ్యాలకూ తాత్విక భాష్యాలు. – ఎన్.గోపి
* వీరబ్రహ్మం తానేది చెప్తున్నారో దాన్ని ఆచరించి చూపడానికి వీలుగా కులమతాలకు అతీతంగా వివిధ వృత్తుల వారిని దగ్గరకు చేర్చుకున్నారు. – దార్ల వెంకటేశ్వరరావు
* బ్రహ్మంగారు చేసిన గురుబోధలు ఎంతో గట్టిగా ఉన్నా పామర జనం గుండెలలోకి సూటిగా దూసుకుపోయే బాణాల వంటివి. – ఆరుద్ర




కాళికాంబా సప్తశతి
వెల.100/-



పోతులూరి వీరబ్రహ్మం
సమగ్ర రచనలు
వెల.200/-




వీరబ్రహ్మం పద్యాలు
వెల.110/-



కర్మయోగి వీరబ్రహ్మం
వెల.30/-




వీరబ్రహ్మం రచనలు
వెల.70/-



విప్లవకవి యోగి వీరబ్రహ్మం
వెల.120/-




తాత్వికత - తులనాత్మకత
పోతులూరి వీరబ్రహ్మం
వెల.40/-



బహుముఖదార్శనికుడు-
బహుజనతాత్వికుడు
వెల.40/-



వేమన - వీరబ్రహ్మం -
ఒక సంభాషణ
వెల.25/-



వీరబ్రహ్మం
కవిత్వం : కవిత్వాంశాలు
వెల.45/-

20% ప్రత్యేక తగ్గింపుతో...

విజయవాడ : 9490099055
విశాఖపట్నం : 9490099058
గుంటూరు : 9490094430
ఏలూరు : 9440013188
ఒంగోలు : 9492292038
నెల్లూరు : 9490099279
కర్నూలు : 8500042738
అనంతపురం : 9554223317

Prajasakti Printers & Publishers.P(Ltd)
SBI A/c : 35712952033
IFSC Code : SBIN0001008
Governorpet Branch, Vijayawada

గూగుల్ పే, ఫోన్‌పే నెం : 9490099258
రిజిస్టర్ పోస్టులో పంపుతాం

ప్రజాశక్తి బుక్‌హౌస్
9490099057

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కార్నూలు, అనంతపురం